ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 52 పేజీలు: 10+4 వెల: 6.50

ఇ-కార్ రేసుపై ఎసిబి చార్జ్‌షీట్ దాఖలు 2
హార్ముజ్‌నుంచి భారత్‌కు మరో రెండు చమురు నౌకలు 5



## భారత్‌కు ఊహించని సవాళ్లు
5

యుద్ధంతో ఇంధన సంక్షోభం
చమురు, గ్యాస్‌కు లోటు రానివ్వం
వార్‌ను విరమింపచేయడానికి యత్నాలు: లోక్‌సభలో ప్రధాని

# వార్‌కు బ్రేక్!

యుద్ధ విరమణకు ఇరాన్ షరతులు
నష్టపరిహారం చెల్లించాలని పట్టు
భయంతోనే ట్రంప్ వెనక్కి తగ్గారన్న ఇరాన్
వెంటనే తగ్గిన ముడిచమురు ధరలు
మళ్లీ చెట్టెక్కిన పసిడి, వెండి

**5 రోజులు కాల్పుల విరమణ: ట్రంప్**



**వాషింగ్టన్ /టెహ్రాన్, మార్చి 23:** పశ్చిమాసియాలో 25 రోజులపాటు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య జరిగిన యుద్ధానికి స్వల్ప బ్రేక్ పడింది. ఐదురోజులపాటు యుద్ధం విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాలమధ్య చర్చలు సానుకూలంగాజరిగాయని, కీలకమైన డీల్ ఖరారవుతోందని అదే జరిగితే ఇఇరాన్‌లోని యురేనియం నిల్వలను మేం తీసుకుంటామని ట్రంప్‌ప్రకటించి ప్రపంచదేశాలను ఆశ్చర్యపరిచారు. గౌరవనీయ వ్యక్తితో చర్చలు జరుగుతున్నామని, నేరుగా మాట్లాడుతున్నట్లు తెలిపారు అయితే వ్యక్తి కొత్త సుప్రీం కమాండర్‌మొజ్తబా ఖమైనీ కాదన్నారు. ఆయన బతికున్నాడో లేదో కూడా తనకు తెలియదని అన్నారు. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లో తన అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్‌వన్ ఎక్కేముందు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒప్పందంకోసం >>2



## మూసీ బాధితులకు పునరావాసం కల్పిస్తాం

ప్రాజెక్టుపై సలహాల స్వీకరణకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
మూసీపై ఎలివేటెడ్ కారిడార్లు
మండలిలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి23:** మూసీ నది అభివృద్ధిలో భాగంగా ఎవరినీ నిరాశ్రయులను చేయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పరిధిలో ఉన్న బాధితులందరికీ పునరావాసం కల్పిస్తామన్నారు. మెరుగైన జీవన విధానానికి కావాల్సిన ప్రమాణాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ తగిన న్యాయం >>7

## తల్లిదండ్రుల సంక్షేమం కోసం బిడ్డల వేతనంలో 15% కోత



విద్వేష ప్రసంగాల నిరోధక బిల్లుకు కేబినెట్ ఆమోదం
గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం సోషల్ సెక్యూరిటీ యాక్ట్
రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ

కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నిపుణుల కమిటీ నివేదికకు ఆమోదం
తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
రూ.15 వేల కోట్లు చెల్లించి మెట్రో రైలు ఫేజ్1 స్వాధీనం
కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు, బిల్లులకు ఆమోదం

> వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15% లేదా రూ.10 వేలు.. ఏది తక్కువైతే ఆ మొత్తం కోత విధించి తల్లిదండ్రులకు అందజేసే బిల్లుకు కేబినెట్ ఆమోదం.

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** విద్వేష పూరిత ప్రసంగాలు.. విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026) ను మంత్రివర్గం ఆమోదించింది. మత సామరస్యాన్ని భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు పలు కీలక బిల్లులను ఆమోదించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తం వేతనాల నుంచి పరిహరించి తల్లిదండ్రులకు అందజేసే తల్లిదండ్రుల మద్దతు బిల్లును కేబినెట్ ఆమోదించింది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం.. భద్రత కోసం రూపొందించిన 'తెలంగాణ ప్లాట్ ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్ , సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ) యాక్ట్ , 2026' బిల్లును కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రంలో దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్స్, ప్లాట్ ఫారం బేస్డ్ వర్కర్స్ ఉన్నారు. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్ తో పాటు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ బిల్లు ప్రకారం.. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు వారి సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయడంతో వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో >>2



## రాజస్థాన్‌కు కరెంటు విక్రయం

విద్యుత్ డిస్కంలకు షాక్
'సింగరేణి' కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు ఊహించని షాక్ తగిలింది. సింగరేణి కాలరీస్ విద్యుత్‌ను తెలంగాణ విద్యుత్ పంపినీ సంస్థలకు కాకుండా రాజస్థాన్ కు విద్యుత్ విక్రయించాలని ఆ సంస్థ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌ను వినియోగించుకుంటున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌ను రాజస్థాన్ పంపిణీ సంస్థలకు >>2




## దానం'కు హైకోర్టు నోటీసులు

అనర్హత పిటిషన్‌పై విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి23:** బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా ఈ నోటీసులపై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దానం నాగేందర్ పార్టీ మారలేదని ఇచ్చిన తీర్పును ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిఫామ్‌పై పోటీ చేశారని, ఇది పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని మహేశ్వర్ రెడ్డి వాదించారు. ఈ >>2

## 'విద్యుత్' మృతులకు కోటి ప్రమాద బీమా

చెక్కులను అందజేసిన సిఎం రేవంత్



సోమవారం విద్యుత్‌శాఖలో ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందజేశారు. సోమవారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచాం సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందని సిఎం చెప్పారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దని భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని పేర్కొన్నారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చొప్పున చెక్కులను సిఎం అందజేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్, సింగరేణి ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఉద్యోగికి రూ.1 కోటీ భారీ ప్రమాద భీమా సదుపాయం కల్పించామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క >>2

## 'బియ్యం'లో భారీ స్కాం!





హరీష్ ఆరోపణలను ఖండించిన మంత్రి ఉత్తమ్
నీటిపారుదలలో హరీష్ హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరపాలన్న మంత్రి
పంపకాలు కుదరక కాకినాడలో ముక్కిపోయిన బియ్యం..
హౌస్ కమిటీతో విచారణ జరపాలని హరీష్ డిమాండ్

**హైదరాబాద్,మార్చి 23,ప్రభాతవార్త:** ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హరీష్‌రావుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని హరీశ్‌రావు ఆరోపించారు. హరీశ్‌రావు పైరవీ చేసిన వ్యక్తి ఎగుమతుల అవకాశం ఇవ్వడానికి అధికారులు వినకపోతే, వెంటనే దానిని స్కామ్ అనడం ఆయనకు అలవాటని ఎద్దేవా మంత్రి చేశారు. భారీకుంభకోణం జరిగిందని అవన్నీ నిరాధారమైన వ్యాఖ్యలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొట్టిపారేశారు. అయితే నీటిపారుదలశాఖలో హరీష్ హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తుచేయల్సి ఉంటుందనీ మంత్రి హెచ్చరించారు. సిబిఐ, ఇడి కేసుల్లో నిందితుడు ప్రేమ్‌చంద్ అనే వ్యక్తిని బియ్యం ఎగుమతుల కోసం సలహాదారుగా నియమించారా లేదా అని ఉత్తమ్‌ను హరీష్‌రావు నిలదీశారు. ఒక ఘరానా మోసగాడిన్ని సలహాదారుగా ఎలా పెట్టుకున్నారు? ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే ఈ మొత్తం వ్యవహారంపై హౌస్ కమిటీ వేసి విచారణ జరిపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హరీశ్‌రావు మాటలన్నీ అబద్ధాలేనని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎదురుదాడి చేశారు. తెలంగాణ చరిత్రలో మొదటిసారిగా ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేశామని, ఇందులో ఎలాంటి మధ్యవర్తులు లేరని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖరాఖండిగా చెప్పారు. సివిల్ సప్లైస్ విభాగంలో ఎలాంటి స్కామ్ జరగలేదని, హరీశ్‌రావు కేవలం సభను పక్కదారి పట్టించడానికి సత్యదూరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి ఆవేదన చెందారు. ఫిలిప్పీన్స్ దేశానికి బియ్యం ఎగుమతిపై మధ్యవర్తిలేరనీ తెలంగాణకు ఫిలిపీన్స్‌ప్రభుత్వాలకు మధ్య డైరెక్ట ఒప్పొందం ఉందని అక్కడ రాజకీయ సంక్షోభం తలెత్తడంతో కాకినాడ పోర్టులో బియ్యం నిలిచిపోయిన మాటావాస్తవమే అని అయితే >>2

## గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డు

అసెంబ్లీలో మంత్రి వివేక్

**హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:** గిగ్ వర్కర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొత్త చట్టాన్ని తీసుకురాబోతోందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై ప్రభుత్వంలో చర్చిసామని కార్మిక ఉపాధిశాఖ మంత్రి జి వివేక్ తెలిపారు. రాష్ట్ర శాసనసభలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో గిగ్ వర్కర్ల సమస్యపై లేవనెత్తిన ప్రశ్నకు స్పందిస్తూ, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య ప్రకటన చేశారు. ఈ గిగ్ వర్కర్స్ >>2



## రోహిత్‌రెడ్డి, మరో ఇద్దరికి పోలీసు కస్టడీ

మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన తాండూరు మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలకు మూడు రోజుల కస్టడీకి ఇస్తూ రాజేంద్రనగర్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులతో పాటు చేవెళ్ల పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా 11 మంది పట్టుబడగా ఇందులో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, ఢిల్లీకి చెందిన నమిత్ శర్మ, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం విదితమే. అయితే పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసులపై కాల్పు లు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చినందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్‌చేత పోలీసులపై >>2

## క్యూనెట్‌పై ఉక్కుపాదం

తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో 30 చోట్ల దాడులు.. 32 మంది అరెస్టు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది అమాయకులను మనీసర్క్యూలేట్ స్కీంలతో పాటు అనేకరకాల పథకాల పేరి ట వేల కోట్ల రూపాయలను లూటీ చేసిన క్యూనెట్ సంస్థలపై హైదరాబాద్ పోలీసులు మరోసారి దాడులు చేశారు. కొన్నేళ్లుగా చాపకింద నీరులా సా ఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐటి సెక్టార్‌లో పనిచేసేవారిని, నిరుద్యోగులను టార్గెట్ చేసి వారి నుంచి వేల రూపాయలు మొదలుకుని లక్షలాది రూపాయల వ రకు వసూలు చేసి ఆనక వారిని ఆత్మహత్యలకు పురిగొల్పులున్న క్యూనెట్ సంస్థలపై సిటీ సిసిఎస్ పోలీసులు పక్కా ఆధారాలు సేకరించి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, ఒడిషాలో దాడులు చేశారు. మొత్తం 30 చోట్ల దాడులు చేయగా 11 మంది మహిళలతో పాటు మొత్తం 32 మంది నేర గాళ్లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి నేరాలకు సంబంధించిన కీలక >>2



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో సిపి సజ్జనార్



సోమవారం షహీద్ దివస్ సందర్భంగా భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల చిత్రపటాల వద్ద ప్రయాగ్‌రాజ్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

# రోహిత్‌రెడ్డి, మరో ఇద్దరికి పోలీసు కస్టడీ

>> కాల్పులు జరిపినందుకు నమి త్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్ సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వుండగా, వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమంగా మాదకద్రవ్యాలు క లిగి వుండడంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో వీరిని మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని మొయినాబాద్ పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గత బుధవారం వాదనలు ముగియగా సోమవారం ఉద యం తీర్పు వెలువరించింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను మూడు రోజుల కస్టడీకి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. వీరిని మంగ ళవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి మొయినాబాద్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. గురువారం నాడు తిరిగి చం చల్‌గూడ జైలుకు తరలించనున్నారు.

## వాయిదా తీర్మానాలను తిరస్కరించిన స్పీకర్

**హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో సోమవారం బిఆర్ఎస్,బిజెపి,సిపిఐ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మాణంను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తిరస్కరించి టీబ్రేక్ ఇచ్చారు. బిజెపి సభ్యుడు పాల్వాయి హరీష్ జాబ్‌క్యాలెండర్ ప్రకటించాలని,కూనంనేని సాంబశివరావు ఫీజు రియాంబర్స్‌మెంట్‌పై వాయిదా తీర్మానం ఇచ్చారు. బిఆర్ఎస్ ఉపసభనాయకుడు హరీష్‌రావు ఫీజు రియంబర్స్‌మెంట్ అమలుపై కూడా వాయిదాతీర్మానం ఇచ్చారు.

# గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డు

>> బిల్లును సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. అనంతరం శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.గిగ్ వర్కర్ల అంశంపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు కూనంనేని సంబశివరావు,బీర్ల ఐలయ్య తదితరులు కూడా పాల్గొని అదనపు అంశాలు లేవనెత్తారు. ఈ బిల్లు శాసనసభ ఆమోదం పొందిన తర్వాత గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ బోర్డు గిగ్ వర్కర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం, వివాద పరిష్కార వ్యవస్థను పర్యవేక్షిస్తూ వారికి భద్రత, న్యాయం కల్పించే దిశగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. కూనంనేని సాంబశివరావు కనిపించే ఔట్‌సోర్స్ ఉద్యోగులపై కూడా శ్రద్ధతీసుకోవాలని కోరారు. దుకాణాలలో షాపుల్లో పనిచేసే వారికికూడా సంక్షేమ పథకాలు అందించాలనిపాల్వాయి హరీష్ కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు కెపివివేకనందా, సునీతలక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు ప్రశ్నలు వేశారు.

# నా కుమారుడు నిర్దోషి

## -ఎంపి పుట్టా మహేష్ తండ్రి సుధాకర్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ పాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో మాదకద్రవ్యాలు సేవిం చినట్లు పోలీసు నిర్వహించిన పరీక్షలో తేలిన ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ పూర్తిగా నిర్దోషిగా ఆయన తండ్రి మైదుకూరు ఎంఎల్ఏ పుట్టా సుధాకర్ తెలిపారు. సోమవారం నాడు ఆయన మైదుకూరులో మాట్లాడుతూ తన కుమారుడు గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ స్టెంట్ వేసు కున్నట్లు తెలిపారు. స్టెంట్ వేసుకున్న వ్యక్తి డ్రగ్స్ తీసుకోవడం సాధ్యం కాదని ఆయన వెల్లడించారు. ఇదే విషయాన్ని తాను ఎపి తెలుగుదేశం పె ద్దలకు వివరించినట్లు ఆయన తెలిపారు. తన కుమారుడు మహేష్ యాదవ్ కు ఎలాంటి డ్రగ్స్ అలవాటు లేదని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా నెగెటీవ్ వచ్చిందని ఆయన తెలిపారు. మొయినాబాద్‌లో పోలీసులు ఎలాంటి రక్త పరీక్షలు చేయకుండానే పా జిటివ్‌గా వుందని చెప్పడం సరికాదని సుధాకర్ తెలిపారు. ఈ కేసులో విచారణ పూర్తయితే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆయన వెల్లడి ంచారు.

# రూ.10 వేల కోట్లతో సల్మాన్ ఫిల్మ్ స్టూడియో

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రూ.10 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్, ఫిల్మ్ స్టూడియోను అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు దీనికి సబంధించి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు చెందిన సల్మాన్ ఖాన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే ప్రకటించింది. ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ లో ఛాంపియన్ షిప్ గోల్ఫ్ కోర్సు, హైఎండ్ విశ్రాంతి సౌకర్యాలు, రేస్ కోర్సు, క్యూరేటెడ్ నేచర్ ట్రైల్స్‌తో పాటు, ప్రీమియం రెసిడెన్షియల్ స్థలాలు కూడా ఉంటాయి. పెద్దఫార్మాట్ ప్రొడక్షన్‌లు, కంటెంట్, పోస్ట్‌ప్రొడక్షన్ సౌకర్యాలు, టాలెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు మద్దతు ఇవ్వడానికి రూపొందించబడిన అత్యాధునిక ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేసేందకు నిర్వహకులు అందుకు అవసరమైన కార్యాచరణను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# 'విద్యుత్' మృతులకు కోటి ప్రమాద బీమా

>> తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ప్రమాద భీమా పథకం ద్వారా విద్యుత్ సంస్థలోని 51వేల మందికిపైగా సింగరేణి సంస్థలోని 41వేల మంది,రాష్ట్రంలోని ఉద్యోగులు,పెన్షనర్లు 7.57 లక్షల మంది కుటుంబాల్లో ఈ పథకం భరోసాను కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కూడా పాల్గొన్నారు.

# భారీ స్కాం!

>> ఆదిత్యా బిర్లగోబల్ ట్రేడర్స్ మాత్రమే బాధ్యత వహిస్తోందని ఆయన వివరించారు. ఫిలిఫైన్స్‌కు లక్ష టన్నుల బియ్యం ఎగుమతి చేసుకోవడానికి ఒప్పందం చేసుకొన్నామని ఉత్తమ్ సభలో తెలిపారు.ఎఫ్‌సిఐ క్వింటాల్‌కు 3446 రూపాయలు చెల్లించే బియ్యంను ఫిలిప్ఫిన్‌సకు 3600రూపాయలకు22750 మె.ట ఎగుమతి చేశామని తెలిపారు. 81.90 కోట్ల రూపాయల ఆదాయం బియ్యం ఎగుమతి వల్ల వచ్చిందనిమంత్రి వివరించారు. ఫిలిపైన్స్ బియ్యం ఎగుమతితో ఒకకోటి 13లక్ష రూపాయల లాభం వచ్చిందని చెప్పారు. 77250 మె.ట బియ్యం ఎగుమతికి సిద్దంగా ఉందని ఆయన చెప్పారు. హరీష్‌రావు మాట్లాడుతూ సభను మంత్రితప్పుదారి పట్టిస్తున్నారని ప్రేమ్‌చంద్‌ఘర్గే అనే అడ్వైజర్ ఇచ్చిన సలహా వల్ల రాష్ట్రానికి నష్టం జరిగింది నిజం కాదా అని నిలదీశారు. పది లక్షల మెట్రిక్ టన్నులు ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తాం అని ఎంవోయూ చేసుకున్నాం అని, ఇదేదో పెద్ద ఇంటర్నేషనల్ అగ్రిమెంట్ అని, మా విజయం అని గొప్పలు చెప్పుకున్నారు..కాకినాడకు హెలికాఫ్టర్‌లో వెళ్ళి జెండా వూపి వచ్చారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఇదే పెద్ద స్కాంగా మారిందని అన్నారు.లక్ష మెట్రిక్ టన్నులు పిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తామని ఎంఒయూ చేసుకున్నారని తెలిపారు. నాఫెడ్ అనే సంస్థ కాకినాడ పోర్టుకు బియ్యం రాగానే డబ్బులు చెల్లిస్తామని అంటే.. ఆ సంస్థకు కాకుండా ప్రైవేటు సంస్థకు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 27,500 మెట్రిక్ టన్నుల వద్దనే ఎందుకు ఆగిపోయారని ప్రశ్నించారు. మరో 7500 మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో ముక్కిపోతున్నాయని తెలిపారు. 7500 మెట్రిక్ టన్నులు ఏడాదిగా పోర్టులో ఉంటే గోదాం, హ్యాండ్లింగ్ చార్జీల భారం పడవా?బియ్యం ముక్కిపోయాయా? పురుగులు పడ్డాయా అని నిలదీశారు. వాటాలు తేలకపోవడమే ఎగుమతి ఆగిపోవడానికి కారణం కాదా అని అడిగారు. వరి కొనుగోలు కేంద్రాలను త్వరగా మొదలుపెట్టాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. దొడ్డు వడ్లకు ఇవ్వకుండా కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తున్నారని ఆయన తెలిపారు. గత రబీలో సన్న వడ్ల బకాయిలు రూ.1200కోట్లుఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. యాసంగిలో వడ్లు కొంటారా లేదా మీ ముఖ్యమంత్రి ఎఫ్‌సిఐ యాభైలక్షల మె.ట మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పిందని అంటున్నారు. దీనితో రైతులు కొంటారా కొనరా అని ఎదురు చూస్తున్నారనీ చెప్పారు. ఉత్తమ్ మాట్లాడుతూ సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడిఉన్నామని తెలిపారు. బిఆర్ఎస్ హాయంలోనే బియ్యం కుంభకోణం జరిగిందని అన్నారు.గత ప్రభుత్వ కాలంలోని అన్ని అక్రమాలపై దర్యాపునత చేయాల్సి ఉంటుదని హెచ్చరించారు.

## వారం - వర్జ్యం

24-03-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
షష్ఠి సా.4.10
రోహిణి రా.7.06
వర్జ్యం : ఉ.11.41-మ.1.10, 2)రా.12.21-రా.1.51
దు.ఉ.8.34-ఉ.9.23,
2) రా.11.11-రా.12.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఎన్ని అవాంతరాలు వచ్చినా ధైర్యాన్ని వీడరు. సమస్యలతో సమరం సాగిస్తూ ముందుకు వెళతారు.

**వృషభం:** ఉన్నతాధి కారుల మెప్పు పొందడానికి ఎంతగానో కృషిచేసి శ్రమించి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**మిథునం:** కోర్టు కేసులు వాయిదాల మీద వాయిదాలు పడటం, కొంత ఇబ్బందులు కలిగించినా ఓర్పు వహించండి.

**కర్కాటకం:** నూతన ప్రయత్నాలు కలిసి వస్తాయి. అప్తుల నుండి విలువైన సమాచారం అందు కుంటారు. వాహనసౌఖ్యం కలదు.

**సింహం:** నూతన ఉద్యోగావకాశాలు లాభసాటిగా సాగుతాయి. ఆలయ సందర్శం చేసుకుంటారు. వస్త్రలాభం.

**కన్య :** మీరు సంతకాలు పెట్టేటటువంటి చెక్కులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పత్రాలను సరిచూసుకోండి.

**తుల :** దీర్ఘాలోచనలకు తెరవేస్తారు. కలిసిచ్చేకాలం వస్తే అన్ని అనుకూలిస్తాయని భావిస్తారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** అదృష్టానికి మించింది లేదని దృఢ నిర్ణయానికి వస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**ధనుస్సు:** వృత్తి, ఉద్యోగాల వరంగా మీస్థాయి యధాతథంగా ఉంటుంది. వాహనాల కొనుగోలు చేస్తారు.

**మకరం:** ముఖ్యమైన కార్యక్రమాలకు సంబంధించిన వ్యవహారాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**కుంభం:** భాగస్వాముల నుండి రావలసిన ముఖ్యమైన పత్రాలు మీకు అందే విషయంలో జాప్యం జరుగుతుంది.

**మీనం :** సహాయపడే వారి కన్నా వంకలు పెట్టి నిందించే వారు అధికమవుతారు. ప్రయాణాలు అనుకూలంగా వుంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాజస్థాన్‌కు కరెంటు విక్రయం

>> విక్రయించేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ విద్యుత్తును రాజస్థాన్ కు విక్రయించేందుకు సింగరేణి ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన సింగరేణి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పలు కారణాలు ఉన్నాయని సంబంధిత సింగరేణి అధికారవర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నుండి సరఫరా అయిన విద్యుత్ కు సంబంధించి తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణికి దాదాపు రూ.27,379 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ భారీ బాకాయిలు కారణంగా ఆర్థికంగా సింగరేణి ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆ సంస్థ మనుగడ ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో భారీగా బకాయిలు ఉన్న రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ లకు కాకుండా, సక్రమంగా చెల్లింపులు చేసే ఇతర రాష్ట్రాలకు, లేదా ఓపెన్ మార్కెట్లో కొత్త ప్లాంట్ కు సంబంధించి విద్యుత్ విక్రయించాలని సింగరేణి భావిస్తోంది. ఈ క్రమంలోనే సింగరేణి రాజస్థాన్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. సింగరేణి కొత్త ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్ రాజస్థాన్ కి సరఫరా చేసి, దానికి బదులుగా అక్కడ 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా సౌర విద్యుత్ ను వినియోగించుకోవాలనే ప్రతిపాదన కూడా ప్రస్తుతం పరిశీలిస్తోంది. అయితే సింగరేణి తీసుకునే ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా రాష్ట్రానికి అదనపు థర్మల్ విద్యుత్ ఆవశ్యకత ఉందని ప్రభుత్వం గుర్తించిన క్రమంలో ఇటీవల రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు అనుమతి ఇచ్చింది. ప్లాంట్ పక్కనే కొత్త యూనిట్ నిర్మాణం చేస్తే, భూసేకరణ భారం లేకుండా మెగా వాట్ కు రూ.12 కోట్ల ఖర్చు తోనే నిర్మాణం పూర్తయ్యేది. అయితే అది జరగలేదు. ఈ కరెంటును కాస్త రాజస్థాన్ రాష్ట్రానికి విక్రయిస్తే, తెలంగాణ కోసం మరోచోట ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే వేల ఎకరాల భూమిని సేకరించాల్సి వస్తుంది. ఇది రాష్ట్ర ఖజానా పైన కూడా అదనపు ఆర్థిక భారాన్ని చేస్తుంది. ఇదే సమయంలో పర్యావరణ నిబంధనలు కూడా కఠిన తరంగా మారుతున్న క్రమంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కొత్త అనుమతులను పొందడం కూడా కష్టంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం చేతిలో ఉన్న ఈ అవకాశాన్ని కోల్పోతే, భవిష్యత్తులో తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన విద్యుత్తు లభ్యత తగ్గే ప్రమాదం ఉందని విద్యుత్ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి టెండర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ కన్సల్టెన్సీ సంస్థల కోసం ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం రాజకీయంగా దుమారం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో బకాయిల సమస్యను పరిష్కరించుకుని, ఈ ఎనిమిది వందల మెగావాట్ల విద్యుత్ ను రాష్ట్ర అవసరాలకే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది.

# క్యూనెట్‌పై ఉక్కుపాదం

>> పత్రాలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ కొత్వాల్ వి. సి సజ్జనర్ సోమవారం మీడియాకు వెల్ల డించారు. కొన్ని నెలల క్రితం మెదక్ జిల్లా గౌరారంలో హరికృష్ణ అనే నిరుద్యోగి క్యూనెట్ సంస్థలో ఐదు లక్షల రూపాయలను అధిక వడ్డీతో పాటు మంచి ఆదాయం కోసం పెట్టుబడులు పెట్టాడు. అయితే దీని తరువాత ఎలాంటి ఆదాయం రాకపోగా వ డ్డీ కూడా లభించక పోవడంతో అతను ఆ త్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా ఆ యువకుడు తన ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ లేఖ రాశాడు. ఈ లేఖ ఆధారంగా స్థానిక పోలీసులు క్యూనెట్ సంస్థలపై కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో క్యూనెట్ సంస్థల గురించి సిటీ పోలీసులు మరింత సమాచారం సేకరించా రు. కొంత కాలంగా ఈ సంస్థలు సాఫ్ట్‌వేర్, ఐటి కంపెనీల ఉద్యోగులను ఒక పథకం ప్రకారం ఆకర్షించి వారి వద్ద నుంచి పది వేల రూపాయలు మొదలుకొని ఐదు లక్షల రూపాయల వరకు అధిక వడ్డీ, అదనపు ఆదాయం పేరిట వసూలు చేస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలో అనేక మందికి క్యూనెట్ సంస్థలు బ్యాంకుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు ఇప్పించినట్లు వెల్లడయ్యింది. వీరిని ఆకర్షించే ందుకు మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్ సహా ఢిల్లీ, ముంబాయి, హరియాణలోని గురుగాం, పూణెలలో క్యూనెట్ సంస్థల తరపున కొందరు పార్టీలు ఇచ్చేవారు. తమ సంస్థల్లో భారీగా పెట్టు బడులు పెట్టిన వారిలో కొందరిని ఎంపిక చేసి విదేశాలకు పార్టీల పేరిట తీసుకువెళ్లేవారు. వీరిని చూసి మరికొందరిచేత పెట్టుబడులు ఆకర్షించే వారు. ఇలా కొన్నేళ్లుగా పదుల కోట్ల రూపాయలను క్యూనెట్ సంస్థలు అక్రమంగా సేకరించాయి. ఈ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారు వద్దనుకుని బయటకు వెళ్లాలంటే మరో ఐదుగురిని చేర్పిస్తే తప్ప వదిలేవారు కాదు. అప్పటికీ వీరి డిపాజిట్లు ఇ స్తారన్న గ్యారంటీ లేదు. 1997 నుంచి పనిచేస్తు న్న క్యూనెట్ సంస్థలు ఒక పథకం ప్రకారం సెలబ్రటీలతో ప్రచారం చేయించి అమాయకులను లూ టీ చేస్తోంది. ఇటీవల కాలంలో ఈ సంస్థల మోసాలు, ఘోరాలు పెరగడంతో సిటీ సిసిఎస్ పోలీసులు నిఘా వుంచారు. దీనిపై మరింత సమాచా రం కోసం సిటీ ఎస్‌బి జాయింట్ సిపి విజయ్‌కు మార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దీని తరువాత 30 ప్రత్యేక బృందాలు తెలంగాణతో పాటు ఎపి కర్నాటక, ఒడిషాలలో 30 చోట్ల దాడులు చేబట్టింది. ఈ దాడుల్లో హైదరాబాద్‌లో క్యూనెట్ తరపున గ్రూప్ లీడర్లుగా వు న్న కాంతబత్తుని రత్నాకర్ రెడ్డి, సమ్మినేని నీరజ్‌కుమార్ మణికంఠ, అనూష వేమిరెడ్డి, మైసా అభిరాం, రేవంత్ మాపాక్షి, దొడ్డ కిషన్ కుమార్ రెడ్డి, సమ్మినేని నరసింహారావు, సంధ్య భవాని, మ ణిశంకర్, బేహర మాధురి, సునందిని మేడి, మోటివేటర్లుగా వున్న నవరతన్, సుమంత్, గాయత్రి, సాయికిరణ్, ప్రీతం, జయంత్, విజయ అమూ ల్య, నరేందర్, శ్రవణ్, హిమబిందు, వరంగల్‌కు చెందిన సూర్యతేజ, హరికృష్ణ, వైజాగ్‌కు చెందిన స్వాతి, నర్సీపట్నంకు చెందిన రిజ్వాన్, నెల్లూ రుకు చెందిన మణిశంకర పృథ్వీ, ఏలూరుకు చెందిన తలారి పాల్ ప్రశాంత్ కుమార్, నంద్యాలకు చెందిన నాగ యశ్వంత్, ప్రత్యూష, బెల్లంపల్లికి చెందిన బంగారి ప్రత్యూష, మహబూబ్‌నగర్ కు చెందిన కాల్వ చందన, ఒడిషాకు చెందిన కిరణ్‌కు మార్ సాహులను అరెస్టు చేశారు. ఈ కేసులో మరింత మంది వున్నారని, వీరికోసం గాలిస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ సంస్థల గోల్‌మాల్ వ్యవహారాలపై ఈడీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**క్యూనెట్ సంస్థల మోసాలపై అన్నివర్గాల వారు అప్రమత్తంగా వుండాలి...సజ్జనర్ వినతి**

ఇదిలావుండగా క్యూనెట్ సంస్థలు 1997 నుంచి ప్రతి ఐదేళ్లకు ఒకసారి పేరుమార్చుకుని అమాయకులను మోసం చేయడం పరిపాటిగా పెట్టుకుం దని కొత్వాల్ సజ్జనర్ తెలిపారు. తాజాగా సాఫ్ట్‌వేర్, ఐటి కంపెనీల ఉద్యోగులను టార్గెట్ చేసుకుని కోట్లాది రూపాయలను లూటీ చేసిందని ఆయన తెలిపారు. ఈ సంస్థలతో పాటు దీనికి తోక కంపెనీగా వున్న విహాంగ్ కంపెనీ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. ఈ సంస్థల మోసా లపై ప్రజల వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అదనపు పోలీసు కమిష నర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్‌తో పాటు ఎస్‌బి జాయింట్ సిపి విజయ్ కుమార్, సిసిఎస్ డిసిపి చైతన్య కుమార్, సైబర్ క్రైం డిసిపి అరవింద్ బా బు సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.



సోమవారం గౌహతిలో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ఎజిపి మద్దతుదారులు

# బిడ్డల వేతనంలో 15% కోత

>> మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్ కు అనుగుణంగా స్వల్ప మార్పులతో కేబినెట్ ఆమోదించింది. హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న 69 కిలోమీటర్ల మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రుణబారం సహా మొత్తం రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం ఎల్ అండ్ టీకి చెల్లించి ఫేజ్ 1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్ కమిటీ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం తరపున ఈ నిధుల చెల్లింపులు, లావాదేవీల బాధ్యతను నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు అప్పగించింది. హెచ్ఎంఆర్ఎల్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదుల పై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. గతంలో జరిగిన అడ్వకేట్ దంపతులు వామనరావు హత్యల నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను కేబినెట్ ఆమోదించింది. ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ నివేదిక తయారు చేశారు. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను కేబినెట్ చర్చించింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష ్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం.. మంత్రివర్గం ఉప సంఘం సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ను నియమించారు.

# దానం'కు హైకోర్టు నోటీసులు

>> నేపథ్యంలో స్పీకర్ తీర్పును రద్దు చేసి, దానంపై అనర్హత వేటు వేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ప్రతివాదులుగా ఉన్న దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ స్పీకర్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా దానం నాగేందర్, స్పీకర్ తమ వివరణలను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ అంశంపై హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతోందనేది ఆసక్తికరంగా మారింది.

## ఎ1గాకెటిఆర్, ఎ2గా అర్వింద్‌కుమార్, ఎ3 బిఎల్ఎన్‌రెడ్డి, ఎ4గా మల్లేశ్వరరావు

### ఇ-కార్ రేసుపై ఎసిబి చార్జ్‌షీట్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** ఫార్ములా ఈ-కార్ రేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సోమవారం నాంపల్లి కోర్టులో ఏసీబీ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ఫార్ములా ఈ కారు రేసులో ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

ఇందులో ఏ1గా మాజీ మంత్రి కెటిఆర్,ఏ2గా సస్పెండెడ్ సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్‌కుమార్,ఏ3 హెచ్ఎండి మాజీ అధికారి బిఎల్ఎన్‌రెడ్డి,ఏ4గా ఫార్ములా ఈ కారు రేస్ తరఫున స్పోర్ట్స్ కన్సల్‌టెంట్‌గా వ్యవహరించిన కిరణ్ మల్లేశ్వరరావు, ఏ5 బ్రిటన్‌లోని ఏఫ్ఈఓ పేర్కొన్నారు. ఈ కేసులో రూ.55 కోట్లపై నిదులు అక్రమంగా బ్రిటన్‌కు మళ్లించినట్లు ఏసీబీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఇదంతా నిబంధనలకు విరుద్దంగా జరిగిందని వెల్లడించింది.

# వార్‌కు బ్రేక్!

>> ఇరుదేశాలమధ్య 15 అంశాలపై చర్చలుజరుగుతున్నాయని, వీటిలో ఇరాన్ అణు ఆయుధాలను పూర్తిగా వదులుకోవడం తమ మూడు ప్రాధాన్యాలలో ఒకటిగా ఉందన్నారు. ఒప్పందానికి బలమైన కారణం ఉందని, దేనికీ గ్యారంటీ లేదన్నారు. 90శాతంఅంశాలపై ఇరుపక్షాల్లోను అంగీకారం కుదిరిందన్నారు. ఈ చర్చల్లో తన సలహాదారు స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జారెడ్‌కుష్నర్‌లు కూడా పాల్గొన్నట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. అలాగే చర్చలకు రావాలని ఇరాన్‌ముందుగా తానే కోరిందని, తాము ముందుగా కోరలేదన్నారు. అతిపెద్ద ఇంధన ప్రాజెక్టుపై దాడిచేసేందుకు సిద్ధం అయ్యామని చివరినిమిషంలో డీల్‌కోరారన్నారు అయితే మేం కూడా ఒప్పందానికి సిద్ధమేనని అది మంచి ఒప్పందంగా అయితే ముందుకువెళతామన్నారు. అందుకే ఐదురోజులపాటు యుద్ధం కాల్పులు క్షిపణిదాడులు మొత్తం నిలిపివేస్తున్నామని, చర్చలు కొలిక్కిరాకుంటే తమ దారి తమదేనని ట్రంప్ అన్నారు. హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోపు పునరుద్ధరించకపోతే భారీ ఎత్తున దాడులుచేస్తామని, ఇంధన ప్రాజెక్టులపై దాడులుచేసి ధ్వంసంచేస్తామని ట్రంప్ హెచ్చరించిన 24 గంటలు గడవకముందే కాల్పులకు బ్రేక్ ఇస్తున్నట్లుప్రకటించడం గమనార్హం. స్వదేశంలోనే అధికారగణంనుంచి ట్రంప్‌పై అసమ్మతి పెరిగింది. ప్రజల్లోకూడా ట్రంప్ పట్లరేటింగ్ తగ్గింది. ఇరాన్‌పై యుద్ధనిర్ణయం ట్రంప్ ఏకపక్ష నిర్ణయమని, కేవలం ఇజ్రాయెల్‌మెప్పుకోసమే యుద్ధంచేసారని విమర్శలు చేసారు. అలాగే యుద్ధం ఖర్చు తడిసిమోపెడవుతున్నది. 20వేల కోట్ల డాలర్లు కావాలని సెంట్‌కామ్ ప్రభుత్వానికి లేఖ ఇచ్చిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ఆర్థికభారం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గమనించడం, ప్రపంచదేశాల్లో అత్యధికశాతం వ్యతిరేకించడం కూడా ట్రంప్ రూటు మార్చడానికి కారణంగా చెపుతున్నారు.

**చర్చలకు మేం కోరలేదు..ట్రంప్ భయంతోనే తగ్గారు..ఇరాన్**

కాగాట్రంప్ ప్రకటనపై ఇరాన్ సంప్రదించింది. విద్యుత్‌కేంద్రాలపై దాడులుచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించడంతో ఆయన వెనక్కి తగ్గారని ఇరాన్ టివి ఇరిబ్ తెలిపింది. ఆఫ్ఘన్‌లోని ఇరాన్‌రాయబార కార్యాలయంకూడా ఇలాగే వ్యాఖ్యలుచేసింది. తమ పవర్‌ప్లాంట్‌లను అమెరికా టార్గెట్‌చేస్తే హార్ముజ్‌జలసంధిని పూర్తిగామూసివేస్తామని హెచ్చరించింది. ఇజ్రాయెల్ విద్యుత్‌కేంద్రాలు, ఇంధన మౌలిక కేంద్రాలు, సమాచార ప్రసార సాంకేతిక వ్యవస్థలనుకూడా తాము టార్గెట్‌చేస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ఇజ్రాయెల్‌కూడా యుద్ధవిరమణకు రావాలని, భవిష్యత్తులో ఇరాన్‌పై దాడులుచేయకూడదని ఇరాన్ షరతులు విధించింది. భవిష్యత్తులో యుద్ధం ఉండదని హామీ ఇవ్వాలని, అమెరికా సైనిక స్థావరాలను తొలగించాలని, యుద్ధసమయంనష్టానికి పరిహారం ఇవ్వాలని, హార్ముజ్‌పై పూర్తిస్థాయి నియంత్రణ మాదేనని, మా దేశపరిధిలో ఉన్న జలసంధిపై వేరొకరి పెత్తనం సహించబోమని ప్రకటించింది. విద్వేషపూరిత మీడియా ప్రచారంచేసిన వారిపై విచారణజరిపించి వారిని మాకు అప్పగించాలని షరతులు విధించింది.

**వెంటనే తగ్గిన ముడిచమురు పెరిగిన పసిడిధరలు...**

ఇరాన్‌యుద్ధానికి ఐదురోజులుబ్రేక్ ఇస్తున్నట్లు ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో పోస్టుచేసిన వెనువెంటనే చమురుధరలు బ్యారెల్ 96 డాలర్లకు దిగివచ్చాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియేట్‌కూడా 13 డాలర్లు తగ్గి 85 డాలర్లకు చేరింది. అలాగే బంగారం ధరలు కూడా ఏకాఎకిన తగ్గి మళ్లీపెరిగాయి. ట్రంప్‌ప్రకటన వెలువడకముందుబంగారంపై 10వేలకుపైగా తగ్గుదలనమోదుచేసింది. అలాగే వెండిధరల్లో కూడా కిలో ఒక్కంటికి రూ.20వేలు తగ్గింది. 24 కేరట్ల బంగారం రూ.1,35,650వద్ద కొనసాగింది. యుద్ధవిరమణ జరిగి చర్చలు సానుకూలంగా ముగిస్తే మరింతగా ధరలు పెరుగుతాయని అంచనా. ఇదిలా ఉంటే స్పాట్‌మార్కెట్‌లో బంగారం ధరలు ఔన్స్ ఒక్కంటికి 4099 డాలర్లకుచేరింది. రాత్రి ట్రంప్‌ప్రకటనచేసిన వెనువెంటనే 4474 డాలర్లకు పెరిగింది. వెండి ఔన్స్ ఒక్కంటికి 70 డాలర్లకు చేరింది. కిలో ఒక్కంటికి స్పాట్ మార్కెట్‌లో రూ.2.32 లక్షలుగా కొనసాగింది.

**ఇరాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు...**

ఓవైపుయుద్ధానికి ఐదురోజులు బ్రేక్ ఇచ్చామని అమెరికా అధ్యక్షుడే స్వయంగాచెపితే ఇజ్రాయెల్‌మాత్రం ఇరాన్‌పై దాడులుకొనసాగించింది. రాజధాని నగరం టెహ్రాన్‌పై దాడులు ముమ్మరంచేసింది. ఉగ్రవాద పాలననుంచి ఇరాన్‌కు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. టెహ్రాన్ వ్యాప్తంగా ఉగ్రవాద పాలన,మౌలిక సదుపాయాలు టార్గెట్‌గా దాడులుచేసామని, ఐడిఎఫ్ ప్రకటించింది. ఇరాన్‌కూడా ఖతార్, సౌదీ అరేబియా, కువైట్; యుఎఇతోసహా గల్ఫ్‌లోని చమురు ఏంద్రాలే లక్ష్యంగా దాడులుచేసింది.

## కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంత్రి శ్రీధర్‌బాబు

### తెలంగాణ నుంచి నలుగురుని ఎంపిక చేసిన ఎఐసిసి

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త: కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెలంగాణ నుంచి నలుగురు నాయకులను ఎఐసిసి ఎంపిక చేసింది. తెలంగాణ ఐటి పారిశ్రామిక మంత్రిమంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, విప్ బలమూరి వెంకట్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లను ఎంపిక చేశారు. కేరళ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలంగాణలో బుల్డోజర్‌రాజ్ నడుస్తోందని ఇటీవల విమర్శలు చేసిన నేపథ్యంలో ఎఐసిసి కేరళ ఎన్నికల ప్రచారానికి తెలంగాణకు చెందిన నలుగురిని ఎంపిక చేయడం ప్రాధాన్యత సంతరించుకొంది.మంత్రి శ్రీధర్ బాబు రెండు జిల్లాల ఇంచార్జ్ గా ఉంటారు. ఆదివారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ త్రివేండ్రంలోని కేరళ పిసిసి కార్యాలయంలో తెలంగాణ నాయకులతో సమావేశం అయ్యారు.ఏప్రిల్ 7వ తేదీ వరకు వారికి కేటాయించిన ప్రాంతాలలో వీరు ఎన్నికల కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది.ఇది ఇలా ఉంటే కేంద్రంలో బిజెపి తెలంగాణలో కాంగ్రెస్ పేరుల ఐండ్లు కూల్చుతున్నారని కేరళ సిఎం పినరయివిజయన్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి ప్రజాభిప్రాయం తనకు అనుకూలంగా కూడగట్టుకోవడానికి శ్రమిస్తున్నారు.



డిసిఎంకు ఢీకొట్టిన కారు

### హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

## మాగంటి కుమార్తెలకు గాయాలు

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 23, ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆర్‌జీఐ విమానాశ్రయం నుంచి గచ్చిబౌలి వైపు మాగంటి కుమార్తెలు మాగంటి అక్షర నాగ(23), మాగంటి దిశిర(19), దుర్గ సాయి అరికెపూడి(20), మేడిపల్లి అభిరామ్‌రెడ్డి(21)లు టీజీపీఏ కూడలిని దాటుతున్న క్రమంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ముందు వెళ్తున్న ఒక డీసీఎం వాహనం వెనుక టైరు ఒక్కసారిగా విడి పోయి వాహనం నెమ్మదించింది. కాగా ఫార్చ్యూనర్ కారు నడుపుతున్న దుర్గ సాయి అరికెపూడికి ఒక్కసారిగా అదుపుతప్పడంతో నేరుగా వెళ్లి డిసిఎం వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి గాయలయ్యాయి. కాగా వీరిని ఐఏజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి స్థిమితంగానే ఉన్నట్లు మాగంటి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా అరికెపూడి దుర్గ సాయి సైతం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సమీప బంధువుగా తెలుస్తుంది.

## విజయవాడ సిఐడి పోలీసుల ఎదుట హాజరైన బీహార్ ఐజి సునీల్‌నాయక్

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: ఎపి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును గతంలో చిత్ర హింసలకు గురిచేసిన కేసుకు సంబంధించి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నాటి ఎపి సిఐడి డిఐజి, ప్రస్తుత బిహార్ కేడర్ ఐజి సునీల్ నాయక్ సోమవారం నాడు ఈ కేసును విచారిస్తున్న విజయవాడ సిఐడి బృందం ఎదుట హాజరయ్యారు. ఇప్పటికే పలుమార్లు ఆయనను విచారించిన విజయవాడ సిఐడి పోలీసులు తాజాగా మరో మారు నాలుగు గంటల పాటు విచారించి నాటి ఘటనలో ఆయన వాంగ్మూలం నమోదు చేసింది.

## అసాధారణ విజయాన్ని సొంతం చేసుకున్న నారాయణ విద్యార్థి

### ప్రపంచస్థాయి అండర్-6 చెస్ విభాగంలో పదో ర్యాంకు సాధించిన విద్యార్థి క్షివ్ చకావె

### జాతీయస్థాయిలో మూడో ర్యాంకు కైవసం



హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త : నారాయణ స్కూల్ విద్యార్థి క్షివ్ చకావే అసాధారణ విజయాన్ని నమోదు చేశాడు. అండర్-6చెస్ విభాగంలో ప్రపంచస్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో 3 ర్యాంకు కైవసం చేసుకుని ప్రతభ చాటాడు. ఫిడె, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు పొందిన ఆల్‌ఇండియా ఓపెన్ ఫిడె రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చూపి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాడు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో అండర్-6 విభాగంలో మూడో ర్యాంకును సాధించి ట్రోఫిని కైవసం చేసుకున్నాడు. 1560 ఫిడె రేటింగ్‌ను సైతం సాధించాడు. తద్వారా అండర్-6 విభాగంలో ప్రపంచంలోనే టాప్ 10 క్రిడాకారుల్లో ఒకరిగా నిలిచాడు. మహారాష్ట్రలో తన వయసు విభాగంలో నంబర్ వన్ క్రీడాకారుడిగా స్థానం దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఏడాది జూన్‌లో జరగనున్న అండర్-7 చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు చకావే సిద్ధమవుతున్నాడు. కాగా.. ఈ విజయంపై నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ... అత్యంత పిన్న వయసులో క్షివ్ సాధించిన విజయం కేవలం ఒక మైలు రాయి మాత్రమే కాదని, చెస్ క్రీడపట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తోందన్నారు. నారాయణ స్కూళ్లలో ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని పెంపొందించాలని, వారి కలలను సాకారం చేసే దిశగా కృషి జరుగుతుందని చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లో యువ విజేతలను తీర్చి దిద్దడంలో నారాయణ స్కూళ్లు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## కొడంగల్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

### ముందుకొచ్చిన ఇకొపామ్ కంపెనీ

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: కొడంగల్‌లో ఆయుల్‌ఫామ్ ఫ్యాక్టరిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో ఆయిఫామ్ ఫ్యాక్టరితోపాటు రిఫైనరీ ఏర్పాటు చేసేందుకు ఇకొ ఫామ్ కంపెనీ ప్రతినిధులు ముందు కొచ్చారని తెలిపారు. భూ కేటాయింపు పూర్తయిన సంవత్సరంలోపే రూ. 75 కోట్లతో మిల్లును నిర్మిస్తామని హామి ఇచ్చారు. ఆయిల్‌ఫామ్ మిల్లుతో ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 1000మందికి ఉపాధి కలుగు తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్‌భాష, అధికారులు, వికారాబాద్ జిల్లా ఉద్యాన అధికా రులు, ఇకోఫామ్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశాం

### రాజ్యసభలో బొగ్గు మంత్రిత్వ శాఖపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: ఒకప్పుడు బొగ్గు బ్లాకులను పేపర్‌పై రాసి ఇష్టం వచ్చినట్టు కేటాయించేవారని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత మోడీ నేతృత్వంలో బొగ్గు రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పారదర్శకంగా వేలం ద్వారా ఎలాంటి అవినీతికి తావులేకుండా బొగ్గు బ్లాకులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో బొగ్గు మంత్రిత్వ శాఖపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. దేశంలో థర్మల్ విద్యుత్ లో 73 శాతం బొగ్గు ద్వారానే జరుగుతుందన్నారు. గతంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉండేదని, వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాలకు కూడా సరిపడా విద్యుత్ సరఫరా ఉండేది కాదన్నారు. మోదీ నేతృత్వంలో నయాభారత్ సంకల్పిత లక్ష్యాలను చేరుకునే దిశగా దూసుకెళ్తుందన్నారు. దేశంలో ఎక్కడ కూడా విద్యుత్ కొరత లేదని, ఇందులో బొగ్గు పాత్ర చాలా కీలకం అన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 80శాతం బొగ్గును సరఫరా చేస్తున్నాం. సిమెంట్, స్టీల్, ఫర్టిలైజర్ రంగాలకు కూడా బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని, దేశంలో దాదాపు 70 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు. బొగ్గు నిల్వలో భారత్.. ప్రపంచంలోనే ఐదో స్థానంలో ఉందని, బొగ్గు ఉత్పత్తిలో, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని, కోలిండియా ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిలిచిందన్నారు. ఎప్పటికప్పుడు మోదీ బొగ్గు రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, పర్యావరణాన్ని కాపాడుకోవడం, కాలుష్యాన్ని తగ్గించడం కోసం కోల్ గ్యాసిఫికేషన్ సాంకేతికతను ప్రారంభించామన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా ఏడు ప్రాజెక్టుల ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాటిలో 4 ప్రాజెక్టుల భూమి పూజ కూడా జరిగిందన్నారు. ఇందుకోసం రూ.64 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని,4 మహారాష్ట్రలో, 2 ఒడిశాలో, ఒకటి పశ్చిమ బెంగాల్‌లో ఉనాయన్నారు. కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు దిగుమతులు తగ్గుతాయి. కోల్ గ్యాసిఫికేషన్ కోసం ఇన్సెంటివ్స్ కూడా అందజేస్తున్నామని, శాస్త్రీయంగా గనులను మూసేయాలన్నది ప్రధాని నరేంద్రమోదీ సంకల్పం అన్నారు. 143 బొగ్గు గనులను శాస్త్రీయంగా క్లోజ్ చేసే పనులు ప్రారంభించామని, 143 నోడల్ అధికారులు ఈ విషయంలో అంకిత భావంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి, ఈ పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేస్తున్నామని, 2028 నాటికి 143 గనులను మూసేసి, అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, దీంతో స్థానిక ప్రజలకు ఉపాధి కూడా పెరుగుతుందని వెల్లడించారు.

### 7వ విడత క్రిటికల్ మినరల్ వేలం ప్రక్రియను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

క్రిటికల్ మినరల్స్‌కు 7వ విడత వేలం ప్రక్రియ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన డిఎంఎఫ్ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. క్రిటికల్ మినరల్స్‌కు 7వ విడత వేలం ప్రక్రియ సంతోషంగా ఉందని, ఇందులో మొత్తం 19 బ్లాక్స్‌కు వేలం వేస్తున్నామని, ఇప్పటివరకు జరిగిన 6 విడతల్లో మొత్తం 46 క్రిటికల్ మినరల్ బ్లాక్స్‌ను విజయవంతంగా వేలం నిర్వహించామన్నారు. ఈ వేలంలో తొలిసారిగా నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ గుర్తించిన బ్లాక్స్‌ను కూడా చేర్చామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని గనుల రంగం ఆధునిక సాంకేతిక వినియోగంతో సంస్కరణలు, పారదర్శకత, సమర్థత దిశగా ముందుకు సాగుతుందన్నారు. గ్లోబల్ టెక్నాలజీ, ఎనర్జీ ట్రాన్సిషన్ విషయంలో క్రిటికల్ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి ఉత్పత్తి, రక్షణ రంగంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని, గనుల రంగం తక్కువ కాలంలోనే గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఈ ప్రయాణంలో ప్రైవేటు రంగం కూడా ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. అభివృద్ధి అనేది సమతుల్యంగా ఉండాలని, పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండేలా చూడాలన్నారు. గనుల వల్ల ప్రభావితమయ్యే స్థానిక ప్రజలకు అభివృద్ధి ద్వారా లాభం చేకూరాలనే ఉద్దేశంతో జిల్లాల మినరల్ ఫౌండేషన్లు స్థాపించాం. గనులకోసం తమ స్థలాలను ఇచ్చేసిన స్థానికుల సంక్షేమం మనందరికి ప్రాధాన్యత కావాలని అన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ద్వారా వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడం, గనుల ప్రభావిత ప్రాంతాల్లో విద్య, వైద్యం వంటి కనీస అవసరాలను కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. మరో ముఖ్యంగా యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రత్యేకమైన వ్యూహాలతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతేడాది ఆస్పిరేషనల్ డిఎంఎఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించామని, జిల్లాల మినరల్ ఫౌండేషన్లను ఈ కార్యక్రమంతో అనుసంధానం చేసి చాలా వెనుకబడిన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దేశంలోని 23 రాష్ట్రాల్లో 656 జిల్లాల్లో డిఎంఎఫ్ ఏర్పాటయ్యాయి. మొత్తం డిఎంఎఫ్ కింద రూ.1.24 లక్షల కోట్లలో రూ.93,500 కోట్లు ఆస్పిరేషన్ జిల్లాల నుంచి వస్తున్నాయన్నారు. సుమారు 70 అభివృద్ధి పనులు ఈ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. గనుల మూత అనేది చాలా ప్రాధాన్యమైన అంశం అన్నారు. 2025 నాటికి 147 గనులను శాస్త్రీయంగా మూసేయాలన్న లక్ష్యం పెట్టుకున్నాం. ఆ తర్వాత ఈ ప్రాంతాల్లో సుస్థిరమైన అభివృద్ధి చేయాలని నిశ్చయించుకున్నామని పేర్కొన్నారు.

# బిజెపి చలో అసెంబ్లీ ఉద్రిక్తం

### ఎక్కడికక్కడ అరెస్టుల పరంపర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసిన బిజెపి

హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక వైఖరి, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది బిజెపి నాయకులు, కార్యకర్తలను సోమవారం తీవ్ర ఉద్రిక్తతల మధ్య 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపట్టారు. నాంపల్లి నుంచి అసెంబ్లీ వైపునకు అనేక మంది కార్యకర్తలు దూసుకువెళ్లారు. బారికేడ్లు దాటేందుకు యత్నించిన నాయ కులను, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని ఎక్కడికక్కడ అరెస్టుల పరంపర చేపట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పోలీసుల కళ్ళుగప్పి సామాన్య ప్రయాణికుడివలే ఆటోలో అసెంబ్లీ గేటు వద్దకు వచ్చి తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం చేసిం దని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి, అరాచక, కమీషన్ల పాల నను నిలదీస్తూ ఈ నిరసన కార్య క్రమం కొనసాగింది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా, వైద్యం రంగాలకు సరిగ్గా నిధులు కేటాయించక పోవడంపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని దుయ్యబట్టారు. 6 గ్యారంటీలు ఎక్కడా?, అంటూ అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిజెపి నిలదీసింది. మోసపూరిత హామీలతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిందని, ప్రభుత్వాన్ని ఎండగడ తామని హెచ్చరిచారు. పేదల బతుకులతో ఆడు కుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబు తామని హెచ్చరించారు. అసెంబ్లీ గేట్ వద్ద బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు, ప్రధానకార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షు రాలు బండా కార్తీక్‌రెడ్డి తదితరులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు.



అసెంబ్లీ వద్ద రాంచందర్‌రావును అరెస్టు చేసిన పోలీసులు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్ దుర్మార్గం: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: ఆరు గ్యారంటీల అమలుపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అరెస్ట్ చేస్తారా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను ఏం చేయాలి? అంటూ ప్రశ్నించారు. తక్షణమే రామచంద్రరావు సహా బిజెపి కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 27 నెలలైనా ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఓట్ల కోసం, అధికారం కోసం ఎంతకైనా దిగజారే నైజం కాంగ్రెస్ దేనని తేలిపోయిందన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మరింత దివాళా తీస్తున్నరే తప్ప, ఆరు గ్యారంటీలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలయ్యేదాకా కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీస్తామన్నారు.

## ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తవుతున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బిజెపి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. 6 గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా ప్రజలకు చేరడం లేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, మిగతా గ్యారంటీలన్నింటినీ పక్కనబెట్టి, అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు, యువత, బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక డిక్లరేషన్లు విడుదల చేసి, లక్షలాది కుటుంబాలను నమ్మించిందన్నారు. కానీ అధికారంలోకి వర్చాక ఆ గ్యారంటీల అమలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అన్ని వర్గాలను మభ్యపెట్టి, ఇప్పుడు వారిని నిండా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో రైతులకు ఇంకా రైతు భరోసా కింద ఎకరానికి రూ.45,000 వరకు బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, దాదాపు రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని, దీని వల్ల విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. అదేవిధంగా దివ్యాంగుల పెన్షన్లు, మహిళల పెన్షన్లు, రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిరక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. తాము ఎన్నిసార్లు లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల తరఫున ప్రశ్నించడానికి, వారి వాణిని వినిపించడానికి బిజెపి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి చేపట్టాం. అయితే మమ్మల్ని అసెంబ్లీ వద్ద అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనం.దాదాపు 9 పోలీస్ స్టేషన్లలో 800కు పైగా బిజెపి కార్యకర్తలను, అందులో 150 మంది మహిళలు, యువమోర్చా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి నుంచే బిజెపి నాయకులను గృహనిర్బంధం చేశారు. వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వేలాది కార్యకర్తలను మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను నిలదీసి ఎండగట్టేందుకు అసెంబ్లీ ముట్టడి చేపట్టామని, మోసపూరిత హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత నిలదీస్తామన్నారు.

# రుణ పరిమితి ఖరారు.. వరి ఎకరానికి రూ.46 వేలు

### రూ.52 వేలకు చేరిన పత్తి.. ఆయిల్‌పామ్‌కు రూ.50 వేలు

### 2026-27 నాబార్డు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఏప్రిల్ నెల నుండి ప్రారంభం కానున్న సాగు సీజన్లకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేస్తూ జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) నిర్ణయం తీసుకున్నట్లు తెలియవచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు పంట రుణాల పరిమితి ప్రణాళికను అమలు చేయనుంది. ఈ మేరకు నాబార్డుకు చెందిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం మేరకు 2026-27 రెండు సీజనలకు సంబంధించిన 128 పంటలకు రుణ పరిమితిని నిర్ణయించింది.

వరి, పత్తికి రూ.2 వేలు, మొక్కజొన్నకు రూ.3 వేలు పెంచింది. గత సంవత్సరం వరికి ఎకరానికి రూ.46 వేల పరిమితి ఉండగా, ఈ సారి దాన్ని రూ.48 వేలకు పెంచింది. అలగే పత్తి రూ.50 వేల నుండి రూ.52 వేలకు పెరిగింది. గత సంవత్సరం రుణాలు ఇవ్వని వివిధ రకాల పంటలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. నీటిపారుదల సౌకర్యం కలిగి ఉన్న పత్తి సాగు చేసే రైతులకు గత ఆర్థిక సంవత్సరంలో రుణాలు అందించలేదు. ఈసారి ఎకరానికి రూ.52 వేలు చొప్పున బ్యాంకులో రుణాలు ఇవ్వనున్నారు. విత్తన వరి పంటకు ఎకరానికి రూ.45 వేలు, మిర్చి రూ. 1 లక్ష, పుదీనా రూ.35 వేలు, అంటుకట్టిన కూరగాయలు ఎకరానికి రూ.70 వేలు, మల్బరీకి రూ.64 వేలు, స్వీట్ జొన్నకు రూ.24 వేలు చొప్పున రుణ పరిమితిని నిర్ణయించింది. అలాగే పాడి పెంపకం దార్లకు అందించే రుణాలను కూడా నాబార్డు పెంచింది. ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి రూ.48 వేల నుండి రూ.50 వేల వరకు రుణ పరిమితి ఐదేళ్ల వరకు నిర్ణయించారు ప్రస్తుత 2025-26 సంవత్సరంలో గేదెకు రూ.35 వేలు ఉండగా 2026-27లో దాన్ని రూ.37,500 పెంచింది. అలాగే ఆవుకు రూ.35 వేల నుండి రూ.38 వేలకు, మేకల యూనిట్ కొనుగోలుకు రూ.29 వేల నుంచి రూ.32 వేలకు. గొర్రెల యూనిట్ రూ.29 వేల నుంచి రూ.35 వేలకు పెరిగింది. గతంలో బాయిలర్ ఒక్కో కోడి పిల్ల రూ.210 ఉండగా, అది ఈసారి రూ.230, లేయర్ కోడి పిల్ల రూ.440 నుంచి రూ.450 కి పెరిగింది. చేపలు ఒక హెక్టారుకు రూ.4 లక్షల రుణాన్ని పెంచలేదు. కూరగాయలు, పండ్ల తోటలు తదితర ఉద్యాన పంటలకు రుణ పరిమితిని ఎకరానికి వెయ్యి మాత్రమే పెంచింది. ఆయిల్ పామ్‌కు రూ.48 వేల నుంచి రూ.50 వేలకు రుణ పరిమితి నిర్ణయించింది. మిర్చికి రూ.86 నుండి రూ.90 వేలకు, టమాట రూ.57 వేల నుంచి రూ.58 వేలు చేసింది. ఇక అల్లం రూ.71 వేల నుంచి రూ. 72,000కు, వెల్లుల్లి రూ.40 వేల నుంచి రూ.41 వేలకు పెరిగింది.

# టిడిఆర్ నిబంధనల్లో సవరణలను స్వాగతించిన నరెడ్కో

### హైదరాబాద్ రియల్ రంగంలో జిఒ 95 ఓ మైలురాయి

### నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు మేక విజయసాయి




హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త : టిడిఆర్ నిబంధనల్లో కీలకమైన సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జివో 95ను నరెడ్కో స్వాగతించింది. మధ్యతరగతి ప్రజల గృహవసతి, సుస్థిర పట్టణాభివృద్ధికి ఈ జివో ఒక మైలురాయిగా నిలుస్తుందని నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు మేక విజయసాయి పేర్కొన్నారు. తాజా జివోతో హైదరాబాద్ పౌరులకు, పర్యావరణానికి, రియల్‌ఎస్టేట్ రంగానికి లాభదాయకమని పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం నరెడ్కో ఒక ప్రకటన విడుదల చేసింది. శక్తివంతమైన, సుస్థిరమైన సుసంపన్నమైన తెలంగాణను నిర్మించేదిశగా ప్రభుత్వంతో తమ భాగస్వామ్యాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. టిడిఆర్ తాజా సవరణలు సమర్థంగా అమలయ్యేలా చూడడంతోపాటు చైతన్య వంతమైన, సుస్థిరమైన, సమ్మిళితమైన రియల్‌ఎస్టేట్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు నరెడ్కో సిద్ధంగా ఉందన్నారు. టిడిఆర్ విధానాన్ని సరళీకృతం చేయడం ద్వారా ప్రభుత్వం సున్నితమైన జోన్లలో భూమిని పరిరక్షించకడమే కాకుండా మధ్యతరగతి ప్రజల సుసంపన్నమైన అవకాశాలను కల్పిస్తుందని నరెడ్కో తెలంగాణ సెక్రటరి జనరల్ కొప్పుల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగర మరో గొప్ప అభివృద్ధి శకానికి జివో 95 శక్తివంతమైన ఉత్ప్రేరకంగా నిలుస్తుందన్నారు. భాగ్యనగరం మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని, రియల్ ఎస్టేట్ రంగానికి ప్రపంచ గమ్యస్థానంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిఆర్ తాజా సవరణలతో మధ్యస్థాయి రియల్ నిర్మాణాలు వేగవంతమవుతాయని, గృహ వినియోగదారులకు సౌకర్యవంతమైన సెట్‌బ్యాక్ అందుబాటులోకి వస్తుందని, తక్కువ ఖర్చుతో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, నగరం కోర్ ఏరియాలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని, పెద్ద ప్లాట్ల అభివృద్ధికి ప్రోత్సాహకరంగా ఉంటాయని, మెరుగైన సౌకర్యాలతో కూడిన పెద్ద, వ్యవస్థీకృత నివాస సముదాయాలు ఏర్పడుతాయని నరెడ్కో తెలిపింది.

## తమిళనాడు ఎన్డీయెలో సీట్ల ఒప్పందం ఖరారు!

చెన్నై, మార్చి 23: త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం సీట్ల ఒప్పందాన్ని ఎన్డీయే ఖరారు చేసింది. మొత్తం 234 స్థానాలకు గాను 178 స్థానాల్లో అన్నాడీఎంకే, 27 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నాయి. కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలైన అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకేకు 18, టీటీవీ దినకరన్‌కు చెందిన ఏఎంఎంకేకు 11 సీట్లు కేటాయించారు. ఎన్డీయే కూటమిలో అంతర్గత చర్చలు సజావుగా సాగాయని అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కె. పళనిస్వామి తెలిపారు. సీట్ల కేటాయింపులు అధికారికంగా ఖరారయ్యాయని చెప్పారు. ఇతర పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని, వారికి కేటాయించే సీట్ల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. ఎన్డీయేను విజయ కూటమిగా ఆయన అభివర్ణించారు. అన్ని సీట్లలో విజయం సాధించి, ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు డీఎంకేకాంగ్రెస్ కూటమిని తిరస్కరిస్తారని బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జ్, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మహారాష్ట్ర, హర్యానా, బీహార్, ఢిల్లీలో మాదిరిగానే తమిళనాడు ఓటర్లు ఎన్డీయేను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడును అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టిన దుష్ట శక్తి అయిన డీఎంకే, దాని భాగస్వాములకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభిస్తామని ఆయన అన్నారు.





## కోల్డ్‌స్టోరేజి శ్లాబ్ కూలి నలుగురు మృతి

### 12 మందికి తీవ్రగాయాలు

లక్నో, మార్చి 23: కోల్డ్ స్టోరేజ్ బిల్డింగ్‌లో కొంత భాగం కూలిపోయి నలుగురు కార్మికులు మరణించారు. మరో 12 మంది గాయపడితే వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అమ్మోనియా గ్యాస్ లీకేజీని అరికట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక కోల్డ్ స్టోరేజ్ భవనంలోని కొంత భాగం కూలిపోయింది. దీంతో శిథిలాల కింద కార్మికులు చిక్కుకున్నారు. పోలీసులు, అగ్నిమాపక దళం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అమ్మోనియా గ్యాస్ లీకేజీని అరికట్టారు. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు మరణించారు. మరో 12 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ మాజీ ఎమ్మెల్యే అన్సార్ అహ్మద్‌కు చెందిన కోల్డ్ స్టోరేజ్ అని చెప్పారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఈ దుర్ఘటన పట్ల ప్రధాని మోదీ తీవ్ర మనస్తాపం చెందినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారాన్ని ప్రకటించింది.

వార్త


పేద జనానికి తిండి తిప్పలు సమకూర్చినప్పుడే నిజమైన నాగరికత ఉన్నట్లు లెక్క.

న-జాన్సన్

# రైతు కష్టాలు తీరేదెలా?

ఎన్ని రుతువులు మారినా ఎన్ని ఉగాదులొచ్చినా, ఎన్ని పంటకాలాలు మారినా ఏలిన వారి దయలేక యూరియా కష్టాలతోరైతుకన్నీళ్ల సాగు చేస్తున్నాడు. యూరియా కొరత ఉన్నప్పుడు లేనప్పుడు కూడా రైతు యూరియా కోసం పీకల్లోతు కష్టాల్లో దిగబడిపోతున్నాడు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో రైతు పంట పొట్టపోసే తరుణంలో యూరియా పంపిణీలో చిత్రవిచిత్ర అనుభవాలను ఎదుర్కొంటున్నాడు. ఒక పక్క ప్రతి ఎకరాకు వినియోగించే యూరియాను క్రమబద్ధం చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెవినిల్లు కట్టుకుని పోరుతున్నా రైతు లెవరూ వినిపించుకునే పరిస్థితిలో లేరు. అందుచేత యూరియా వాడకం ఏమాత్రం తగ్గలేదు. రైతులందరికీ ఎరువు ఇవ్వటం ప్రభుత్వాలకు సాధ్యం కావడం లేదు. యూరియా అన్ని రాష్ట్రాలకూ కేటాయించేది,అవసరమైనంత మేరకు సమకూర్చేది కేంద్ర ప్రభుత్వమే. సాగుకవసరమైన అన్ని ఎరువుల సంగతి ఎలా ఉన్నా యూరియా విషయంలో పెద్ద గందరగోళాన్నే ఎదుర్కొంటున్నాడు. ఉభయ రాష్ట్రాల్లోనూ యూరియా పంపిణీ నియంత్రిత విధానాలతోనే జరుగుతుందని పాలకులు వాటినే అనుసరిస్తున్నారు. కొందరు రైతులైతే యూరియా కోసం ఎగబడే పరిస్థితి లేక ఆకాశంకేసి చూస్తూ పరాకుగా నిలబడిపోయి ఉన్నాడు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న సాగులో యూరియా వాడకం జరుగుతోంది. వరిసాగులో ప్రతి ఎకరానికి 2,3, బస్తాల యూరియా, మొక్కజొన్న ఎకరానికి 2బస్తాల వరకు, అదే పత్తి పంట అయితే ఎకరాకు 1నుంచి ఒకటిన్నర బ్యాగుల ఎరువు అవసరమౌతుంది.ప్రస్తుత పరిస్థితులలో రైతుకు ఉన్న భూమి పరిణామాన్ని బట్టి కేటాయింపులుంటాయి. అంతకన్నా ఎక్కువ ఎరువు వాడితే దిగుమతులు అధికమౌతాయన్న యోచనతో రైతులు అధికమోతాదులో యూరియా వినియోగించటం పరిపాటే.అయినా సత్ఫలితాలు సాధించిన సందర్భాలు బహుతక్కువ. ఇరు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు యూరియా తదితర వివరాలన్నీ వెబ్‌ల్యాండ్ రికార్డుల ఆధారంగా కేటాయిస్తారు. ఆ మేరకే సహకార సంఘాల నుండి రైతులు కొనుక్కొని తీసుకెళ్తారు. రైతాంగం సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నట్లు కొన్ని అంకెలను కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా వీటన్నిటిలోనూ అణుమాత్రం పొంతన కుదరదు. యూరియా వినియోగం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇచ్చినాఏమాత్రం ఫలితం దక్కడం లేదు. మామూలుగా చెపితే రైతులు విశ్వసించడం లేదన్నఅభిప్రాయంతో యూరియా బ్యాగ్‌కు తగు ప్రోత్సాహకం కూడా అందిస్తోంది.నానో యూరియా వినియోగించాలంటే రైతుకి ఎన్నో సందేహాలు ఉన్నాయి. రబీ సీజన్‌లో యూరియా తెచ్చుకోవడానికి తెలంగాణలో రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. తెలంగాణలో ప్రతి రైతు తమకు కావాల్సిన యూరియా బుక్ చేసుకోవడంలో ప్రభుత్వం పెట్టిన 'యాప్' సరిగా పనిచేయకపోవడం, యాప్‌లో తమ పేర్లు నమోదుకు రైతులదగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేక సమస్యలనెదుర్కొన్నారు. సరుకుతీసుకుని ఇంటికి చేర్చుకోవడం మరో యజ్ఞంలా రైతు నానాయాతన పడుతున్నాడు. ఒకే రైతుకు కొద్దిదూర ప్రదేశాల్లో వ్యవసాయ క్షేత్రాలున్నప్పుడు అదే రైతు రెండు ప్రాంతాలకూ వెళ్లి యూరియా తీసుకోవాల్సి వస్తేమరీ ఇబ్బంది. ఆంధ్రప్రదేశ్‌లో యూరియా వ్యవహారం మరోలా నడుస్తోంది. రైతుకు యూరియా బస్తా కొనుగోలులో మరో పోషక ఎరువుల బస్తాను లింకుపెట్టి ఇస్తున్నారు. నిజానికి వీటిని క్రమబద్ధం చేసే ప్రణాళికలు ప్రభుత్వం వద్ద ఏమీలేవు. తాజా పరిస్థితుల రీత్యారేపొచ్చే వానాకాలం సీజన్‌లోయూరియా పంపిణీ మరింత కష్టమౌతుందని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ సంకేతాలు పంపింది. సర్మెట సభలో తెలంగాణ ముఖ్యమంత్రి యూరియా విషయంలో రైతాంగానికి కొన్ని స్పష్టమైన సూచనలు కూడా చేశారు. వచ్చే సీజన్‌కు యూరియా కొరత రాబోతోందని నానో యూరియా వైపు మారాలని రైతాంగాన్ని కోరారు. యూరియా సరఫరాలో తమ బాధ్యతలను తప్పించుకుంటారని అని అనుకోలేం. గత మూడు సీజన్లుగా యూరియా, తదితర ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నందున రేపటి ఖరీఫ్ సీజన్‌కు రైతును సమాయత్తపరచడన్నమాట. యూరియా విదేశాల నుంచి రావాలి. కానీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కారణంగా ఎరువులతో రావాల్సిన నౌకల కదలిక నెమ్మదించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వాలు కొత్తప్రణాళికలు వేయాల్సిందే. తెలంగాణలోని రామగుండం ఫాక్టరీలో ఎరువుల ఉత్పత్తిని పెంచాలని కేంద్రం నిర్ణయించినా, ఇక్కడ తయారైన ఎరువులు ఈ ప్రాంత వినియోగానికే అన్న విధానం ఏదీ అమలులో లేదు. ఈప్రాంత ఉత్పత్తులు ఏ రాష్ట్రానికైనాపంపేందుకు వీలుంది. అందుకే రామగుండం యూరియానుతెలంగాణ అవసరాలకే ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రసంగ సారాంశంలో ప్రధానాంశంగా ఉంది. వానాకాలం ప్రారంభానికి ముందు తెలంగాణలో 50వేల టన్నులు కూడా నిల్వఉండే అవకాశంలేదని ఆశాఖమంత్రే స్వయంగా తెలిపారు.రాబోయే సీజన్‌లో తెలంగాణ అవసరాలకు 10లక్షల టన్నులు అవసరముంటుంది.సీజన్‌లో ప్రతినెలా రెండేసి లక్షలటన్నుల యూరియా సరఫరా చేయాలని మంత్రి ప్రధానికి రాసినలేఖలో కోరారు.గతంలో చేదుఅనుభవాలు చవిచూసిన తెలంగాణ రైతాంగానికి ఈ యేడాది మరిన్ని చేదుఅనుభవాలు చవిచూడాల్సివస్తుందన్న భయంఉంది. పాత అనుభవాలు, కొత్తకష్టాల అంచనాలతో యూరియా సరఫరాకు సరికొత్త ప్రణాళికలతో ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నప్పుడే రైతుకు మేలు.

సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాదు. అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.



థామస్ జెఫర్సన్

సద్వచనాలు విని ప్రయోజనం లేదు. వాటిని నిత్యకృత్యంలో ఎంతవరకు ఆచరణలోకి తెస్తున్నామనేదే ముఖ్యం.



వివేకానంద

# వైద్యవిద్యలో నైపుణ్యం ఎందుకు తగ్గుతోంది?

**అనేక రకాల పేర్లతో ఆయా యాజమాన్యాలు విద్యార్థుల నుండి పెద్దయెత్తున ఫీజులు వసూలు చేయడం గమనార్హం. ధనికులైన విద్యార్థులు ఇష్టపడి, ఆయా సంస్థల్లో పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించి చదువుకోవడం వల్ల ఆర్థికంగా దేశ ప్రజలకైతే ఎటువంటి నష్టం ఉండదు. కానీ ఇలా చదివిన వారివల్ల సామాజిక నష్టమైతే కచ్చితంగా ఉంటుంది. ప్రతిభలేని విద్యార్థులు తయారై క్షేత్రస్థాయిలో ఏ రకమైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తారు? వీరివల్ల పేద, మధ్యతర గతి వర్గాలకు నాసిరకమైన వైద్యమే అందుతుంది కదా! ఎందుకంటే, ఇలా పట్టాలు పొందిన వైద్యులు మంచి వైద్యాన్ని ప్రజలకు అందించలేరన్నది సత్యం. హెచ్చుశాతం ప్రైవేటు మెడికల్ కాలేజీ బోధనాసుపత్రులలో రోగులు లేక ఎప్పుడూ బెడ్స్ ఖాళీగానే ఉంటుంటాయి. ఎంత ఎక్కువమంది రోగులు ఉంటే అంత విషయ పరిజ్ఞానం చదివే జూనియర్ డాక్టర్లకి వస్తుంది. కానీ దీనికి భిన్నమైన పరిస్థితి ఉండడం వల్ల ఇక్కడ చదివే వారికి సబ్జెక్ట్ ఉండదు.**



పిల్లా తిరుపతిరావు

ప్రతియేటా అఖిల భారత స్థాయిలో పలు వృత్తివిద్యా కోర్సులలో విద్యార్థుల ప్రవేశం కోసం ప్రభుత్వం ఐఐటి, నీట్, కేట్, క్లాట్ పేరిటవివిధ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా, పగడ్బందీగా నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో ఐఐటి అడ్వాన్స్‌ఎగ్జామ్ అంతర్జాతీయ స్థాయిలో ఒక క్లిష్టమైన పరీక్షగా పేరు పొందింది. ఇదిలావుంటే ఈ ఒక్కొక్క పరీక్షను రాసేందుకుగాను లక్షణాది మంది విద్యార్థులు పోటీపడుతుంటారు. ఈ పరీక్షలలో మంచిమార్కులు పొందిన విద్యార్థులు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటి, ఎయిమ్స్, ఐఐఎం, నేషనల్ లా కళాశాలల్లో ప్రవేశాలు పొందుతారు. ఇదిఏటేటా నిర్విఘ్నంగా జరిగే వివిధ కోర్సుల ప్రావేశిక ప్రక్రియ. ఐతే పరీక్షలు రాసిన విద్యార్థుల్లో కొద్దిమందికే మంచిర్యాంకులు వస్తాయి. మంచిర్యాంకు రానివారికి ఈ విద్యాసంస్థలలో సీట్లు లభ్యం కావు. అందువల్ల ప్రత్యామ్నాయంగా అనేక ప్రైవేట్ విద్యాసంస్థలలో వీరంతా ప్రవేశాలు పొందుతారు. ఐతే ఈ ప్రవేశాలు వివిధ రకాల పద్ధతులలో ఉంటాయి. అవి కన్వీనర్, మేనేజ్మెంట్, ఎన్నారై కోటాలుగా ఉంటాయి. ఈ ప్రైవేటు ఇన్స్టిట్యూట్స్‌లో కూడా కొన్ని మాత్రమే అత్యంత ప్రమాణాలు కలిగిన ఇన్స్టిట్యూట్స్‌గా వెలుగొందుతున్నాయి. ఇక్కడ చదువు అన్ని విధాలా నాణ్యతతో కూడి ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత మంచి ఉపాధి కూడా దొరుకుతుంది. కానీ ఇక్కడ చదవడానికి విద్యార్థులపై అధిక ఆర్థిక భారం పడుతుంది. ఇవిగాక మిగిలిన చాలా సంస్థలు నాసిరకమైన విద్యను మాత్రమే విద్యార్థులకు అందిస్తుంటాయి. వీళ్ళు కూడా వాళ్ల కాలేజీకున్న గుడ్‌విల్‌ని బట్టి రుసుములు వసూలు చేస్తుంటారు. దేశంలో ఉన్న అన్ని మెడికల్ కాలేజీలలో ఎం.బి.బి.ఎస్, బి.డి.ఎస్ కోర్సులలో ప్రవేశం కొరకు నీట్ ఎగ్జాం జరుగుతుంది కదా! ముఖ్యంగా ఈ నీట్ పరీక్షలో కన్వీనర్ కోటాలో సీట్లు రాని విద్యార్థులు కొంతమంది బి, సి కేటగిరిల్లో సదరు కళాశాల యాజమాన్యాలకు డొనేషన్స్ చెల్లించి అడ్మిషన్స్ పొందుతారు. బి కేటగిరిలో కూడా ర్యాంక్ ఆధారిత ప్రవేశముంటుంది. డొనేషన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. సి క్యాటగిరిలోనైతే విద్యార్థి మినిమం కట్ ఆఫ్ మార్కులు పొందియుండాలి. వీరు అధిక డొనేషన్స్ చెల్లిస్తేగాని సీట్ లభించదు. అంటే ఈ సంస్థల్లో అనేక రకాల పేర్లతో ఆయా యాజమాన్యాలు విద్యార్థుల నుండి పెద్దయెత్తున ఫీజులు వసూలు చేయడం గమనార్హం. ధనికులైన విద్యార్థులు ఇష్టపడి, ఆయా సంస్థల్లో పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించి చదువుకోవడం వల్ల ఆర్థికంగా దేశ ప్రజలకైతే ఎటువంటి నష్టం ఉండదు. కానీ ఇలా చదివిన వారివల్ల సామాజిక నష్టమైతే కచ్చితంగా ఉంటుంది. ప్రతిభలేని విద్యార్థులు తయారై క్షేత్రస్థాయిలో ఏ రకమైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తారు? వీరివల్ల పేద, మధ్యతర గతి వర్గాలకు నాసిరకమైన వైద్యమే అందుతుంది కదా! ఎందుకంటే, ఇలా పట్టాలు పొందిన వైద్యులు మంచి వైద్యాన్ని ప్రజలకు అందించలేరన్నది సత్యం.హెచ్చుశాతంప్రైవేటు మెడికల్ కాలేజ్ బోధనాసుపత్రులలో రోగులు లేక ఎప్పుడూ బెడ్స్ ఖాళీగానే ఉంటుంటాయి. ఎంత ఎక్కువమంది రోగులు ఉంటే అంత విషయ పరిజ్ఞానం చదివే జూనియర్ డాక్టర్లకి వస్తుంది. కానీ దీనికి భిన్నమైన పరిస్థితి ఉండడం వల్ల ఇక్కడ చదివే వారికి సబ్జెక్ట్ ఉండదు. ప్రాయోగికజ్ఞానం లేని వీళ్ల స్టెతస్కోపులు ధరించి చికిత్స చేస్తే, రోగి చావక మరేం జరుగుతుంది? కొంతమంది డాక్టర్ల పిల్లలు కూడా నీట్ పరీక్షల్లో ప్రయత్నాలు చేయగా చేయగా, సరైన ర్యాంక్



లు రాకపోవడంతో మేనేజ్మెంట్ కోటాలో ఎం.బి.బి.ఎస్ సీట్లు కొనుగోలు చేస్తుంటారు.ఇంకా కోట్లుపెట్టి పోస్ట్ గ్రాడ్యుయేషన్, స్పెషలైజేషన్ సీట్స్ కొంటుంటారు. వీళ్లంతా డాక్టర్లుగా తయారైతమ తాతతండ్రుల వారసత్వంతో ఆసుపత్రులు నిర్వహిస్తుంటారు. ఐతే వీరికి ఎటువంటి మెడికల్ సర్జికల్ చికిత్సా నైపుణ్యం ఉండదు. వీరంతా ఆసుపత్రులలో రోగులు పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటారు.బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తుంటారు. డబ్బు సంపాదనే ధ్యేయంగాబ్రతుకుతారు. రోగుల నుండి డబ్బులు గుంజుకోవడానికి ఈ వైద్యులు రకరకాల పద్ధతులను అవలంబిస్తుంటారు. తమ ఆసుపత్రిలో ఉండే ల్యాబ్స్,ఫార్మసీ, స్కానింగ్ సెంటర్స్ మొదలగు విభాగాల ద్వారా రోగులను పీడించుకొని తింటారు. ప్రతి విభాగం నుండి వీరికి పెద్దయెత్తున కమిషన్స్ వస్తుంటాయి. ఉన్నవీ, లేనివీ నివేదికలలో పొందుపరిచి రోగులను, రోగి బంధువులను గందరగోళ పరుస్తారు. ఇంతేకాదు ఇంకా క్షేత్రస్థాయిలో నకిలీ వైద్యులు లేకపోలేదు. కొంతమంది చదివిన సంస్థలకు రికగ్నేషనే ఉండదు. నకిలీ విశ్వవిద్యాలయాలు పేరుమీద నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ప్రాక్టీస్ చేసేవారు కూడా ఉంటారు.పల్లెల్లో వైద్యం చేసే ప్రాక్టీషనర్స్‌కి ప్రామాణికమైన ధ్రువపత్రాలుండవు. అయినా ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇంజక్షన్ చేయడం వచ్చిన వాళ్లంతా డాక్టర్లు గానే చెలామణి అవుతుంటారు. ఇంకా హస్తవాసి లేని డాక్టర్లు ఎంతోమంది ఉన్నారు. వాళ్లంతా ప్రాక్టీస్ లేక తమ క్లినిక్‌లలో ఖాళీగా ఉండడం చూస్తుంటాం. ఐతే వీటికి భిన్నమైన పరిస్థితి చిన్న పట్టణాలలో ఉన్న ప్రైవేటు హాస్పిటల్స్‌లో నెలకొని ఉంటుంది. సాధారణంగా గోల్డెన్ అవర్స్‌లో చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకొచ్చే రోగులు ఉంటారు. చివరి క్షణంలో వచ్చే ఇలాంటి కేసుల్లో చావైనా బ్రతుకైనా ఫిఫ్టీ,ఫిఫ్టీయే ఛాన్సెస్ ఉంటుంది. సదరు డాక్టరు రోగి కుటుంబ సభ్యుల అభ్యర్థనతో చికిత్స ప్రారంభిస్తారు. ఒక్కోసారి కొన్ని కేసులు ఫెయిల్ అవ్వొచ్చు. అలాంటప్పుడు రోగి బంధువులు డాక్టర్‌పై నిందలు మోపుతుంటారు. ఆసుపత్రిపై పడి భౌతిక దాడులు చేస్తుంటారు. ఇది ఎంతమాత్రమూ తగని పని. ఒకవేళ డాక్టర్ చేసిన చికిత్సలో నిర్లక్ష్యం కనిపిస్తే చట్ట ప్రకారం ప్రొసీడ్ కావాలి. అంతేగాని చట్టాన్ని చేతిలోకి తీసుకొని సదరు వైద్యులపై దాడిచేయడం అన్యాయం. దీనివల్ల జనానికి ఒరిగే లాభమేంటి? ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి తిరిగి వస్తాడా? ఇలా డాక్టర్లపై దాడిచేయడం వల్ల గోల్డెన్ అవర్స్‌లో వచ్చే రోగుల పరిస్థితి ఏమిటి?డాక్టర్లు ఇకముందు అత్యవసర చికిత్సలు అందిస్తారా? ప్రతీ కేసును చూసినవెంటనే రిఫర్ చేసేస్తారు కదా! ఇది ప్రజలకే నష్టం కదా! ఐతే ఇలాంటి పరిస్థితులు గవర్నమెంట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ఎదురుకావు. ఎందుకంటే, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎవరైనా రోగిమరణిస్తే, దాన్ని జనం సర్వసాధారణంగానే భావిస్తారు. సదరు వ్యక్తికి ఈ భూమ్మీద నూకలు చెల్లిపోయాయి, డాక్టర్లు ఐతే మాత్రం ఏం చేస్తారు? అనే భావనతో ఉంటారు. అందువల్ల డాక్టర్లపై ఎటువంటి దాడులు జరిగే అవకాశాలు ఉండవు. ఇదే పరిస్థితి పెద్ద పట్టణాల్లో ఉండే కార్పొరేట్ హాస్పిటల్స్‌లో కూడా కనిపిస్తుంది. అక్కడకు గోల్డెన్ అవర్స్‌లో వెళ్లిన రోగులకు వైద్యులు పరీక్ష చేసి, చికిత్స అందిస్తారు. చికిత్సకని భారీగా డబ్బులు వసూలు చేస్తారు. ఐనా అక్కడా కేసులు ఫెయిలై రోగులు చనిపోతుంటారు. ఆ వైద్యులను రోగుల బంధువులు గానీ, కుటుంబ సభ్యులు గానీ ఏ విధంగానూ నిలదీయలేరు. నిలదీయడానికి ఎటువంటి ఆస్కారం వారికి దొరకదు కూడా.అదే చిన్న పట్టణాల్లోనైతే ఇలాంటి సందర్భాలలో జనం మూకుమ్మడిగా ఆసుపత్రి మీదపడి, దాడులు చేస్తుంటారు. ప్రైవేట్ ఆస్తుల నష్టానికి ఒడిగడుతుంటారు. ఐతే ఇలాంటి రిస్కులను భరించి ప్రైవేటు డాక్టర్లు చికిత్సలు చేసేందుకు ఏవిధంగా ముందుకు వస్తారు? వారు చేతులెత్తేయడం తప్పితే, భవిష్యత్తులో మరొకటి ఉండదు. ఐతే వైద్యుల రక్షణకు కూడా కొన్ని చట్టాలు లేకపోలేదు. తమ వృత్తి ధర్మాన్ని ఎటువంటిఒత్తిడి లేకుండా నిర్వహించుకునే హక్కులు వారికి ఉంటాయి. వాటిని రోగి బంధువులు పరిగణనలోకి తీసుకోవాలి. వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వహించాలి. దీనిలో భాగంగా నైతికతతో చికిత్స చేయడం, నిర్లక్ష్యానికి దూరంగా ఉండటం, సరైన నివేదికలను నిర్వహించడం వీరి బాధ్యత. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే ప్రజల నుంచి ప్రతిఘటన ఎదుర్కొనక తప్పదు. ఈ దేశంలో అప్రజాస్వామికంగా ప్రవర్తించడం ఎప్పటికీ చెల్లనేచెల్లదు. ఇందులో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు లేనేలేవు. ●

# వంటగది నుండి గ్లోబల్ వార్మింగ్ దాకా..'యుద్ధ'మే!

నల్ల రవి కుమార్

పశ్చిమాసియాలో క్షిపణుల గర్జనలు మొదలై మూడు వారాలు గడిచాయి. ఇరాన్పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు కేవలం సైనిక స్థావరాలకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునాదులను కదిలిస్తున్నాయి. భారతదేశం వంటి అధిక జనాభా కలిగిన దేశంలో అగ్గి రాజేయడానికి సరిహద్దుల్లో యుద్ధం అక్కర్లేదు, వంటగదిలో గ్యాస్ సిలిండర్ ఖాళీ అయితే చాలు. ఇప్పటికే దేశంలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు బుక్ చేసిన రెండు మూడు రోజుల్లోనే ఇంటికి వచ్చే సిలిండర్, నేడు కనీసం 45రోజుల గడువు అడుగుతుండటం గమనార్హం. అటు కమర్షియల్ గ్యాస్ దొరకక హోటళ్లు, చిన్నతరహా పరిశ్రమలు మూతపడుతుంటే, ఇటు డొమెస్టిక్ గ్యాస్ అందక గృహిణులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్యాస్ ఏజెన్సీల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా 'స్టాక్ లేదు'అన్న సమాధానమే వినిపిస్తోంది. అంతర్జాతీయంగా ఎల్పిజి ధరలు పెరగడం, సరఫరా గొలుసు తెగిపోవడంతో ఉన్న స్టాక్ కూడా బ్లాక్ మార్కెట్కు తరలుతుండటం సామాన్య ప్రజలను అవస్థల పాలు చేస్తోంది. గత మూడు వారాల్లో జరిగిన విధ్వంసాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఒక ప్రాంతీయ పోరుకాదు,ప్రపంచవ్యాప్త సామాజిక ఆర్థిక విపత్తుగా మారుతోందని స్పష్టమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లోచమురు ధరలు యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే బ్యారెల్కు 75డాలర్ల నుండి ఏకంగా 110డాలర్ల మార్కును దాటడం గమనార్హం. ఇరాన్‌లోని ప్రధాన చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు జరగడంతో రోజువారీచమురు ఉత్పత్తిలో సుమారు 30శాతం కోతపడింది. దీనివల్ల రవాణా ఖర్చులు అంతర్జాతీయంగా 25 నుండి 30 శాతం మేర పెరిగాయి. ద్రవ్యోల్బణం రేటు అంచనాలను మించి 7.5 శాతానికి చేరుకోవడంతో, సామాన్యుడి నెలవారీ బడ్జెట్ తలకిందులైంది. ఈ తరుణంలో మనం ఒక ప్రాథమిక ప్రశ్న వేసుకోవాలి. మానవుడు సాధించిన సాంకేతిక పరిజ్ఞానం, నాగరికత దేనికోసం? సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది



మానవాళికి సుఖమైన, నాణ్యమైన జీవనాన్ని అందించడానికి ఉపయోగపడాలి తప్ప, ఒక దేశంపై మరొక దేశం ఆధిపత్యం చెలాయించడానికి, విధ్వంసాన్ని సృష్టించడానికికాదు. మనం నిర్మించుకున్న ఆధునిక నాగరికత యుద్ధాల ద్వారా ఆర్థిక, సామాజిక, పర్యావరణ సంక్షోభాలను కోరి తెచ్చుకోవడంలో ఏమాత్రం వివేకం లేదు. కోట్లాది రూపాయల ఖర్చుతో తయారు చేసిన క్షిపణులు సెకన్ల వ్యవధిలో దశాబ్దాల కష్టాన్ని బూడిద చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ మేధస్సును ఆకలిని నిర్మూలించడానికి, క్యాన్సర్ వంటి రోగాలకు మందులు కనుగొనడానికి వాడాల్సింది పోయి, 'స్మార్ట్ బాంబుల' తయారీకి వాడటం మానవ వివేకానికే సవాలు. పర్యావరణ పరంగా చూస్తే, ఈ 20 రోజుల యుద్ధం భూమికి కోలుకోలేని దెబ్బ తీసింది. క్షిపణి దాడుల వల్ల ఇరాన్ తీరప్రాంతాల్లో దాదాపు 40 మిలియన్ గ్యాలన్ల చమురు సముద్రంలో కలిసినట్లు అంచనా. ఇది సముద్ర జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమేకాకుండా, సముద్రపు నీటి ఆవిరి ద్వారా కురిసే వర్షాలను కూడా కలుషితం చేస్తోంది.పేలుళ్లవల్ల వెలువడిన కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ ఉద్గారాలు వాతావరణంలో పిఎం 2.5 స్థాయిని సాధారణం కంటే 10రెట్లు పెంచాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులను వేగవంతం చేస్తోంది. ఒకవైపు మనం గ్లోబల్ వార్మింగ్ను తగ్గించడానికి అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తుంటే, మరోవైపు యుద్ధం పేరుతో టన్నుల కొద్దీ విషవాయువులను గాలిలోకి వదులుతున్నాం. ఇది వివేకం కాదు, ఆత్మహత్యాసదృశ్యమైన చర్య. ఈ వినాశనాన్ని ఆపడానికి అంతర్జాతీయ సమాఖ్యలైన జీ20 (బి20), యూరోపియన్ యూనియన్, బ్రిక్స్ వంటి కూటములు ప్రేక్షక పాత్ర పోషించడం తగదు. అగ్రరాజ్యాలు తమ ఆయుధ వ్యాపార లాభాల కోసం ప్రపంచ శాంతిని పణంగా పెడుతున్నాయి. యుద్ధం ఆపడం అనేది ఇప్పుడు కేవలం ఇరాన్, ఇజ్రాయెల్ సమస్య కాదు, ఇది భారత్ వంటి దేశాల్లోని కోట్లాది మంది సామాన్యుల మనుగడ సమస్య. ఇప్పటికైనా ప్రపంచదేశాలు ఏకమై తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించేలా ఒత్తిడి తీసుకురావాలి. శాంతిచర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోకపోతే, ఈయుద్ధ జ్వాలలు కేవలం ఇరాన్ను మాత్రమే కాదు, ప్రపంచం నిర్మించుకున్న నాగరికతను కూడా బూడిద చేయడం ఖాయం. శాంతిలేని అభివృద్ధి కేవలం భ్రమ మాత్రమేనని పాలకులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ●

# ప్రజావాక్కు



## బైక్ ర్యాలీలకు చోటులేదు

ఇటీవల వివిధ పండుగలు, ఉత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీలు నిర్వహించటం పెరిగింది.ఆధ్యాత్మిక కార్యక్రమాలలో బైక్ ర్యాలీలకు చోటులేదు. రణగొణ ధ్వనుల మధ్య అరుపులతో సాగే ర్యాలీ ముద్దుగా అనిపించదు. ఇదంతా దృష్టి మళ్ళించటానికి చేసేది తప్పితే, దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.ఇటువంటి వైఖరివల్ల ఒనగూరే ప్రత్యేక ఫలితాలు కూడా శూన్యం. దీనికన్నా ఆధ్యాత్మికత గల యువతీ యువకులు నిర్దేశించిన మార్గంలో అధిక సంఖ్యలో నడుస్తూ దారిలో రంగవల్లులు అద్ది, నామస్మరణలు, చెక్కభజనలు,సంప్రదాయ నృత్యాలుచేస్తూసాగితే ఆకార్యక్రమానికినిండుతనమే కాకఆధ్యాత్మికశోభ వెల్లివిరుస్తుంది.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## ఆర్థిక భద్రతపై ఫోకస్ అవసరం

తెలంగాణ ఆర్థిక సర్వే చెపుతున్నదేమిటి తెలంగాణాలో పట్టణ జనాభా దేశంలో పట్టణ జనాభా కంటే వేగంగా పెరుగుతున్నదనే కదా.అయితే రాష్ట్రంలోచేస్తున్న మొత్తం వ్యయంలో 79 శాతం పట్టణ మౌలిక వసతుల కల్పన కోసమేచేస్తున్నారు అనేది ఆర్థిక సర్వే చెపుతున్న సత్యం. అయితే గ్రామాలలో ఉపాధిహామీని అవలంబింపచేసినట్టే పట్టణాలలో కూడా చేస్తే బాగుంటుంది. నిర్మాణ రంగం, సేవలరంగం ముఖ్యంగా హోటళ్లలాంటి రంగాలలోను, పారిశ్రామిక వాడలలో ఇంకా చెప్పాలి అంటే ఆర్థిక భద్రత లేని రంగాలలో విరివిగా ఈ ఉపాధి హామీని అమలు చేయాలి.ఇప్పుడు ఆస్తుల సృష్టిమీద ఫోకస్ చేయాలి.

- భారత అవినాష్, జనగామ

## ప్రత్యేక ప్రణాళికలు అవసరం

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయానికి గోదావరి డెల్టా ప్రాంతం ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల విస్తారమైన సాగుభూములకు నీటిని అందిస్తూ ఈ డెల్టాప్రాంతం రాష్ట్రానికి అన్నపూర్ణగా నిలిచింది. అయితే కాలక్రమేణా ఈ డెల్టాలోని కాలువలు, ఆన కట్టలు, నీటిపంపిణీ వ్యవస్థలు పాతబడిపోయాయి. ఈ పరిస్థితుల్లో గోదావరి డెల్టాను ఆధునీకరించడం అత్యవసరంగా మారింది. కాలువల్లో మట్టి పేరుకుపోవడం, నీటి లీకేజీలు, సరైన నీటి పంపిణీ లేకపోవడం వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పరీక్షలలో ఎఐ వినియోగం

ప్రస్తుతం విద్యావ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, కొన్ని ముఖ్యమైన ప్రక్రియలు ఇంకా పాత విధానాలకే పరిమితమై ఉన్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్ టెన్త్ పబ్లిక్‌పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో మార్కుల నమోదు విధానం ఇప్పటికీ మాన్యువల్ పద్ధతిలోనే కొనసాగుతోంది. తెలంగాణ ఇంటర్మీడియేట్, స్కూల్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈపరీక్షలలోఉపాధ్యాయులు మార్కులను చేతితో నమోదు చేయడం, బబ్లింగ్ చేయడం,పోస్టింగ్ చేయడం వంటి ప్రక్రియలు అధిక సమయం, పనిభారం, కొన్ని సార్లు తప్పులు దొర్లడం జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం విద్యా రంగంలో ఒక పెద్ద మార్పుకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా మార్కుల నమోదు ప్రక్రియను ఆధారితంగా మార్చడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభించవచ్చు.

- ఎల్. ఉపేందర్, దమ్మపేట

## కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్న ఈ కోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90 రోజుల్లో పరిష్కారంలభించేదికానీ ఇప్పుడు మూడునాలుగు సంవత్సరాలు గడిచినా కానీ కేసు పరిష్కారం జరగటం లేదు. కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అన్నికేసులవైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు.వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటనే భర్తీ చేసి కేసులు వేగవంతం చేయాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## దళిత చట్టాల గురించి ప్రచారం చేయాలి

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, విశ్వ విజ్ఞాని, చిన్న రాష్ట్రాల ప్రదాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి 14ఏప్రిల్ 2026 పురస్కరించుకొని దళిత చట్టాలను ప్రచారం చేయాలి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ ప్రజలకు కొన్ని చట్టాలు చేయడం జరిగింది. దానికి అనుగుణంగా1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి, 2016 వికలాంగుల హక్కుల చట్టం గురించి రాష్ట్రంలోని 12.769 గ్రామాలలోదళిత చట్టాలపై అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పశ్చిమ రాజకీయ గాలి ఎటు వీచేనో!

ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. గత 15 ఏళ్ల అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఒకవైపు, ప్రధాన ప్రతిపక్షంగా దూసుకొస్తున్న బీజేపీమరోవైపు నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ అంటేనే పోరాటాల గడ్డ. 34 ఏళ్ల వామపక్ష పాలనను అంతం చేసి 2011లో మమతా బెనర్జీ అధికారాన్ని చేపట్టారు. అప్పటి నుంచి ఆమె తిరుగులేని శక్తిగా ఎదిగారు. 2021 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు మారుతూ వచ్చాయి. వచ్చే నెల రెండు దశల్లో జరగనున్న ఎన్నికలు మమత భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. వరుసగా మూడు సార్లు విజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్‌కు ఈసారి 'యాంటీ ఇన్కంబెన్సీ' (ప్రభుత్వ వ్యతిరేకత) అతిపెద్ద సవాలుగా మారింది. ఉపాధ్యాయ నియామక కుంభకోణం (ఎస్ఎస్‌సి, ఎస్సీ), రేషన్ కుంభకోణం వంటివి పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. మాజీ మంత్రులు జైలుకువెళ్లడం ప్రజల్లో చర్చనీయాంశమైంది. అటు తాజాగా టిక్కెట్ల కేటాయింపులో దాదాపు 70మందికి పైగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి మమతా బెనర్జీ అవకాశం కల్పించలేదు. దీనివల్ల పార్టీలో అంతర్గత అసమ్మతి పెరిగింది. తిరుగుబాటు నాయకులు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల నిరుద్యోగం పెరిగిందని, యువత వలస వెళ్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం 50 మందికి పైగా సీనియర్ అధికారులను (డీజీపీ, హోమ్ సెక్రటరీ సహా) బదిలీ చేయడం మమతకు గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఇది ప్రభుత్వ పట్టును సడలించే అవకాశం ఉంది. మమత 'దీదీ' గా పిలవబడుతూ మహిళల్లో విపరీతమైన ఆదరణ కలిగి ఉన్నప్పటికీ, కొన్ని సంఘటనలు ఆమె పాలనపై వ్యతిరేకతను పెంచాయి. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్యఉదంతం బెంగాల్ సమాజాన్ని కుదిపేసింది. ఈ విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆగ్రహంతో ఉన్నారు. బాధితురాలి తల్లి కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకోవడం గమనార్హం. ఎన్నికల సమయంలోనూ,ఆ తర్వాత జరిగే హింసపై సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల వేధింపులుఉన్నాయనే ఆరోపణలు ప్రతిపక్షాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి.



హిందూ ఓటర్లలో ఒకవర్గం మమత ప్రభుత్వం కేవలం ఒక వర్గానికే ప్రాధాన్యత ఇస్తుందని భావిస్తోంది. ఇది ఓట్ల ధ్రువీకరణకు దారితీస్తోంది. 2016లో కేవలం 3సీట్లు గెలిచిన బీజేపీ, 2021 నాటికి77 సీట్లకు చేరుకోవడం ఒక అద్భుతమనే చెప్పాలి. 2026లో అధికారం దక్కించుకోవాలని బీజేపీ పక్కా వ్యూహంతో ఉంది. బంగ్లాదేశ్ సరిహద్దుల నుండి వస్తున్న అక్రమ చొర బాట్లు, డెమోగ్రాఫిక్ మార్పుల అంశాన్ని బీజేపీ ప్రధాన అస్త్రంగా వాడుతోంది.'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ద్వారా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ ఓట్లను ఏకం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని మోడీ బ్రాండ్ ఇమేజ్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా బీజేపీకి బలాన్ని ఇస్తున్నాయి. అమిత్ షా నేతృత్వంలో ప్రతి జిల్లాకు ప్రత్యేక 'వార్ రూమ్స్' ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేశారు. తృణమూల్‌నుండి అసమ్మతి నేతలను చేర్చుకోవడం ద్వారా తమ బలాన్ని పెంచుకుంటున్నారు. మమత ప్రభుత్వంలోని అవినీతిని సామాన్యులకు వివరించడంలో బీజేపీ సోషల్ మీడియాతో పాటు పాదయాత్రలద్వారా విజయం సాధిస్తోంది.ప్రస్తుతానికి బెంగాల్ ఓటర్లు రెండుగా చీలిపోయి ఉన్నారు. 'లక్ష్మీర్‌భండార్' (మహిళలకు ఆర్థిక సాయం), 'యువ సాథి'వంటి పథకాలు గ్రామీణ పేదలను, మహిళలను మమతప్రభుత్వం వైపు ఉండేలా చేస్తున్నాయి. 'మామాటిమానుష్' సెంటి మెంట్ ఇంకా బలంగానే ఉంది. బీజేపీని 'బయటిపార్టీ'గా, బెంగాలీసంస్కృతికి వ్యతిరేకంగా మమత చిత్రీకరిస్తున్నారు. దీనివల్ల భాషాభిమానం ఉన్న ఓటర్లు టీఎంసీ వైపు ఉండొచ్చు. పట్టణ ఓటర్లు, విద్యావంతులు, యువత ఎక్కువగా మార్పు కోరుకుంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అవి నీతి,నిరుద్యోగం వీరిని బీజేపీ వైపు నడిపిస్తున్నాయి.2026 పశ్చిమ బెంగాల్ ఎన్నికలు 'నిరంతరాయ పాలన, రాజకీయ మార్పు' మధ్య జరుగుతున్న యుద్ధం.మమతాబెనర్జీ తన సంక్షేమపథకాలు, తనదైన బెంగాలీ సెంటిమెంట్‌తో 226 స్థానాలకు పైగా గెలుస్తామని ధీమాగా ఉన్నారు. మరోవైపు, బీజేపీ 'చొరబాటుదారులు', 'అవినీతి' అంశాలతో మొదటి సారి బెంగాల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. మమతా బెనర్జీ దిగ్విజయంగా నాలుగోసారి పగ్గాలు చేపడ తారా లేదా తొలిసారి కాషాయజెండా రెపరెపలాడుతుందా అనే ఉత్కంఠకు తెరపడాలంటే మే 4వరకు వేచిచూడక తప్పదు. ●

# భారత్‌కు ఊహించని సవాళ్లు



## మధ్య ప్రాచ్య యుద్ధంతో 3 వారాలుగా ఇంధన సంక్షోభం

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు లోటు రానివ్వం

## యుద్ధం విరమింపచేయడానికి యత్నాలు: లోక్‌సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై, దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు. భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హార్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోడీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు. గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోడీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు. చమురు, గ్యాస్ సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా వివిధ దేశాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, గల్ఫ్, ఇతర సముద్ర మార్గాలను నిశితంగా గమనిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభం భారత్‌కు ఆర్థిక, జాతీయ భద్రత, మానవతా పరమైన సవాళ్లను సృష్టిస్తోందని వివరించారు. యుద్ధంలో చిక్కుకున్న దేశాలతో, దాని ప్రభావానికి గురైన దేశాలతో భారత్‌కు విస్తృతమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మనకు అవసరమైన ముడి చమురు, గ్యాస్‌లో సింహభాగం ఈ ప్రాంతం నుంచే దిగుమతి అవుతోంది. ఇతర దేశాలతో మన వాణిజ్యానికి ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన మార్గం కూడా. అందువల్ల, ఈ యుద్ధం మనపై తీవ్ర ప్రభావం చూపుతోందని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తూ, పనిచేస్తున్నారని, అలాగే వాణిజ్య నౌకల్లో పనిచేసే భారత సిబ్బంది సంఖ్య కూడా చాలా ఎక్కువని, ఈ కారణాల వల్ల భారత్ ఆందోళన సహజంగానే ఎక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు. సంక్షోభ ప్రాంతాల్లోని భారతీయుల భద్రత, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రభావిత దేశాల్లోని ప్రతి భారతీయుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాం. నేను స్వయంగా రెండు దఫాలుగా చాలా పశ్చిమాసియా దేశాల అధినేతలతో ఫోన్‌లో మాట్లాడాను. భారతీయులకు పూర్తి భద్రత కల్పిస్తామని వారంతా హామీ ఇచ్చారని తెలిపారు. దురదృష్టవశాత్తు కొందరు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని చెబుతూ, వారి కుటుంబాలకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నామని వివరించారు. ఇప్పటికే 3,75,000 మందికి పైగా భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని, ఒక్క ఇరాన్ నుంచే 700 మంది మెడికల్ విద్యార్థులతో సహా వెయ్యి మంది వచ్చారని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయ పాఠశాలల్లో 10, 12వ తరగతి పరీక్షలను సీబీఎస్ఈ రద్దు చేసిందని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.


పశ్చిమాసియా సంక్షోభం రైతులపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. గత కొన్నేళ్లుగా మేం తీసుకున్న చర్యల వల్ల వివిధ మార్గాల్లో ఎరువుల దిగుమతి సాధ్యమైంది. రైతులకు మేక్ ఇన్ ఇండియా ఎరువుల ప్రత్యామ్నా యాన్ని కూడా ఇచ్చామని ఆయన వివరించారు.

## సౌదీ, బహ్రెయిన్ సైనిక స్థావరాలపై డ్రోన్ దాడులు

**టెహ్రాన్, మార్చి 23:** సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) సోమవారం ప్రకటించింది. ఈ పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఐఆర్ జీసీ ప్రతినిధి తెలిపారు. అమెరికా నిఘా విమానాలు ఈ స్థావరాల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నందున వాటిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు కేసీ135 స్ట్రాటోట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. సౌదీ అరేబియా తమ దేశంపైకి వస్తున్న ఇరాన్ ఆయుధాలను అడ్డుకుంది. రియాద్, తూర్పు ప్రాంతం లక్ష్యంగా వచ్చిన రెండు డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణిని తమ వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సౌదీ రక్షణ శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలపై కొత్తగా బాంబు దాడులు మొదలుపెట్టింది. తమ లక్ష్యాలను సాధించే దిశగా యుద్ధం సరైన మార్గంలోనే సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. మరోపక్క, ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సంక్షోభం 1970ల నాటి చమురు సంక్షోభం కంటే భయంకరంగా మారవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ ప్రభావం భారత్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. చమురు, ఎల్పీజీ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంపై భారత పార్లమెంటులో ఆందోళన వ్యక్తమైంది.

# మంటల్లో పశ్చిమాసియా

## దురాక్రమణకు దిగితే.. పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్: ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, మార్చి 23:** ఇరాన్‌లో అమెరికా భూతల దాడులకు దిగొచ్చని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. తమ దేశ తీరం లేక ద్వీపాలపై దాడి చేస్తే.. పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని తాజాగా ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు రాయిటర్స్ కథనం పేర్కొంది. దాంతో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. 'దాంతో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా.. హార్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు' అని ఇరాన్ తన ప్రకటనలో శత్రు దేశాలకు గుర్తు చేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ఐలాండ్ అత్యంత కీలకమైనది. హార్మూజ్‌ను తెరిచే విషయంలో ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఆక్రమించాలని యుఎస్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే 4500 మంది సెయిలర్లు, మెరైన్లను మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్–35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికల్స్‌తో కూడిన బెటాలియన్‌ను కూడా పంపింది. అయితే ఈ మోహరింపు హార్మూజ్‌ను తెరవడానికా లేక ఖర్గ్ స్వాధీనానికా అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

## హార్మూజ్‌ను దాటి రావాలంటే రూ.18.76 కోట్లు కట్టాల్సిందే!

### కొత్త నిర్ణయం అమలుకు ఇరాన్ యోచన

**టెహ్రాన్,మార్చి 23:** ప్రపంచ చమురు వాణిజ్యానికి జీవనాడి వంటి హార్మూజ్ జలసంధిలో ఇరాన్ తీసుకున్న ఓ సంచలన నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో, ఈ కీలకమైన జలసంధి గుండా ప్రయాణించే ప్రతి వాణిజ్య నౌక నుంచి 2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.18.76 కోట్లు) ట్రాన్సిట్ ఫీజుగా వసూలు చేయాలని ఇరాన్ యోచిస్తోంది. ప్రస్తుతం అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో తమ రక్షణ వ్యయాలను భరించడానికి, జలసంధిలో భద్రతను పర్యవేక్షించడానికి ఈ నిధులు అవసరమని ఇరాన్ వాదిస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఈ మార్గాన్ని మూసివేసి అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకాలు సృష్టించిన ఇరాన్, ఇప్పుడు దాన్ని పాక్షికంగా తెరిచినా భారీ మూల్యం చెల్లించాల్సిందేనని పరోక్ష సంకేతాలు పంపుతోంది. ఈ చర్య ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమీకరించుకోవాలనేది ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. రోజుకు లక్షల బ్యారెళ్ల ముడిచమురు రవాణా అయ్యే హార్మూజ్ జలసంధిలో ఈ టోల్ టాక్స్ గనుక అధికారికంగా అమలైతే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుంది. ఇప్పటికే యుద్ధం కారణంగా పెరిగిన రవాణా ఖర్చులతో సతమతమవుతున్న షిప్పింగ్ సంస్థలపై ఇది పెను భారంగా మారనుంది. అంతిమంగా ఈ భారం ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు దారితీస్తుందని, ఇది అంతర్జాతీయ వాణిజ్యానికి కోలుకోలేని దెబ్బ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ ప్రతిపాదనపై అంతర్జాతీయ షిప్పింగ్ కౌన్సిల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వసూళ్లు అంతర్జాతీయ సముద్ర చట్టాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. ఇరాన్ తీరంలో ఇప్పటికే అనేక ట్యాంకర్లు నిలిచిపోవడంతో సరఫరా వ్యవస్థ స్తంభించిపోగా, ఈ కొత్త నిబంధన వివాదాన్ని మరింత జఠిలం చేస్తోంది.

## క్షిపణులపై స్టిక్కర్లతో ఇరాన్ సరికొత్తప్రయోగం!

**టెహ్రాన్; మార్చి 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ, ఇరాన్ ఒక వినూత్న నిరసనకు తెరతీసింది. ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన తమ క్షిపణులపై ఇది అక్రమ యుద్ధం మాత్రమే కాదు అమానవీయం. థ్యాంక్యూ ప్రైమ్ మినిస్టర్ అంటూ శాంతి సందేశాన్ని రాసి పంపింది. ఈ చర్య ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, గాజా, లెబనాన్‌లలో హింసను ఆపాలని, ఐరోపా దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలనే ఇరాన్ తమ వ్యూహంలో భాగంగా ఉపయోగించుకుంది. క్షిపణులపై శాంచెజ్ పేరుతో సహా ఆయన మాటలు రాసిన స్టిక్కర్ ను అంటించి ప్రయోగించింది. కేవలం సైనిక దాడికే పరిమితం కాకుండా, ఇజ్రాయెల్ వైఖరిని వ్యతిరేకిస్తున్న అంతర్జాతీయ నేతల గొంతుకను వారికి వినిపించడమే ఇరాన్ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఆయుధాల ద్వారానే శాంతి సందేశాన్ని పంపడం ఒకరకమైన దౌత్యపరమైన వ్యంగ్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ తన దాడులను ఆపకపోతే పరిణామాలు ఇలాగే ఉంటాయని పరోక్షంగా హెచ్చరించడమే దీని వెనుక ఉన్న అంతరార్థం. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నా, మరోవైపు క్షిపణి దాడులు ఆగకపోవడంతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## 40కిపైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసం.. 1970 నాటి చమురు షాక్‌లను మించిన నష్టం

**టెహ్రాన్, మార్చి 23:** కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేనంత ఇంధన సంక్షోభం ముప్పును ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అధిపతి ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ ప్రాంతంలో 40కి పైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసమయ్యాయని మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. దాంతో ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. '1970ల్లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు చవిచూసిన చమురు, గ్యాస్ సంక్షోభాలను మించిన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటోంది. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను. పశ్చిమాసియాలో ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతింటే.. ఆ ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపైనా తీవ్రంగా ఉంటుంది. దాంతో ధరల్లో అస్థిరత, సరఫరా కొరతకు దారితీస్తుంది' అని హెచ్చరించారు. ఇప్పటికే పలు ఆర్థిక వ్యవస్థలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మందగిస్తోన్న వృద్ధితో సతమతమవుతున్నాయి. ఈ సమయంలో ఆయన హెచ్చరికలు వచ్చాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో అతిపెద్ద సంక్షోభంగా 1973ని వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా వ్యవహరించిన అమెరికా, నెదర్లాండ్స్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా.. తదితర దేశాలపై ఒపెక్ దేశాలు చమురు ఆంక్షలు విధించాయి. దీంతో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడి.. అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. 1970ల్లోనే ఇస్లామిక్ విప్లవం వల్ల మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఐరోపాకు గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగింది. వీటిని ఐఇఎ చీఫ్ ప్రస్తుత సంక్షోభంతో పోల్చారు. ప్రస్తుత పరిస్థితులు ఈ ఆయిల్, గ్యాస్ షాక్‌లన్నింటిని మిళితం చేసి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. ఈ అనిశ్చితి నుంచి బయటకు వచ్చేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అత్యవసరమని ప్రపంచ దేశాలకు సూచించారు.

## హార్మూజ్ నుంచి భారత్‌కు వస్తున్న మరో రెండు నౌకలు!

### పూర్తిస్థాయి భద్రత కల్పించిన ఇరాన్

**న్యూఢిల్లీ, మార్చి 23:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయికి చేరినప్పటికీ భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. సుమారు 92,700 మెట్రిక్ టన్నుల వంటగ్యాస్‌తో వస్తున్న రెండు భారీ భారతీయ నౌకలు పైన్ గ్యాస్, జగ్ వసంత్‌లు హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. ఈ నౌకలు ప్రస్తుతం గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. భారత్‌తో ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా ఇరాన్ ఈ నౌకలకు ప్రత్యేక అనుమతి ఇవ్వడం విశేషం. ఇరాన్ నౌకాదళం ఈ నౌకలకు మార్గనిర్దేశం చేసి భద్రత కల్పించింది. యుద్ధ వాతావరణం నెలకొన్న గల్ఫ్ ప్రాంతంలో భారత ఇంధన భద్రతకు ఇది కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన ధరల విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లు దాటినా, కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచింది. వాణిజ్య అవసరాలకు వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 వరకు, ప్రీమియం పెట్రోల్ ధరను రూ.2 వరకు పెంచింది. ఈ నిర్ణయం రవాణా, తయారీ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 15 నుంచి 20 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనతో గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేసుకోవద్దని కేంద్ర పెట్రోలియం శాఖ సూచించింది. అమెరికా వంటి దేశాల నుంచి ఎల్పీజీ దిగుమతులను పెంచేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ ఇంధన ధరలపైనా ప్రభావం పడొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అమెరికాకు భారీగా తగ్గిన చట్టబద్ధమైన వలసలు

### భారత్, చైనాల అభ్యర్థులకే ఎక్కువ నష్టం



**వాషింగ్టన్, మార్చి 23:** అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం వీసా విధానాలను కఠినతరం చేయడంతో చట్టబద్ధమైన వలసలు భారీగా పడిపోయాయి. 2025 మొదటి ఎనిమిది నెలల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించగా, భారత్, చైనా దేశాల వారు తీవ్రంగా నష్టపోయారు. అధికారిక గణాంకాల ప్రకారం 2024 జనవరి ఆగస్టు కాలంతో పోలిస్తే 2025లో ఇదే సమయానికి అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ సుమారు 2.5 లక్షల వీసాలను తక్కువగా జారీ చేసింది. శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు), తాత్కాలిక వీసాల జారీలో మొత్తం 11 శాతం తగ్గుదల నమోదైంది. ఈ తగ్గుదల విద్యార్థులు, ఉద్యోగులు, అమెరికా పౌరుల కుటుంబ సభ్యులకు ఇచ్చే వీసాలతో పాటు పర్యాటక వీసాలపై కూడా ప్రభావం చూపింది. భారత్, చైనా దేశాల వారికి జారీ చేసే వీసాల్లో సుమారు 84వేలు తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా విద్యార్థి వీసాలు 30 శాతానికి పైగా పడిపోగా, ఎక్స్ఛేంజ్ విజిటర్ వీసాలు కూడా దాదాపు 30,000 తగ్గాయి. 19 దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలు, సోషల్ మీడియా ఖాతాల తనిఖీలతో కూడిన విస్తృత పరిశీలన, స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో సిబ్బంది కొరత వంటివి ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలని అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంపై స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి టామీ పిగాట్ మాట్లాడుతూ వీసా అనేది హక్కు కాదు, ఒక సౌలభ్యం మాత్రమే. అమెరికా పౌరుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ఆంక్షలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ పోటీతత్వానికి నష్టం కలిగిస్తాయని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన జాసన్ ఫర్మన్ వంటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సూడాన్‌లో పెచ్చుమీరుతున్న ఆధిపత్యపోరు

### ఆసుపత్రిపై డ్రోన్ దాడి, 64 మంది మృతి



**ఖర్టూమ్, మార్చి 23:** ఆఫ్రికా దేశమైన సూడాన్ లో సైన్యం, పారామిలిటరీ గ్రూప్ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ బలగాల మధ్య మూడేళ్లుగా ఆధిపత్యపోరు కొనసాగుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈస్ట్ దార్ఫూర్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన డ్రోన్ దాడిలో 64 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 13 మంది చిన్నారులు, ఒక వైద్యుడు, ఇద్దరు నర్సులు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ డ్రోన్ దాడిలో 64 మంది మరణించడమేగాక మరో 89 మంది గాయపడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. ఆస్పత్రులపై జరిగిన దాడుల్లో 2వేల మందికిపైగా మృతిచెందారు. ఇదిలావుంటే ఆస్పత్రిపై దాడికి పాల్పడింది సైన్యమేనని ఆర్ఎస్ఎఫ్ ఆరోపించింది. అయితే దీనిని సైన్యం పూర్తిగా ఖండించింది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ట్రంప్ మొండి వైఖరే కారణం : సిఐఎ మాజీ డైరెక్టర్ ధ్వజం

**న్యూయార్కు, మార్చి 23:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై సొంతగడ్డపైనే విమర్శల సెగ తగులుతోంది. ఇరాన్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు ట్రంప్ మొండి వైఖరి, దూకుడు నిర్ణయాలే కారణమని సాక్షాత్తూ అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) మాజీ డైరెక్టర్ వ్యాఖ్యానించారు. ట్రంప్ విధానాల వల్ల అమెరికా ఇప్పుడు బయటకు రాలేని ఒక ఊబిలో చిక్కుకుపోయిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ శక్తిసామర్థ్యాలను, వారి ప్రతిఘటనను అంచనా వేయడంలో వైట్‌హౌస్ పూర్తిగా విఫలమైంది. ట్రంప్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు దేశాన్ని వెనక్కి రాలేని స్థితికి నెట్టేశాయని మాజీ సీఐఏ చీఫ్ విశ్లేషించారు. దౌత్యపరమైన పరిష్కారాలను పక్కనపెట్టి, సైనిక చర్యలకే ట్రంప్ మొగ్గుచూపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకవేళ ఇరాన్ అణు విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, ఆస్తులే లక్ష్యంగా ఇరాన్ ఎదురుదాడి చేస్తుందన్న హెచ్చరికను తేలికగా తీసుకోరాదని గుర్తుచేశారు. హార్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, ట్రంప్ సర్కారు దానిని పట్టించుకోకపోవడంపై నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ యుద్ధ వాతావరణం వల్ల అమెరికా తన మిత్రదేశాల మద్దతును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని, అగ్రరాజ్య ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందన్నారు.

## యుద్ధసమయంలో ఇరాన్‌కు భారత్ మానవతా సాయం



**టెహ్రాన్, మార్చి 23:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, భారత్ అందించిన మానవతా సాయంపై ఇరాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడులతో నష్టపోయిన తమ దేశానికి భారత్ అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొంది. గత వారం టెహ్రాన్‌పై జరిగిన దాడుల్లో 60 మందికి పైగా పౌరులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ కష్ట సమయంలో భారత్ వైద్య, అత్యవసర సహాయాన్ని అందించింది. ఈ సహాయాన్ని ఇరాన్ ఎప్పటికీ మర్చిపోదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్‌తో మాట్లాడుతూ, యుద్ధం జరుగుతున్నప్పుడు ఇలాంటి సాయం అందించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని ఆయన అన్నారు. భారత్ అధికారికంగా అందించిన సాయంతో పాటు, జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లా ప్రజలు చూపిన చొరవ ఈ ఘటనలో ప్రత్యేకంగా నిలిచింది. పురుషులు, మహిళలు, చిన్నారులు అనే తేడా లేకుండా అందరూ విరాళాలు సేకరించారు. మహిళలు తమ బంగారం, వెండి ఆభరణాలు, రాగి పాత్రలను ఇవ్వగా కొందరు తమ జీవనాధారమైన పశువులను సైతం విరాళంగా ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. బుద్గాం వీధుల్లో ఇరాన్‌కు మద్దతుగా, ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఇరాన్ ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతిని కోరుకునే భారత్ ఈ కష్ట సమయంలో ఇరాన్‌కు సాయం చేయడం ద్వారా తన దౌత్య స్వాతంత్ర్యాన్ని, మానవతా విలువలను చాటుకున్నట్లయింది. ముఖ్యంగా, బుద్గాం ప్రజల స్పందన భారతీయుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## మెటా సముద్రగర్భంలోని కేబుల్‌కు బ్రేక్!

### ఇరాన్‌తో ఉన్న యుద్ధభయాలే కారణం

**టెహ్రాన్, మార్చి 23:** పశ్చిమాసియాలో రాజుకుంటున్న యుద్ధం కేవలం గగనతలం, భూభాగాలకే పరిమితం కావడం లేదు. ప్రపంచ డిజిటల్ వ్యవస్థకు వెన్నెముకలాంటి సముద్రగర్భ డేటా కేబుళ్లపైనా ప్రభావం పడుతోంది. దీనికి తాజా నిదర్శనంగా, మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ) చేపట్టిన ప్రతిష్ఠాత్మక 2 ఆఫ్రికా కేబుల్ ప్రాజెక్టు పనులు పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టర్ అల్కాటెల్ సబ్‌మెరైన్ నెట్‌వర్క్స్ ఫోర్స్ మేజర్ నోటీసులు జారీ చేయగా, కేబుల్ వేసే నౌక సౌదీ అరేబియా సమీపంలో చిక్కుకుపోయింది. ఈ పరిణామం కేవలం ప్రస్తుత డిజిటల్ మార్గాలకే కాదు, భవిష్యత్తులో నిర్మించ తలపెట్టిన పటిష్ఠమైన వ్యవస్థలకూ యుద్ధం ఆటంకం కలిగిస్తోందని స్పష్టం చేస్తోంది. ప్రపంచంలో రెండు ప్రాంతాలు ప్రస్తుతం డిజిటల్ కమ్యూనికేషన్లకు అత్యంత కీలకమైనవిగా ఉన్నాయి. అవే ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి. ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలను కలిపే ఎర్ర సముద్రం ఇప్పటికే అత్యంత ముఖ్యమైన సబ్‌సీ డేటా కారిడార్‌గా ఉంది. గతంలో ఇక్కడ కేబుళ్లు దెబ్బతినడంతో భారత్, పశ్చిమాసియాలోని అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ వేగం తగ్గి, సేవలకు అంతరాయం కలిగింది. ఈ మౌలిక సదుపాయాలు ఎంత సున్నితమైనవో ఆ ఘటన గుర్తుచేసింది. ఇప్పుడు హార్మూజ్ జలసంధి కూడా ప్రాంతీయంగా అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఏఏఈ1, ఫాల్కన్, గల్ఫ్ బ్రిడ్జ్ వంటి కేబుల్ వ్యవస్థలు దీని గుండానే వెళుతున్నాయి. గల్ఫ్ దేశాలలోని డేటా సెంటర్లను అంతర్జాతీయ నెట్‌వర్క్‌లతో అనుసంధానించడంలో ఇది కీలకం. అందుకే హార్మూజ్‌ను ఇప్పుడు కేవలం చమురు మార్గంగానే కాకుండా కమ్యూనికేషన్స్ చౌక్‌పాయింట్‌గానూ చూస్తున్నారు. సముద్ర గర్భంలోని కేబుళ్లు 95శాతం పైగా అంతర్జాతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను, రోజూ సుమారు 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లావాదేవీలను మోసుకెళతాయి. వీటిని లక్ష్యంగా చేసుకోవడం సులభం కాకపోయినా నౌకల లంగర్లు, ప్రమాదాలు, సైనిక కార్యకలాపాల వల్ల అవి దెబ్బతినే ప్రమాదం ఉంది. అయితే, ఈ యుద్ధం వల్ల ప్రపంచ ఇంటర్నెట్ మొత్తం ఆగిపోతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. ఒక మార్గం దెబ్బతింటే నెట్‌వర్క్‌లు ప్రత్యామ్నాయ మార్గాల్లో డేటాను మళ్లిస్తాయి. అసలైన ముప్పు ఇంటర్నెట్ పూర్తిగా ఆగిపోవడం కాదు, వేగం తగ్గడం (లేటెన్సీ), ప్రాంతీయంగా సేవలు నిలిచిపోవడం, డేటా ప్రవాహానికి తీవ్ర అంతరాయాలు కలగడం. కొత్త ప్రాజెక్టులు ఆలస్యం కావడం, ఇప్పటికే ఉన్న మార్గాలు బలహీనంగా ఉండటం, యుద్ధ వాతావరణం నెలకొనడం ఈ మూడు అంశాలు కలిసి డిజిటల్ ప్రపంచానికి కొత్త సవాల్ విసురుతున్నాయి. ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి మార్గాల్లో ఏకకాలంలో సమస్యలు తలెత్తితే దాని ప్రభావం మధ్యప్రాచ్యానికే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ నెట్‌వర్క్‌లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. క్షిపణుల దాడులు వార్తల్లో నిలుస్తున్నాయి.

## భక్తులపై పూజారుల మూకుమ్మడి దాడి

### దాడి చేసిన అర్చకులు



**ముంబై, మార్చి 23:** మహారాష్ట్రలోని ఒక ఆలయంలో పూజారులు రెచ్చిపోయారు. కొందరు భక్తులను ఈడ్చుకెళ్లారు. వారిని కొట్టడంతోపాటు పిడిగుద్దులు కురిపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానిక జ్యోతిబా ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాంప్రదాయ ప్రదక్షిణ, హారతి సమయంలో కొందరు భక్తులు దురుసుగా ప్రవర్తించినట్లు ట్రస్ట్ ఆరోపించింది. హారతి కార్యక్రమానికి వారు అంతరాయం కలిగించినట్లు తెలిపింది. పదేపదే హెచ్చరించినప్పటికీ వారు వినిపించుకోలేదని, పూజారులపై గులాల్ విసిరారని ట్రస్ట్ ఆరోపించింది. ఈ గందరగోళంలో సాంప్రదాయ తలపాగాలు కిందపడిపోవడంతో పూజారులు ఆగ్రహించినట్లు వెల్లడించింది. మరోవైపు పరిస్థితి అదుపు తప్పడంతో సుమారు 20 మంది పూజారులు నిందితులైన భక్తులను ఆలయ ప్రాంగణంలోకి ఈడ్చుకెళ్లి కొట్టారు. భయంతో పారిపోవడానికి వారు ప్రయత్నించగా తిరిగి లాక్కెళ్లి మళ్ళీ కొట్టారు. ఆ భక్తులపై పిడిగుద్దులు కురిపించారు. దీంతో ఆ ఆలయం వద్ద గందరగోళం చెలరేగింది.



అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవానికి గవర్నర్ శివప్రతాప్‌శుక్లాను ఆహ్వానిస్తున్న డిజిపి శివధర్‌రెడ్డి

### అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు ఆహ్వానం

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలో బుధవారం నాడు ప్రారంభంకానున్న 74వ బిఎన్ మల్లిక్ స్మారక అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవానికి రావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను డిజిపి శివధర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం నాడు గ వర్నర్ శుక్లాకు డిజిపి ఆహ్వానలేఖను అందించారు. గవర్నర్ నివాసం లోక్ భవన్‌లో గవర్నర్ శుక్లాను డిజిపి శివధర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలి సి ఈ లేఖను అందించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ గురించి, ఇందులో పాల్గొంటున్న జట్ల గురించి, ఏర్పాట్లకు సంబంధించి డిజిపి, గవర్నర్‌కు వివరించారు. వాస్తవానికి ఈ టోర్నమెంట్‌ను గవర్నర్ ప్రారంభించే విధంగా ఇంతకు ముందే ఏర్పాట్లు జరిగాయి. అయితే ఇంతకు ముందు వున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బదిలీ అవడం, ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా రావడంతో కొత్త గవర్న ర్‌కు ప్రోటోకాల్ ప్రకారం డిజిపి ఆహ్వానం అందజేశారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

## కెసిఆర్ పాలన కంటే దారుణ నిర్బంధం

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తోందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలను రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని మండిపడ్డారు.

హామీల అమలు కోరుతూ బీజేపీ చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి నుండే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను, తమ పార్టీ సీనియర్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, గతంలో కేసీఆర్ పాలన కంటే దారుణమైన నిర్బంధం ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కనిపిస్తోందని విమర్శించారు. ఇదే పద్ధతి అవలంబించిన బీఆర్ఎస్‌ను ప్రజలు గద్దె దించారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు.

**ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించకుండా మభ్యపెడుతున్నారు :ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు చేస్తున్న ఖర్చులకు అస్సలు పొంతన లేదని బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2500లు, తులం బంగారం, విద్యా ర్థులకు స్కూటీలు వంటి ఆకర్షణీయమైన హామీలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న అరెస్టులకు బీజేపీ భయపడదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనాపాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.

## సిఎం అనుచిత వ్యాఖ్యలనూ రికార్డుల నుండి తొలగించాలి

### మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు. తాను సుదీర్ఘకాలంగా శాసనసభకు వస్తున్నానని, కాని పండబెట్టి తొక్కుతా అని ఏ సిఎం అనగా చూడలేదన్నారు. అసలు రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా... అని అనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత తమను రెండున్నరగంటలు ఖాళీగా కూర్చోబెట్టారని అసహనం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేశారని రికార్డుల నుంచి తొలగించినపుడు మరి సిఎం రేవంత్ వ్యాఖ్యలను ఎందుకు తొలగించరని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలుగజేసుకున్న శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.సినియర్ సభ్యుడు తలసాని సభను తప్పుదోవ పట్టించేవిధంగా మాట్లాడొద్దని అన్నారు.

**ఆదివారం కూడా సభ..**

బడ్జెట్‌పై సాధారణ చర్చలో ఒక్కో శాఖపై విడమరిచి మాట్లాడాల్సిన పనిలేదని హరీష్‌రావుకు శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. సాధారణ చర్చలో ఇచ్చిన సమయం కంటే ఎక్కువ సేపు మాట్లాడి మళ్లీ మైక్ ఇవ్వాలనడం సరికాదన్నారు. ప్రత్యేకంగా పద్దులపై చర్చ ఉంటుందని, ఆదివారం కూడా సభను నిర్వహిస్తున్నామని అప్పుడు ఒక్కో పద్దుపై వివరంగా మాట్లాడాలని హరీష్‌రావుకు సూచించారు.

# చట్టసభల్లో మహిళ భాగస్వామ్యం పెంచడమే కాంగ్రెస్ విధానం

### డీలిమిటేషన్‌తో 40 నుండి 50 సీట్లు మహిళలకు..

### పిపిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** చట్టసభల్లో మహిళ భాగస్వామ్యం పెంచ డమే కాంగ్రెస్ విధానమనీ రానున్న రోజుల్లో మహిళల సంఖ్య ప్రజానాయకులుగా పెరగబో తుందని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.గాంధీ భవన్‌లో సోమవారం మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నూతన అధ్యక్షురాలు స్వర్ణ అధ్యక్షతన జరుగగా.. దానికి ముఖ్యఅతిథిగా మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, విప్‌లు అది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, చైర్మన్ ఈరవత్రి అనిల్ ధనలక్ష్మి ్మ, కేతురి వెంకటేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూరాష్ట్రంలో డీ లిమిటేషన్ జరిగితే 40 నుండి 50 సీట్లు మహిళలకు వచ్చుడు ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌పార్టీ సంస్థగతంగా బలపడాలంటే మహిళలను స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయాలనీ, యువతను ప్రోత్సాహించాలని అన్నారు. జిల్లా నుండి నలుగురు లేదా ఐదుగురిని నామినేటడ్ పదవుల్లో స్థానం కల్పిస్తామనీ చెప్పారు.కాంగ్రెస్ పార్టీ లో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందనీ అన్నారు.కష్టపడి పని చేసిన వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయనీ చెప్పారు.

మహిళ కాంగ్రెస్ నాయకులు కష్టపడి పని చేయాలనీ అన్నారు.పదవులు రావాలంటే పనితీరు బాగుండాలనీ అన్నారు.ఇచ్చిన పదవులను అలంకార ప్రాయంగా కాకుండా బాధ్యతగా చెప్పట్టి పార్టీ అభివృద్ధి. కోసం పని చేయాలనీ హితవు చెప్పారు.రాబోయే రోజుల్లో మహిళలకు చట్ట సభలలో అధిక సీట్లు రానున్నాయి.రిజర్వేషన్ల ప్రకారమే కాకుండా బలమైన నాయకులుంటే ఎక్కువ సీట్లు ఇస్తామనీ తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందనీ ఇవి అర్హులకు అందేలా చూడాలనీ మహిళల్లో పార్టీ ప్రచారం చేసి కాంగ్రెస్ మరింత బలోపేతం అయ్యేలా చూడాలని అన్నారు. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ నూతన అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ లో నాయకులు మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలనీ అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టి, మహిళా సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. మహిళలు పురుషులలో సగ భాగం. మన హక్కుల కోసం మనం పోరాడాలి. పార్టీ నిర్మాణంలో మహిళలది కీలక పాత్ర. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామనీ చెప్పారు. ఏ కష్టం వచ్చిన నాతో చెప్పాలని, పార్టీ క్రమశిక్షణను ఉల్లాంఘిస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామనీ హెచ్చరించారు.త్వరగా క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తాం. ఆఫీస్ ఇన్‌చార్జి, స్పోక్స్ పర్సన్ నియమిస్తామనీ, త్వరలో జిల్లా పర్యటన వివరాలు తెలియజేస్తానని తెలిపారు.

# రవాణా శాఖలో సంస్కరణలు తెచ్చాం

### రెండవ వ్యక్తిగత వాహనంపై అదనపు జీవితకాల పన్ను రద్దు: మంత్రి పొన్నం

**హైదరాబాద్ (బేగంపేట), మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రవాణాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సోమవారం బేగంపేట వరుణ్ మోటార్స్‌లో మంత్రి పొన్నం వాహన పోర్టల్ ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్,రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు వాహన్ సారధిలో ఉండేవి అని,గత సంవత్సరం తెలంగాణా ప్రభుత్వం సారధిలో చేరాం అన్నారు. సోమవారం వాహన్‌లో చేరామన్నారు. వాహన్ ద్వారా సోమవారం నుంచి రెండవ వాహన కొనుగోలు చేసే వారికి 2శాతం అదనపు ట్యాక్స్ రద్దు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15చెక్ పోస్టులు ఎత్తివేశామన్నారు.వాహన దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామన్నారు. రవాణా శాఖ ఇ.వి. పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామన్నారు. షోరూమ్‌లలో వాహనాలు పారదర్శకంగా రిజిస్ట్రేషన్ అయ్యేలా చేసామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణా రవాణాశాఖ చేస్తున్న సంస్కరణలు,రోడ్ సేఫ్టీపై కేంద్రంలోనే తెలంగాణా ను కేంద్రమంత్రి నితిన్ గడ్గరీ అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసారు.ఈ వీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు తెలంగాణా బ్రాండ్ అంబాసిడర్ గా మారుతుందన్నారు.సీఎం నాయకత్వంలో రవాణా శాఖ ఈ డిజిటల్ మార్పును ముందుకు తీసుకెళ్తుంద న్నారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 1500కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయన్నారు. భారీ సంఖ్యలో వాహనాల సమాచారాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం అన్నారు.ఈ అవసరాన్ని తీర్చడానికి వాహన్ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఈ పోర్టల్ ద్వారా వాహ నాలకు సంబంధించిన అన్ని వివరాలు ఒకే జాతీయ డేటాబేస్‌లో సమీకరించ బడతాయ న్నారు. దీని వల్ల సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయ న్నారు. వాహన రిజిస్ట్రేషన్, ఓనర్‌షిప్ ట్రాన్స్ ఫర్, పన్నుల చెల్లింపు వంటి సేవలు ఇప్పుడు ప్రజలకు సుల భంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వం ప్రజ లకు ఆర్థికంగా కూడా ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకుందన్నారు. సోమవారం నుంచి రెండవ, తదుపరి వ్యక్తిగత వాహనాలపై ఉన్న అదనపు 2 శాతం జీవిత కాల పన్నును రద్దు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. 10 సంవత్సరాలుగా సర్వీసు నుంచి తొలగింపునకు గురైన వారికి ఉద్యో గాలిచ్చామని ఆయన గుర్తు చేసారు.

కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాం, ఉద్యోగ నియామకాలు చేస్తున్నామన్నారు.కొత్త డిపోలు ఏర్పాటు చేసాం,ఆర్టీసీ బస్‌స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. మహాలక్ష్మి పథకం విజయ వంతం అయిన డ్రైవర్లకు, కండక్టర్ లకు కొంత పని భారమైన వారి విషయంలో ప్రభు త్వం సానుకూలంగా ఉందన్నారు.



వరుణ్ మోటార్స్‌లో వాహన పోర్టల్ ను లాంఛనంగా ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లా డుతూ సంవత్సర కాలం క్రితం సారథిలో చేరామని, సోమవారం వాహన్ పోర్టల్‌ను ప్రారంభించామ న్నారు. అనేక సంస్కరణలు చేస్తున్నా మన్నారు. జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో సోమవారం వాహన్‌లో చేరినట్లు వికాస్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో జేటీసీలు చంద్రశేఖర్‌గౌడ్, రమేష్, శివలింగయ్య, ఎన్ఐసీ ప్రతినిథి జగదీష్, వరుణ్ మోటార్స్ అధినేత వరుణ్, డీటీసీలు ఇతర రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దుబారాతో అప్పుల ఊబిలో తెలంగాణ

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** కెసిఆర్ దుబారా ఖర్చుతోతెలంగాణాను అప్పుల ఊబిలోకి నెట్టి ఆయన మాత్రం ఫామ్ హౌస్ కి పరిమిత మయ్యారనీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.గాంధీ భవన్ లో సోమవారం ఒబిసి సెల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బిజెపి నేతలు బిసి వ్యతిరేకులనీ ఆయన ఆరోపించారు. బిసిల్లో ఐక్యత లోపం ఉంటే ఏదైనా సాధిస్తామని భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ లో బిసి ముఖ్యమంత్రి అవుతారనీ ధీమా చెప్పవచ్చుకానీ బిఆర్ఎస్ బిజెపిలో బిసిలు ముఖ్యమంత్రి కాలేరనిఆయన అన్నారు. బిసి ముఖ్య మంత్రి అవుతారని బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు చెప్పే దమ్ముందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 65 శాతం బిసిలకు చైర్మన్ పదవులు ఇచ్చామని .. 60 శాతం ఎస్సి, ఎస్టీలకు, బిసి లకు డిసిసి అధ్యక్ష పదవులు, 67 శాతం బిసి సర్పంచ్లను గెలుపించుకున్నామనీ వివరించారు. దేవుళ్ళ పేర్లు చెప్పడం తప్ప బండి సంజయ్ కి బిసి లు గుర్తు రారనీ అన్నారు. దమ్ములేని దద్దమ్మలు తెలంగాణ నుంచి బిజెపి ఎంపిలుగా ఉన్నారనీ నిందించారు. కుల సర్వే తో దేశానికి రోల్ మోడల్ తెలంగాణ అయినదనీ తెలిపారు.వీర్లపల్లి శంకర్ నేతృత్వంలోనీ ఒబిసి మరింత పార్టీ బలోపేతం అవుతుందని ఆకాంక్షను వ్యకతనంచేశారు.. 100 సీట్లతో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమనీధీమా వ్యక్తంచేశారు. ప్రతి పోరాటంలో బిసిల పాత్ర అధికమని చెప్పారు. బిసిలు ఏకమై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎవరెంతో వారికంత వాటా రాహుల్ గాంధీ నినాదానికి అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు ఇచ్చామని తెలిపారు. తెలంగాణలో సన్న బియ్యం కార్యక్రమం చరిత్రాత్మ కమని అభివర్ణించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో బియ్యం దోపిడీ జరిగిందనీ చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి డిలిమిటెషన్ అయితే 140 పైగా సీట్లు గెలుస్తామనీ అన్నారు. బిసి లకు 42 శాతం డిక్లరేషన్ ప్రకటించి చట్టం చేశామనీ ఆ బిల్లు గవర్నర్ దగ్గర ఎందుకు పెండింగ్ ఉందో బిజెపి నేతలు సమాధానం చెప్పాలనీ అన్నారు. ఎన్నో రాష్ట్రాలకు బిసి ముఖ్యమంత్రులు,గవర్నర్లు అందించిన పార్టీ కాంగ్రెస్ అని స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. బిసిలకు న్యాయం ఖర్గే రాహుల్ గాంధీ సోనియా గాంధీ, సీఎం రేవంత్ నేతృత్వంలో మాత్రమే సాధ్యమనీ అన్నారు.

# ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు బిసిలు ఐక్యం కావాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో అన్ని రకాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు బీసీలంతా ఐక్యం కావాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం బిసి జనసభ అధ్య క్షుడు డి. రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో 'బీసీ లకు మరో మోసం-2026 బడ్జెట్' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి శాసన మండలి పక్షనేత మధుసూదనాచారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎంపి లింగయ్య యాదవ్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజా రాంయాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో బీసీలను మోసం చేస్తుంటే.. రాహుల్‌గాంధీ ధృతరాష్ట్రుడిలాగా కళ్లకు గంతలు కట్టుకున్నాడని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో 24 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న వాగ్దానానికి తిలోదకాలు ఇచ్చాడని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు చేసిన అన్యాయానికి నిరసనగా చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. మిగతా బీసీ సంఘాల నాయకులు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవి, నారగోనిలను సంప్రదించి ఉమ్మడి ఐక్య కార్యా చరణను త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. బీసీల నయవంచకుడు సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించే వరకు తమ పోరాటం కొనసాగు తుందని ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా



అభివాదం చేస్తున్న రాజారాంయాదవ్, మధుసూదనాచారి, చిరంజీవులు, ఎంపి లింగయ్యయాదవ్ తదితరులు

హాజరైన మండలి ప్రతి పక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనచారి.. కాంగ్రెస్ వైఖరిని తప్పు పట్టారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర అంతా మోసపూరిత చరిత్రేనని బడ్జెట్ కేటా యింపులతో మరోసారి నిరూపించుకుందని విమ ర్శించారు. మరో అతిథి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాలవారీగా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడి స్తామని అన్నారు. బీసీలకు సరైన బడ్జెట్ ఇవ్వకుండా నమ్మించి మోసం చేసిందని ఆరోపిం చారు. జిల్లాల వారీగా రౌండ్‌టేబుల్ సమావేశాలు ఏర్పా టు చేసి, కాంగ్రెస్ ద్వందవైఖరిని ఎండగడ తామ ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో బడ్జెట్ ప్రతుల దహనం కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు.

# ఆర్టీసీకి మహాలక్ష్మి ఆదాయం

## రూ. 4122 కోట్లు : మంత్రి పొన్నం

### 'మహాలక్ష్మి'తో మహిళలు 283.94 కోట్ల ప్రయాణాలు

### సంస్థ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించండి : హరీశ్‌రావు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో మహాలక్ష్మి పథకంతో మహి ళలు 283.94 కోట్ల ప్రయాణాలు చేశారని రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం బిఆర్ ఎస్ శాసనసభ్యుడు హరీశ్‌రావు ఆర్టీసి కొత్త పిఆర్‌సి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ సిబ్బందిని ఎప్పుడు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారో చెప్పాలన్నారు.సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. కొత్త బస్సులను తెప్పించాలని కోరితే బస్సులు లేవని అంటున్నారని పేర్కొన్నారు. కొత్తవి లేకుంటే ఉన్న పాత బస్సులనే పునరుద్ధరిస్తారా చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సభను తప్పుదోవ పట్టించారని హరీశ్‌రావు మండిపడ్డారు.దీనికి మంత్రి పొన్నం సమాధానం చెబుతూ 2023 డిసెంబరు 9నుంచి 2024 మార్చి 31 వరకు మహాలక్ష్మి పథకం పద్దు కింద 1163.07 కోట్లు సంపాదించారని చెప్పారు. ఆర్టీసిలో మహాలక్ష్మి ఆదాయం ప్రతి యేడు పెరిగి పోతున్నదని 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4122.07కోట్లు ఆదాయం లభించిందని అన్నారు. మహాలక్ష్మి పథకం లబ్దిదారులకు చిప్ ఆధారిత స్మార్ట్ కార్డు అందిస్తామని పొన్నం ప్రభాకర్ వివరించారు. స్మార్ట్‌కార్డులను టిజిటిఎస్ సిజిజి స్వయంసహాయక బృందాలు, విద్య, ఆరోగ్య శాఖ డేటాబేస్ వంటి వివిధ వనరుల నుంచి డేటాను సేకరిస్తామని తెలిపారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 23, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీతోపాటు తెలంగాణ రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే పర్మనెంట్ చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటి యూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై కూనంనేని మాట్లాడుతూ ఏడేళ్లుగా కార్మికులకు వేతనాలు పెంచకపోవటం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ పరిధిలో విలీనమయిన మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీహెచ్ఎంసీ వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో వేతనాలు చెల్లించటం లేదని ఖమ్మం, వైరా, మధిరతోపాటు కొన్ని మున్సిపాలిటీలలో నెలలు గడిచిపోతున్నా వేతనాలు చెల్లించటం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్య క్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసురత్నం, నేతలు బాలరాజు, నరసింహాతోపాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట ప్రజావంచన

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** కేసీఆర్ సర్కారుపై ప్రజలకు ఎంతో భరోసా ఉన్నా.. అమలు కాని 6 గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ "అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన జాబ్ క్యాలెండర్ అమలు ప్రశ్నార్థకంగా మారింది. త్వరలో స్కూటీలు ఇస్తామని సీఎం ప్రక టించారు. కానీ బడ్జెట్లో పైసా కేటాయించలేదు. మున్సిపల్ ఎన్నికలప్పుడు రైతు భరోసా వేస్తామని మోసం చేశారు. తమ లెక్క ప్రకారం 16 లక్షల మంది రైతు లకు రుణమాఫీ కాలేదు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఎక్కుడున్నాయి' అని వెంటరామిరెడ్డి ప్రశ్నించారు.

**రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసిన ఘనత కెసిఆర్ సర్కారుదే : అద్దంకి దయాకర్**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ. 19వేల కోట్ల మిగులు బడ్జెట్ తో కేసీఆర్ సర్కారు అధికారం కైవసం చేసుకుని పదేళ్ల తర్వాత తమకు అధికారం అప్పగించేప్పుడు రూ.7 లక్షల కోట్ల అప్పు చూయించారని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ అన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిస్తూ మల్లన్నసాగర్ గురించి బీఆర్ఎస్ గొప్పలు చెప్తోందని కానీ అన్యాయంగా భూములు కోల్పోయిన బాధతో అనేక మంది అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. మూసీని బాగు చేసి నగర వాసులకు కాలుష్యం లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కారు పేదల మంచి మర్చి పోయి పాలన చేస్తే తమ సర్కారు మాత్రం పేదలకు ప్రజాపాలన అందిస్తోందన్నారు.

**శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ**

**సుప్రీంకోర్టు అక్షింతలు వేసినా అదే తీరు : ఏవిఎన్ రెడ్డి**

రిటైరైన ఉద్యోగుల పట్ల దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో పరిస్థితి దయనీయంగా తయారైందని బిజెపి శాసనమండలిపక్షనేత ఏవిఎన్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ అయ్యి 20 నెలలు గడిచినా వారి జీవిత కాలం పొదుపు చేసుకున్న బెన్ఫిట్స్ ఇవ్వకుండా వారిని వేధించడం దుర్మార్గం అన్నారు. దాదాపు రూ. 8వేల కోట్ల మేర ఇలా పెండింగులో ఉన్నాయని ఇక ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ మాటే లేకుండా పోయిందన్నారు. ఇదంతా గత, ప్రస్తుత ప్రభుత్వాలకు ఆర్థిక క్రమశిక్షణ లేని ఫలితమేనన్నారు. రాష్ట్రంలో ఏం ఉద్దరించారని రూ. 8.6 లక్షల కోట్ల అప్పులు చేశారు? ప్రజలు కష్టపడి చెల్లించే పన్నులను సంక్షేమం పేరిట ఇష్టారాజ్యంగా ఖర్చు చేసే హక్కు ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారు. ఓవైపు ఉచితాలు వద్దని సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా... అధికారమే ధ్యే యంగా అలవికాని హామీలను ఇస్తున్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం నాశనమైంది. ప్రభుత్వం అప్పు చేస్తు న్నప్పుడు అందుకో అర్థముండాలి. తమ కష్టార్జితం కాదు కాబట్టే పెద్ద ఎత్తున వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల సుడిగుండంలో ముంచేస్తున్నారు. ఇప్పటికే ఉన్న ఇళ్లను కూలగొట్టకుండా మూసీ పునరుజ్జీవం చేయాలి అని ఏవిఎన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీసీలో ట్రైనీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి 29న రాత పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్టీసీలో ట్రైనీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ట్రైనీ మెకానికల్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి ఈ నెల 29వ తే దీన రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు సెషన్లలో జరిగే ఈ పరీక్షలు మొదట ఉదయం పది గంట నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు వుంటుందని ఆయన తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు త మ హాల్ టికెట్లను సోమవారం నుంచి 28వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీస్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 9391005006కు ఫోన్ చేయాలని ఆయన కోరారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించేది లేదని ఆయన తెలిపారు.

## ఎన్పీడిసిఎల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** డిజిటల్ ఆవిష్కరణకు గాను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఎక్సలెన్స్ అవార్డును కైవసం చేసుకుంది. విద్యుత్ పంపిణీకి సంబంధించి నూతన ఆవిష్కరణలలో అగ్రగామిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఈ అవార్డుకు ఎంపికైంది. ప్రధానంగా ఆపరేషనల్ ఎక్సలెన్స్, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీ అనే మూడు అత్యంత ప్రభావవంతమైన విభాగాల కింద ప్రతిష్టాత్మకమైన గవర్నెన్స్ అవార్డ్స్ 2026ను గెలుచుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సెక్రటరీ కె. వెంకటేశం ఈ అవార్డును స్వీకరించగా, సోమవారం హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్ల సమక్షంలో సంస్థ సీఎండీ కె వరుణ్ రెడ్డికి దీన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారం సంస్థకు ఒక కార్పొరేట్ మైలురాయి కాదని, ఇది ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలోని ప్రతి ఒక్క ఉద్యోగి యొక్క కఠోర శ్రమ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనమన్నారు.

## మూసీ బాధితులకు పునరావాసం కల్పిస్తాం

>> చేస్తామని సోమవారం శాసనమండలిలో ప్రకటించారు. మూసీపరివాహక ప్రజలకు భరోసా ఇచ్చారు. భవిష్యత్ అభివృద్ధి కోసం ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేసుకున్నాం దయచేసి అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దు మూసీ రివర్ డెవలమెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది తామే అని సిరిసిల్ల ఎమ్మెల్యే (కెటిఆర్) చెప్పాడు ప్రారంభించి మీరు వదిలేస్తే.. మేం ముందుకు తీసుకెళుతున్నాం.. మీకున్న అభ్యంతరమేంటి? మూసీ ప్రక్షాళనపై ఎందుకు రాజకీయం చేస్తున్నారు అని విపక్షాలను ప్రశ్నించారు. ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలు ఇవ్వండి ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన నుంచి బయటకు రండి.. రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టండి నాకు మీ సూచనలు ఇవ్వడానికి ఇబ్బంది అనుకుంటే.. ఒక కేబినెట్ సబ్ కమిటీ వేస్తా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబుతో ఒక కమిటీ వేస్తాం మీ సలహాలు, సూచనలను కమిటీకి సమర్పించండి అని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ఎవరినీ నిరాశ్రయులను చేయం... పునరావాసం కల్పిస్తానని మీ ద్వారా ప్రభుత్వం మాట ఇస్తుంది ఏ ఒక్కరికీ నష్టం చేయం.. మెరుగైన వసతులు కల్పిస్తాం, మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా రాజకీయ పార్టీల ఉచ్చులో పడవద్దని కోరుతున్నామా అధికారులు మీకు సహాయం అందిచేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజకీయ పార్టీలు ప్రజల్లో అపోహాలు సృష్టించకండి.. అభివృద్ధిని అడ్డుకోకండి సూచించారు. 'దేశంలో ఎన్నో నగరాలున్నా ప్రధానంగా ఐదు నగరాల గురించి మాత్రమే చర్చించుకుంటాం పొలిటికల్ రాజధానిగా ఢిల్లీ, ఫైనాన్షియల్ కేపిటల్ ముంబై, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల గురించి చర్చించుకుంటాం పొలిటికల్ కేపిటల్ గా ఉన్న ఢిల్లీలో కాలుష్యం కారణంగా పాఠశాలలలకు, ఆఫీసులకి సెలవులు ఇస్తున్నారు ముంబై లో వర్షాలు వస్తే వరదలు వచ్చే పరిస్థితి ఫైనాన్షియల్ కేపిటల్ గా ఉన్న ముంబైలో నివసించలేని పరిస్థితి బెంగుళూరులో విపరీతమైన ట్రాఫికక్, చెన్నైలో వరదలతో ఇబ్బందులు పడే పరిస్థితి హైదరాబాద్ రాక్స్ అండ్ లేక్స్ సిటీ అది ఓల్డ్ సైట్ అని మనం చెప్పుకుంటున్నా.. అది ఒరిజినల్ సిటీ చార్మినార్, గుల్జార్ హౌస్, మనం ఉన్న శాసన మండలి ఎన్నో చారిత్రక కట్టడాలు నగరంలో ఉన్నాయి ఇలాంటి ఘన చరిత్ర ఉన్న నగరంలో మానవ తప్పిదాలతో సమస్యలు వస్తున్నాయి అని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ప్రధానంగా వాహనాల సంఖ్య పెరిగింది వీటికి పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది రవాణాలో రోడ్లు, రైల్వే, ఎయిర్ పోర్టు, పోర్టు కీలకం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి చేసుకున్నాం మెట్రోను నిర్మించుకున్నాం అని చెప్పారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం తెలంగాణను మూడు జోన్లుగా విభజించుకున్నాం క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు జోన్లుగా విభజించాం అని చెప్పారు. ఔటర్ రింగురోడ్డు ఇన్ సైడ్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ. ఈ ప్రాంతంలోని కాలుష్య కారక పరిశ్రమలకు ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలిస్తే.. మధ్యతరగతికి భూమి అందుబాటులోకి వస్తుందన్నారు. నగరం నివాస యోగ్యంగా మారుతుంది రోడ్లను అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్ అని మూడు భాగాలుగా అభివృద్ధి చేసుకుంటున్నాం ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ప్రణాళికలు తీసుకున్నాం 29 ప్రాంతాల్లో జరుగుతున్న పనుల ప్రణాళికలు మీ ముందు పెట్టాం మెట్రో పై ఎల్ అండ్ టీ తో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయించామని చెప్పారు.

మెట్రోలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేదు.. అందుకే మెట్రోను విస్తరిస్తున్నాం మెట్రో విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిచింది త్వరలోనే మెట్రో విస్తరణకు త్వరలోనే చేపట్టబోతున్నాం అని చెప్పారు. బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి కూడా అండర్ పాస్ రోడ్డుకు అనుమతి తీసుకొచ్చాం దేశంలో రన్ వే కింద ఇలాంటి రోడ్డు ఎక్కడా లేదు. నల్లగొండ, విజయవాడ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్లను పూర్తి చేసుకుంటున్నాం అని పేర్కొన్నారు. నగరంలో సిగ్నల్ దగ్గర ఆగే వ్యవస్థను తగ్గించి ప్రయాణం సాఫీగా సాగేలా చేయాలనేది మా ప్రయత్నం కొంత కఠినం అనిపించినా ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలనుకుంటున్నాం ఫుట్ పాత్ లో ఉండే చిరు వ్యాపారుల కోసం ఎక్కడైనా స్థలాన్ని కేటాయించి అక్కడ వ్యాపారాలు చేసుకునేందుకు ప్రోత్సహిద్దాం అని చెప్పారు. కేబీఆర్ పార్క్ దగ్గర మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేశాం.సంస్కరణల్లో భాగంగా మేం ఇలాంటి చర్యలను చేపడుతున్నాం అని చెప్పారు.

ఢిల్లీ లాంటి నగరంలా హైదరాబాద్ మారవద్దనే హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు బయటకు తరలిస్తున్నాం ఇండస్ట్రియల్ జోన్‌కు మల్టీ జోన్‌గా భూమిని బదలాయిస్తున్నాం అంతే తప్ప మేం యాజమాన్య హక్కులు ఎవరికీ అందించడం లేదని వివరించారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు మూసీ వెంట సిటీ మధ్యలో నుంచి ఎలివేటెడ్ కారిడార్ నిర్మించబోతున్నాం గండిపేట నుంచి గౌరెల్లి వరకు కేవలం 40 కిమీ ప్రయాణంతో చేరుకోవచ్చు మూసీ ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. 10 వేల స్క్వేర్ కిమీ పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నాం క్యూర్ పరిధిని సర్వీస్ సెక్టార్ గా, ప్యూర్ ను మన్యూఫ్యాక్చర్ హబ్ గా, రెర్ ను అగ్రికల్చర్ రంగంగా అభివృద్ధి చేయబోతున్నాం వివరించారు. ఒక దూర దృష్టితో ప్రణాళికలు రూపొందించాం పారదర్శకంగా పనులు జరిగేలా ప్రతీ విభాగానికి ఒక పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పుడు మనం దృష్టి సారించాల్సింది గుడ్ గవర్నెన్స్ పై కాదు.. స్మార్ట్ గవర్నెన్స్ పరిపాలన సౌలభ్యం, అధికారుల మధ్య సమన్వయం ఉండేలా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి పరిధిని ఒకే విధానం తీసుకొచ్చామన్నారు.

# పెన్షన్ బకాయిలు, పిఆర్‌సిపై బిఆర్ఎస్ వాకౌట్

**మొత్తం బకాయిలు రూ.40,150 కోట్లు.. ఉద్యోగుల బకాయిలు రూ.4,575 కోట్లు**

**తీర్చేందుకు నెలకు రూ. వెయ్యి కోట్లు విడుదలకు కసరత్తు**

**నగదురహిత ఆరోగ్యకార్డు ఉద్యోగుల చికిత్స కోసం : డి.సిఎం భట్టివిక్రమార్క**

**రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందక 38మంది ఉద్యోగులు మృతి: మాజీమంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభలో ఉద్యోగుల, రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై అధికార ప్రతిపక్షం మధ్యపరస్పర ఆరోపణలతో సభను వేడిక్కించడమేకాదు బిఆర్ఎస్ వాకౌట్ చేయడానికి దారి తీసింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు పిఆర్‌సి,డిఎ బకాయిలు రిటైర్డు మెంట్ బెనిఫిట్స్ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. పెన్షన్ బెనిఫిట్ అందక వైద్యసేవలు పొందలేక సుమారు 30 మంది ఉద్యోగులు మృతి చెందారని హరీష్‌రావు విమర్శించారు. డిప్యూటిముఖ్యమంత్రి భట్టివిక్రమార్క హరీష్‌రావు చేసే ఆరోపణలు సత్యదూరమని గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.4575 కోట్ల రూపాయలను బకాయి పెట్టడంతో ఈ సమస్య ఉత్పన్నమైందనీ ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారనీ భట్టి అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనీ సభకు వివరించారు.

గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందనీ అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచింది ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 61సంవత్సరాలకు పెంచింది ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందనీ అన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40,150 కోట్లు బకాయిలు పెట్టారనీ దీనిపై సభలో శ్వేత పత్రం విడుదల చేసామనీ చెప్పారు.

ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయనీ వివరించారు. మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల రూ. 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామనీ అన్నారు. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలారూ. 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ సభ్యులకు మానవీయ కోణం ఉండటంతోనే ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్స కార్డులను అందుబాటులోకి తీసుకురాబోతున్నామనీ తెలిపారు. మీ ప్రభుత్వ కాలంలో పది సంవత్సరాలపాటు హెల్త్ కార్డుల కోసం ఉద్యోగ సంఘాలు అడిగి అలసిపోయాయి ప్రమాదవశాత్తు ప్రభుత్వ ఉద్యోగి చనిపోతే ఆ కుటుంబానికి 1.20కోట్ల ప్రమాద బీమాని అమలు చేయబోతున్నామనీ చెప్పారు.

మా ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి దాదాపు 6,146 కోట్లు క్లియర్ చేశాం పిఆర్సి నివేదిక రాగానే పరిశీలించి కొత్త పిఆర్సి అమలుపై నిర్ణయం తీసుకుంటాం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయి వాటిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటాం టిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో ఉద్యోగులపై ఆంక్షలు ఉండేవి. మా ప్రభుత్వం ఉద్యోగ సంఘాల తో నిత్యం సంప్రదింపులు చేస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నామనీ అన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి మెలిసి పనిచేస్తున్నారు ఉద్యోగ సంఘాల నేతలు ఏ సమయంలోనైనా ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని మంత్రులను కలిసేందుకు పూర్తి స్వేచ్ఛ కల్పించాం బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు. వ్యవస్థలు పనిచేయకుండా చేశారు ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా చేశారనీ దుయ్యబట్టారు.

# అంగన్‌వాడీలకు త్వరలో కొత్త ఫోన్లు

**రూ.44.42 కోట్లతో**

**38,130 ఫోన్ల ఆర్డర్**

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** అంగన్వాడీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగం అంగన్వాడీలకు కొత్త ఫోన్లను కొనుగోలు చేసింది. వారం, పదిరోజుల్లో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఈ ఫోన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అధునాతన ఫీచర్లు ఉన్న శామ్‌సంగ్ గెలాక్సీ ఎం6 మోడల్ ఫోన్లను అందిస్తున్నారు. 4జీబీ ర్యామ్, 64 జీబీ మెమోరీతో ఇవి పనిచేస్తాయి. ఇప్పటికే తెలంగాణ టెక్నాలజీస్ సర్వీసెస్ (టీజీటీఎస్) ద్వారా ఒక్కో ఫోన్ రూ.11,650తో మొత్తం రూ.44.42 కోట్లతో 38,130 ఫోన్లను ఆర్డర్ చేశారు. అవి త్వరలోనే రానున్నాయి. వాటిని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు, వారి పరిధిలోని అంగన్వాడీ టీచర్లుకు ఈ ఫోన్లు పంపిణీ చేయనున్నారు. కాగా గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా వివరాలను అప్డేట్ చేసేందుకు 2019లో మొబైల్ ఫోన్లు ఇచ్చింది. పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా దాదాపు 14 రకాల వివరాలను అప్డేట్ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం అంగన్వాడీల వద్ద ఉన్న ఆ ఫోన్లు పాతబడిపోయాయి. కాలం చెల్లిన ఫోన్లతోనే టీచర్లు కుస్తీపడుతున్నారు. దీనికి తగినట్లుగా ఐదేళ్ల క్రితం ఇచ్చిన 2జీ ఫోన్లు కావడం, సాఫ్ట్‌వేర్ అప్డేట్ కాకపోవడంతో నెట్‌వర్క్ సమస్యలు కూడా వేధిస్తున్నాయి. దీంతో అంగన్వాడీ సిబ్బంది చేసే రోజువారి పనులు నెమ్మదించాయి. పలు సందర్భాల్లో వివరాలను సైతం అప్డేట్ చేయలేకపోతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గాను కొత్త ఫోన్లను ఇవ్వనుంది. ఈ న్యూ మొబైల్ ఫోన్లు వస్తే ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదించాల్సిన సమాచారాన్ని వేగంగా అప్డేట్ చేయొచ్చునని అంగన్వాడీ అధికారులు పేర్కొంటున్నారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

**భారీ ఏర్పాట్లు చేసిన పోలీసు శాఖ**

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** ఈ నెల 28వ తేదీన రాష్ట్రంలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేబట్టిందని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం నాడు డిజిపి కార్యాలయంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైకోర్టు జస్టిస్ శ్యాం కోషితో పాటు శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ సహా ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. లోక్ అదాలత్ ఏర్పాట్లపై డిజిపి వివరిస్తూ వాస్తవానికి ఈ లోక్ అదాలత్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యిందని తెలిపారు. చివరగా ఈ నెల 28వ తేదీన జరగనుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను ముందుగానే గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రాసిక్యూషన్ విభాగం అ ధికారులు తమవంతు పాత్ర పోషిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు సిఐడి బాస్ చారు సిన్హా, ఫ్యూచర్ సిటీ కొత్వాల్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన రైతుల పాలిట భస్మాసుర హస్తం



**రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని గొప్పలు**

**రాజీవ్‌యువ వికాసం పేరును రేవంత్ ఆత్మీయ మోసంగా మార్చండి**

**రెండేళ్లలోనే 4.17 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్ సర్కారు**

**బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా సభలో బిఆర్ఎస్ పక్ష ఉపనేత హరీశ్‌రావు**

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** రైతులను అప్పుల ఊబినుంచి బయటపడేస్తామన్న కాంగ్రెస్ అభయహస్తం.. వారిపట్ల భస్మాసుర హస్తంగా మారిందని బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజి మంత్రి హరీష్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మాయమాటలతో మభ్యపెడుతోందని మండిపడ్డారు. హామీ ఇచ్చిన మేరకు రైతు భరోసాను రూ.15వేలకు ఎప్పుడు పెంచుతారో చెప్పాలని నిలదీశారు. ఈ మేరకు శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గొట్టిందని దుయ్యబట్టారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు రైతు భరోసాను ఎన్నికల భరోసాగా మార్చి.. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే పంట పెట్టుబడి సాయం, బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క మాటలకు అర్థాలే వేరులే అన్నట్టు పరిస్థితి ఉందని, అందుకు వ్యవసాయం ఆగడం లేదు కాని ఆ రంగానికి ఇచ్చే సాయం మాత్రం ఆగుతోందని వ్యాఖ్యానించారు. రుణమాఫి విషయంలో రాష్ట్రంలోని ఏ నియోజకవర్గానికైనా సిఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌కైనా వెళ్లి చర్చిద్దామని సవాల్ విసిరారు. పంటల బీమా అమలు చేయనందుకు రైతులకు శాసనసభ సాక్షిగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడ్డారు. నో ప్యూరిటి, నో క్లారిటి, నో స్యూరిటి ప్రభుత్వంగా రేవంత్ సర్కారు నిలిచిందని ఎద్దేవా చేశారు. రాజీవ్ యువ వికాసం అంటూ గత బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు పెట్టారని, కానీ ఒక్కరికీ ఇవ్వలేదని దుయ్యబట్టారు. నాడు నిరుద్యోగుల ఓట్ల కోసం అశోక్‌నగర్ లైబ్రరి చుట్టూ తిరిగారని, అధికారంలోకి వచ్చాక చదువుల తల్లి నివసించే సిటీ సెంట్రల్ లైబ్రరిలో నిరుద్యోగులపై లాఠీచార్జి చేసి నెత్తురు చిందించారని మండిపడ్డారు. చివరకు నిరుద్యోగులకు డిప్రెషన్, సప్రెషన్ దక్కిందని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. అమలు చేయలేని పథకాలకు రాజీవ్, ఇందిరాగాంధీ పేర్లు పెట్టి అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. రాజీవ్ యువ వికాసానికి రేవంత్ ఆత్మీయ మోసం అనో లేక భట్టి యువ భ్రమలు అనో పేరు పెట్టుకోవాలని ప్రభుత్వానికి హరీష్‌రావు హితవు చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో వడ్డీ లేని రుణాల అంశాన్నే ఎత్తివేశారని, అందుకు మహిళలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పానలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదని, ఒక్క ఎకరాకు కూడా కొత్తగా సాగునీరు ఇచ్చింది లేదని దుయ్యబట్టారు. బడ్జెట్ పుస్తకాల్లోనే సాగునీళ్లు దుంకుతున్నాయని, కొత్త ఆయకట్టు పెరుగుతోందని ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ పూర్తిగా అవాస్తవిక, ముందుచూపు లేనిబడ్జెట్ అని హరిష్‌రావు ఎండగట్టారు. బడ్జెట్‌లో ఆర్ఇ మొత్తం రూ.266,608కోట్లు అయితే వాస్తవంగా ఖర్చు చేసింది రూ.2, 31, 583 కోట్లు అని ఈ నేపథ్యంలో బడ్జెట్ ఎస్టిమేట్, యాక్చువల్‌కు మధ్య గ్యాప్ రూ.59, 231కోట్లు అని వివరించారు. రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు యాక్చువల్స్‌కు మధ్య గ్యాప్ రూ.35, 025కోట్లు అని ఇలా 20శాతం డెఫిసిట్ ఉంటే వాస్తవిక బడ్జెట్ ఎలా అవుతుందని నిలదీశారు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ సుమారు రూ.45వేల కోట్ల నుండి రూ.50వేల కోట్లుగా లోటు ఉండబోతోందన్నారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం సైతం పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రైజింగ్ అంటున్నారని, బిఆర్ఎస్ పాలనలో 12శాతం వృద్ధి రేటు ఉంటే.. 2025-26లో 10.7శాతానికి పడిపోయిందని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇక 2014-15లో రెవెన్యూ సర్‌ప్లస్ రూ.368కోట్లుగా ఉంటే 2023-24లో రూ.779కోట్లకు పెరిగిందని, కానీ ఈ బడ్జెట్‌లో రూ.9420కోట్ల మైనస్ అని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని సభలో హరీష్‌రావు గుర్తు చేశారు. ఈ గణాంకాల నేపథ్యంలో రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పాలన దివాళి తియించిందా లేక కాంగ్రెస్ ప్రభుత్వమా..? అని ప్రశ్నించారు. కరోనా కంటే కాంగ్రెస్ పార్టీనే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా బిఆర్ఎస్ పాలనలో రూ.14, 296 కోట్ల ఆదాయం చేకూరితే.. కాంగ్రెస్ పానలో ఏకంగా మైనస్ 42శాతానికి పడి పోయి కేవలం రూ.8473 కోట్లు మాత్రమే వచ్చిందని దుయ్యబట్టారు. రవాణాశాఖ ఆదాయం కూడా గణనీయంగా పడిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో మొత్తం 3.70లక్షల కోట్ల అప్పులు చేస్తే.. కెసిఆర్ పదేళ్ల పాలనలో రూ.4.17లక్షల అప్పులు మాత్రమే అయ్యాయని గుర్తు చేశారు.

పౌర సరఫరాల శాఖలో అంతా అయోమయం నెలకొందని, కుంభకోణాలకు నిలయంగా మారిందని విమర్శించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పౌరసరఫరాలశాఖకు రూ.56వేల కోట్ల అప్పు అయితే.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.47వేల కోట్ల అప్పులు చేశారని దుయ్యబట్టారు. బ్యాంకులు కూడా లోన్లు ఇవ్వని పరిస్థితిలో మార్క్‌ఫెడ్ గ్యారంటితో తాజాగా రూ.22, 700కోట్ల అప్పు తెచ్చారని దుయ్యబట్టారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణంలో భారీ కుంభకోణం జరుగుతోందని, మొత్తం 76 స్కూళ్లకు టెండర్లు ఫైనల్ అయితే అన్ని 4.96శాతం ఎక్సెస్‌కు కోట్ అయ్యాయని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మాత్రం ఇచ్చారని దుయ్యబట్టారు. ఎస్‌డిఎఫ్ నిధుల విషయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఇవ్వడం లేదని, బిఆర్ఎస్ పాలనలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలందరినీ సమానంగా చూసిందని ప్రభుత్వానికి గుర్తు చేశారు. దళితులు, బిసిలు, ఎస్టిల, మైనారిటీ సంక్షేమ నిధుల్లో ప్రభుత్వం భారీగా కోత పెడుతోందని, అసైన్డ్ భూములకు ఎస్సిలకు పట్టాలిస్తామని చెప్పి రెండేళ్లలో 50వేల ఎకరాల అసైన్డ్ భూములను ఫ్యూచర్ సిటి, పారిశ్రామిక వాడల పేరుతో దళితుల నుండి లాక్కున్నారని దుయ్యబట్టారు. కెసిఆర్ హయాంలో 6లక్షల 18వేల మందికి ఉచితంగా సాదామైనామాలు చేసి పాసు పుస్తకాలు ఇచ్చామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 172మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సి జెర్సి ధరించి సిఎం రేవంత్‌రెడ్డితో మ్యాచ్ ఆడినట్లు సోషియో ఎకనమిక్ సర్వేలో ప్రభుత్వం మార్ఫింగ్ ఫొటోను ప్రచురించిందని హరీష్‌రావు దుయ్యబట్టారు. ఎఐ యుగాన్ని తెస్తానంటున్న సిఎం మార్ఫింగ్ యుగాన్ని తెచ్చారని ఎద్దేవా చేశారు.

# చిత్తూరు రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి పంజా

**తప్పించుకున్న రిజిస్ట్రార్**

**చిత్తూరు, మార్చి 23, ప్రభాతవార్త:** చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై సోమవారం ఎసిబి అధికారులు పంజా విసిరారు. చిత్తూరు గిరింపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై ఎసిబికి అవినీతిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్ళడంతో అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ఎసిబి అధికారులు ప్రవేశించారనే సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్ కార్యాలయం నుండి ఎసిబి అధికారుల కన్నుగప్పి తప్పించుకున్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్ రమణరావుతో పాటు ఇసి సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మేనక, కంప్యూటర్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న గాంధీ, మేరేజ్ సర్టిఫికేట్లు జారీ చేసే రాంప్రసాద్‌లు ఎసిబి అధికారులకు చిక్కారు. ఎసిబి ఎఎస్పీ విమల ఆధ్వర్యంలో ఎసిబి డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి చేయడంతో ఇక్కడ పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ఎసిబి అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

ఎసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించిన వెంటనే కార్యాలయ తలుపులు మూసి వేసి కార్యాలయం నుండి ఎవ్వరు బయటికి వెళ్లకుండా కట్టడి చేశారు. అప్పటికే కార్యాలయంలో విధులు నిర్వర్తించే కొంతమంది జారుకున్నట్లు సమాచారం. అయితే ఎసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించినపుడు పలువురు స్టాంప్ వెండర్లతో పాటు డాక్యుమెంట్ రైటర్లు వుండటంతో వారిని సైతం ఎసిబి అధికారులు బయటికి వెళ్ళకుండా అక్కడే వుండాలని స్పష్టం చేశారు. చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం-1లో పెద్ద ఎత్తున అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వున్నాయి. గతంలో సైతం ఈ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి సబ్ రిజిస్ట్రార్ వద్ద నుండి పెద్ద ఎత్తున అనధికారిక నగదు స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ ఈ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తమ పనితీరు మార్చుకోలేదు. ఈ పరిస్థితుల్లో మళ్ళీ ఎసిబి అధికారులకు చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిపై ఫిర్యాదులు అందడంతో ఎసిసి అదికారులు, సిబ్బంది సోమవారం పెద్ద ఎత్తున ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేసి రికార్డులు స్వాధీనం చేసుకుని విస్తృతంగా విచారిస్తున్నారు.



చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1

## ప్రైవేట్ మెంబర్ బిల్లు నోటీసును స్పీకర్‌కు అందజేసిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 23:** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్, శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

# ఆసుపత్రిలో మంటలు - పరుగులు తీసిన పేషెంట్లు

**మెహిదీపట్నం, మార్చి 23, ప్రభాతవార్త :** ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం...విజయ్‌నగర్ కాలనీలో శృతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం సాయంత్రం మూడవ అంతస్తులో ఒక్కసారిగా ఎయిర్ కండిషనింగ్ (ఏసి) షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మంటలు వేగంగా వ్యాపించడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనతో రోగులతో పాటు రోగుల బంధువులు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది అగ్నిమాపక శాఖతోపాటు పోలీసులకు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మూడు ఫైర్ ఇంజన్ లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. స్థానికంగా విజయనగర్ కాలనీలో ఈ ఘటనతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా ఎలాంటి ప్రాణ నష్టం

జరగకపోగా ఆసుపత్రిలోని మూడవ అంతస్తులో ఉన్న ఏసీ లో షాక్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం

## - కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే గ్యాస్, ఆయిల్ ధరల పెంపు

## - తిరుమలకు అపకీర్తి తెచ్చే వారిని పదవిలో ఉంచుతారా? - సిపిఐ జాతీయ నాయకుడు కె. నారాయణ

**విజయవాడ, మార్చి23,ప్రభాత వార్తప్రతి నిధి:** ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా మానవాళిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె. నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కారణంగా భయానకమైన మరణాలు సంభవిస్తున్నప్పటికీ, దాన్ని నివారించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు.ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలచేసారు.. యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించడానికి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి డోనాల్డ్ ట్రంప్ చేపడుతున్న చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు



ధరల పెరుగుదల రవాణా రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలు ఉన్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, ఈ పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై మౌనం పాటించడం సమంజసం కాదని విమర్శించారు. ముందుగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని ట్రంప్‌పై మోదీ ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేవగల నాయకుడు సీఎం నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న చంద్రబాబు, ట్రంప్‌కు మోదీ మద్దతు పలకకుండా యుద్ధాన్ని ఆపాలంటూ ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా చంద్రబాబు ముందుకు రావాలని ఆయన సూచించారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లో"నో వార్" (యుద్ధం వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల సీఎం చంద్రబాబు తిరుమల తిరుపతి దేవస్థానం దర్శించుకున్నారని గుర్తుచేశారు. ఆ పవిత్ర క్షేత్రానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఛైర్మన్ పదవిలో కొనసాగించడం తగదని అభిప్రాయపడ్డారు.

# ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

## : తెలంగాణ ఎరుకల ప్రజా సమితి

**సైఫాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎరుకల జాతికి ఏకలవ్య కార్పోరేషన్ ఏర్పాటు చేసి, 500 కోట్లు నిధులు కేటాయించాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి డిమాండ్ చేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ప్రభుత్వం అమలు చేయకుండా చిన్న చూపు చూస్తున్నదని సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 6 లక్షల మందికిపైగా ఎరుకల కులస్తులు ఉన్నారని, వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ఏలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పందుల పెంపకానికి ఎరుకల జాతి ఊరు చివర ఏర్పాటు చేసుకున్న షెడ్లును అగ్రవర్ణాల వారు దాడులు చేస్తున్నారని, ఈ దాడులను వెంటనే ఆపాలని, పందుల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 5 ఎకరాల భూమిని పంపిణి చేయాలి, ఇళ్ళు లేని పేదలకు 100 గజాల చొప్పున స్థలాలు కేటాయించాలని, బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి పది లక్షల రూపాయలు రుణాలు ఇవ్వాలని, ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు తిరుపతి, సంపత్, పుష్ప, శేఖర్, కుమారస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# పశుఉత్పత్తి ,పోషణలో నైపుణ్యాభివృద్ధికి ఎక్స్టెన్షన్ మాడ్యూల్స్

**అత్తాపూర్ మార్చి 23, ప్రభాత వార్త :** పి.వి. నర సింహా రావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం మరియు జాతీయ భవిష్య నిధి(ఎన్ఎఎస్ఎఫ్)తో కలిసి నిర్వహించిన ప్రతిష్టాత్మక పరిశోధన పథకంలో భాగంగా పశు ఉత్పత్తి మరియు పోషణలో భాగమైన అందరి నైపుణ్యాభివృద్ధి గురించి వివిధ రకాల ఈ ఎక్స్టెన్షన్ మాడ్యూల్స్ ను రూపొందించడానికి ఈ పరిశోధన పథకం కర్ణాటక పశు వైద్య విశ్వవిద్యాలయం మరియు మహారాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయలతో కలిసి రూపొందిస్తున్నారు. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రొ.డా. సి హెచ్. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడానికి అర్హతను పొందడం చాలా ప్రతిష్టాత్మకమైనది. ఈ పరిశోధనా పథకం మూడు సంవత్సరాల ముగింపు దశలో అనగా సోమవారం మాన్యువల్ ఆన్ స్కిల్ డెవలప్మెంట్ ఇన్ లైవ్ స్టాక్‌ను పివిఎన్ఆర్‌టివియూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం. జ్ఞాన ప్రకాష్ 17వ అకాడమిక్ కౌన్సిల్లో విడుదల చేశారు. ఈ మాన్యువల్ పశుపోషణలో ఉన్నటువంటి పశు వైద్యాధికారుల, పశు విస్తరణ అధికారులు మరియు అభ్యుదయ పాడి రైతులకి కావలసిన అనేకమైన నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అంశాలను కూలంకషంగా వివరించారు.అదే విధంగా విలువ ఆధారిత పాల పదార్థాల తయారీ మీద తయారు చేసినటువంటి వీడియోస్ ని విడుదల చేశారు. ఈ వీడియోస్ ని వీక్షించిన వారు సులభంగా తమ వద్ద ఉన్న పాలను విలువ ఆధారిత పాలపదార్థాలుగా సులువుగా తయారు చేసుకోగలరని తెలిపారు. దీని ద్వారా పందుల పెంపకం చేపట్టే రైతులు, ఔత్సాహికులు ఏ విధంగా శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం చేపట్టాలని సులువుగా అవగతం అవుతుంది. ఈ విధంగా రూపొందించినటువంటి ఈ ఎక్స్టెన్షన్ మాడ్యూల్స్ ని ఉపకులపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ ఏ. శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఎం. ఉదయ్ కుమార్ , పరిశోధనా సంచాలకులు ప్రొఫెసర్ సిహెచ్. హరికృష్ణ , విస్తరణ సంచాలకులు ఎం. కిషన్ కుమార్ మరియు సిఓఈ ప్రొఫెసర్ జయలక్ష్మి , డిఎస్ఎ డాక్టర్ కె. సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపి తరహాలో 'బిసి రక్షణ చట్టం' తీసుకురావాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో 'బీసీ రక్షణ చట్టం' ఏర్పాటు చేయాలనీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ ఛాంబర్‌లో బిసి సంఘాల ప్రతినిధులతో కలిసి కృష్ణయ్య సిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.సిఎంను కలిసినవారిలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ళ సతీష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పర్లగోర్ల మోడీరాందేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎం దృష్టికి బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం ఆవశ్యకతను కృష్ణయ్య వివరించారు.'ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల రక్షణ చట్టం తయారు చేసింది. అసెంబ్లీ పాస్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇది బీసీల చిరకాలకాంక్ష.చాలా ఏళ్లుగా బీసీలు తమకు ఎస్సీ,ఎస్టీ మాదిరిగా బిసి రక్షణ చట్టం కావాలని కోరుతున్నారు. బీసీ కులాలలో చాలా కులాలు ఇప్పటికే అత్యంత వెనుకబడిన కులాలు, సంచారజాతులు, భిక్షాటన చేసే కులాలు ఉన్నవి. వీరిని సమాజంలో తక్కువ చూపు చూస్తున్నారు. హీనంగా చూస్తున్నారు. కులాల పేరు మీద హీనంగా పిలుస్తున్నారు.అందుకే సమాజంలో గౌరవం పెంచడానికి,దాడులకు దౌర్జన్యాలకు రక్షణ కల్పించడానికి ఈ చట్టం తేవడంతో బిసిలలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఈ కులాలపై దాడులు,దౌర్జన్యాలు, అకృత్యాలు, అత్యాచారాలు తగ్గుతాయి. బోగస్ కేసులు తగ్గుతాయి.తెలంగాణలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, వారిపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు పెరిగిపోతున్నాయి. ఎస్సీ,ఎస్టీలకు ఉన్నట్లుగా బీసీలకు ప్రత్యేక చట్టం లేకపోవడం వల్ల వారు రక్షణ లేకుండా మిగిలిపోతున్నారు.




బిసి రక్షణ చట్టం కోసం సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో బిసి సంఘాల ప్రతినిధులు

# భద్రతపై ప్రత్యేక దృష్టి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సమీక్షా సమావేశం

**తార్నాక, మార్చి 23 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో భద్రతా అంశాలపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించారు. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రైలు కార్యకలాపాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడంపై అధికారులు విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ రైల్వే కార్యకలాపాల్లో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి దశలవారీ విధానాన్ని అనుసరించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు.ప్రత్యేకంగా పాయింట్లు, క్రాసింగులు, అలారమ్ వ్యవస్థలు వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలని, భద్రతా డ్రైవులు, తనిఖీలు తరచుగా నిర్వహించాలని తెలిపారు. ట్రాక్‌లపై పనులు జరుగుతున్న సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.రైల్వే ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భద్రతా పరికరాల నిర్వహణను సమర్థంగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. అలాగే నాన్‌ఇంటర్‌లాక్ లెవల్ క్రాసింగ్ గేట్ల పరిస్థితిని కూడా సమీక్షించారు.

# న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో ఫైర్‌ట్రక్కును ఢీకొన్న విమానం!

**న్యూయార్కు, మార్చి 23:** న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయంలో ఓ పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. టేకాఫ్ కోసం సిద్ధమవుతున్న విమానం ఒకటి అదుపుతప్పి, రన్‌వే పక్కన నిలిపి ఉంచిన ఎయిర్‌పోర్ట్ ఫైర్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది. అయితే అదృష్టవశాత్తు ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 71 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. విమానం ఫైర్ ట్రక్కును ఢీకొనగానే, సిబ్బంది వెంటనే అప్రమత్తమై అత్యవసర ద్వారాల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఫైర్ ట్రక్కులో ఇద్దరు అగ్నిమాపక సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద తీవ్రతకు విమానం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. రెక్క కూడా దెబ్బతింది. ప్రమాద స్థలం నుంచి దట్టమైన పొగలు రావడం, ప్రయాణికులు భయంతో పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రమాదం కారణంగా అధికారులు ఒక రన్‌వేతో పాటు సమీపంలోని ర్యాంప్‌ను తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ), నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్ టీఎస్ బీ) అధికారులు దర్యాప్తు చేపట్టారు.





# హత్యకు దారితీసిన అక్రమ సంబంధం

**లక్నో, మార్చి 23:** ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. కొన్ని రోజులుగా అదృశ్యమైన సుమేర్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ ముస్తకా గుల్షన్ అలియాస్ మున్నా (55) హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో పోలీసులు ఒక మహిళ సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధం, బ్లాక్‌మెయిలే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే ఇద్దరు భార్యలు, 18 మంది పిల్లలు ఉన్న మున్నాకు, అదే గ్రామంలో ఉంటున్న సుమన్ దేవి అనే వివాహితతో పరిచయం ఏర్పడింది. ఆమె భర్త పని కోసం ఊరు విడిచి వెళ్లడంతో ఆమెకు సహాయం చేసే నెపంతో మున్నా దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆమెను బలవంతంగా లోబరుచుకుని సంబంధం కొనసాగించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత తనను కలవాలంటూ బ్లాక్‌మెయిల్ చేసి, తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ వేధింపులు భరించలేకపోయిన సుమన్, తన సోదరుడికి విషయం చెప్పి మున్నాను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. పథకం ప్రకారం ఈ నెల 18న సుమన్ మున్నాను తన పుట్టింటికి ఆహ్వానించింది. అతను రాగానే, అక్కడ మాటువేసిన ఆమె సోదరుడు, అతని స్నేహితులు ఇనుప రాడ్లతో మున్నాపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి సమీపంలోని కాలువలో పడేశారు. మున్నా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ముందుగా మున్నా మోటార్‌సైకిల్‌ను గుర్తించారు. అతని ఫోన్ కాల్ రికార్డుల ఆధారంగా సుమన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. ఆమె ఇచ్చిన సమాచారంతో ఆదివారం నాడు కాలువలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సుమన్, ఆమె సోదరుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, హత్యలో పాలుపంచుకున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. రానున్న గ్రామ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మున్నా సిద్ధమవుతున్నట్లు స్థానికులు తెలిపారు. అంతలోనే ఈ హత్య జరిగిందని చెబుతున్నారు.

# 24 గంటల్లో వడ్డెరల డిమాండ్లు అమలు చేయపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం

**సైఫాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:** ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందర్భంగా వడ్డెరుల కులస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. అలాగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వడ్డెర కార్పోరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్లు నిధులు కేటాయించాలని సంఘం నాయకులు కోరారు. 24 గంటల్లోగా ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే వేలాది మంది వడ్డెరులతో చలో అసెంబ్లీ పేరిట అసెంబ్లీని ముట్టడిస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. సోమ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం



రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాత్రి ఐలుమల్లు, వరికు ప్పల వెంకటేష్, కుంచపు దేవరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నప్పటికి సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు వడ్డెరుల గురించి పట్టించుకోకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే గాలికి వదిలేశారన్నారు.

# హరీష్‌రావు వర్సెస్ మంత్రులు

## పదేళ్లు అధికారంలో ఉన్నపుడు ఏం చేశారు?: మంత్రి సీతక్క ఫైర్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి సీతక్క గట్టి కౌంటర్ ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు, అప్పుడు ఏం చేశారు? ఏం ఇచ్చారు? అని హరిష్‌రావును ప్రశ్నించారు. పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? అని నిలదీశారు. నోటిఫికేషన్ ఇస్తే ఉద్యోగాలు ఇచ్చినట్లేనా? అని ప్రశ్నించారు. పాండవులు సంపాదించింది అంత కౌరవుల తద్దినానికే సరిపోయింది అన్నట్లుగా... గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు, బిల్లుల బకాయిలు చెల్లించేందుకు సరిపోతోందని అన్నారు. ఇచ్చిన హామీలను ఆర్థిక వెసులుబాటుకు అనుగుణంగా ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని సీతక్క చెప్పారు. తన నియోజకవర్గంలో 50 శాతం రైతు రుణమాఫీ కాలేదని హరిష్‌రావు అంటున్నారని, మరి రుణమాఫి బిఆర్ఎస్ పాలనలో ఎందుకు చేయలేదు, అపుడు చేసి ఉంటే ఇపుడు ఇబ్బంది ఉండకపోయేది కదా? అని ప్రశ్నించారు. పదేళ్లలో ఏం చేశారో లెక్కలతో సహా చెప్పండి అని బిఆర్ఎస్‌పై ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాల్లో మన్ను పోసి.. బిఆర్ఎస్సే గొప్ప అని చెప్పుకోవడం సరికాదన్నారు. సీటు మారినంత మాత్రాన చరిత్ర మారుతుందా? పదేళ్లు అంటే చాలా సమయం, అప్పుడు రుణమాఫీ ఎందుకు చేయలేదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతి కుటుంబానికి ఐదు లక్షల జీవిత బీమా పెడితే బిఆర్ఎస్ ఓర్వ లేకపోతోందని, మట్టి, దుమ్ము పోసుడు రాజకీయం కాదని, ముందు మీరు చేసింది చెప్పి.. మేము ఏం చేయాలో చెప్పాలని అని సీతక్క తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.

### భట్టి విక్రమార్క

రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం తగ్గిందని మాజీ మంత్రి హరీశ్‌రావు సభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.14,250 కోట్ల ఆదాయం సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వాటాగా రావాల్సిన రూ.5,740 కోట్లను ప్రభుత్వం సర్దుబాటు చేసిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి ఆ శాఖ ద్వారా వచ్చిన ఆదాయాన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ చేయకుండా కాలయాపన చేసిందని, ఆ నిధులను మొత్తంగా స్టాంప్ డ్యూటీ ఆదాయంగానే చూపించి తప్పుడు లెక్కలు చెప్పిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పు పునరావృతం కావద్దని, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయొద్దన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ఆదాయం నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులను కేటాయించిందన్నారు. అదేవిధంగా.. రెండున్నరగంటలపాటు ఖాళీగా కూర్చొబెట్టారని బిఆర్ఎస్ సభ్యులు పదే పదే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సోమవారం విరామం తర్వాత ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో మరణించిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సిఎం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించారని సభలో తెలిపారు.

### మంత్రి జూపల్లి

బడ్జెట్‌పై సాధారణ చర్చసందర్భంగా బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత హరిష్‌రావు, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య మాటల యుద్ధం నడిచింది. తన ప్రసంగంలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ.46,941 కోట్లు ఎక్సైజ్ మీద ఆదాయం వస్తుందని, గత సంవత్సరం కంటే దాదాపు 12 వేల కోట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని అంటున్నారని హరిష్‌రావు అన్నారు. అంత ఆదాయం రావాలంటే 25వేల కోట్లు మద్యం అమ్మాలి కదా.. అందుకు గల్లీకొక బెల్టు షాపు పెడతారా?, గ్రామానికో బార్ పెడతారా... అని ప్రశ్నించారు. దీంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.2 వేల కోట్లు తగ్గిందని చెప్పారు. అసలు రాష్ట్రంలో మద్యాన్ని ప్రోత్సాహించింది ఎవరు? తెలంగాణ ప్రజలను తాగుబోతులను చేసింది ఎవరో.. ఈ లెక్కలను చూస్తే తెలిసిపోతుందని మంత్రి జూపల్లి కౌంటర్ ఇచ్చారు. 60 ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.65 వేల కోట్లకు మించి పోలేదని.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 8 లక్షల కోట్లకు చేరిందని ఆయన స్పష్టం చేశారు. కాగా.. తన ప్రసంగం మధ్యలో జూపల్లి కలుగజేసుకోవడంపై అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కసమాధానం చెప్పాలని, తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్‌శాఖకు సంబంధించిన సబ్జెక్టుపై కాదని స్పష్టం చేశారు.

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్

బిఆర్ఎస్ హయాంలో దళితుల ప్రాణమైన నెడ్‌క్యాప్ భూములను లాక్కున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హరిష్‌రావుపై మండిపడ్డారు. సిద్ధిపేటలో నెడ్ క్యాప్ భూములను లాక్కుని పోలిస్ కమిషనరేట్ నిర్మించారని మండిపడ్డారు.

# సిరిసిల్ల జిల్లా కోర్టుకు బాంబు బెదరింపు

## ఆగంతకుడి ఈమెయిల్‌తో హైడ్రామా!.. రంగంలోకి డాగ్ స్క్వాడ్.. బాంబు ఉత్తుత్తిదే.. ఊపిరి పీల్చుకున్న పోలీసులు

**సిరిసిల్ల బ్యూరో, మార్చి 23, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయానికి బాంబు బెదిరింపు రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు కోర్టు అధికారిక ఈమెయిల్ కు సందేశం పంపుతూ, భవనంలో బాంబు అమర్చామని, అది ఏ క్షణమైనా పేలిపోతుందని హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన కోర్టు సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు భారీ సంఖ్యలో కోర్టుకు చేరుకున్నారు. ముందస్తు జాగ్రత్తగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది మరియు కక్షి దారులను భవనం బయటకు పంపించారు. కోర్టు ప్రాంగణం అంతా పోలీసుల ఆధీనంలోకి వెళ్లడంతో అక్కడ ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. పట్టణంలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన కోర్ట్ ల లో డాగ్ స్క్వాడ్ మరియు బాంబు డిస్పోజల్ టీమ్ రంగంలోకి దిగి అంగుళం అంగుళం క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. కోర్టు గదులు, రికార్డు రూమ్‌లు మరియు వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో దాదాపు రెండున్నర గంటల పాటు ముమ్మరంగా గాలింపు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చివరకు ఆ బాంబు బెదిరింపు కేవలం ఉత్తుత్తిదే అని పోలీసులు నిర్ధారించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ఎవరో ఆకతాయిలు ఈ పని చేసి ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈమెయిల్ ఎక్కడి నుండి వచ్చింది? పంపిన వ్యక్తి ఎవరు? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తప్పుడు సమాచారంతో ప్రజలను భయాందోళనకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.



పరీక్షల్లో పాఠాలన్నీ గుర్తు ఉండాలంటే ఏకాగ్రతతో పాటు, మెదడూ మరుగ్గా ఉండాలి. దీనికి అనుషా బ్రెయిన్ పర్కపచ్చితో మంచి ఫలితం ఉంటుందంటున్నారు

# పరీక్షల్లో ఏకాగ్రత కోసం..

నిపుణులు. శారీరక దారుడ్యం కోసమే కాదు. మెదడు చురుకుగా ఉండాలన్న దానికీ వ్యాయామం కావాలి, మనసును నిత్యం తాజాగా ఉంచుకోగలిగితేనే అది ఏకాగ్రతగా పనిచేయగలదు. జ్ఞాపకశక్తి, సృజనాత్మకత మెరుగ్గా ఉంటాయి. గంటల తరబడి చదువుతూనే ఉండకుండా విరామం మధ్యలో తీసుకోవాలి. ఆ సమయంలో చిన్న పజిల్ తీసుకోవాలి. సరదాగా సుడోకు, క్రాస్వర్డ్ పరిష్కరించేలా పిల్లలను ఉత్సాహపరచాలి. దీనితో పరిష్కార నైపుణ్యాలు పెరగడమే కాదు, ఏ జాగ్రతను పెంచుతాయి.

మెదడుకూ వ్యాయామం.ఓ అయిదు నిమిషాలు తీసుకునే విరామంలో ఈ గేమ్‌ను ఆడించొచ్చు. మొదట ఒక పండు లేదా పువ్వు పేరు చెప్పమనాలి. దానికి మరొకదాన్ని జత చేయాలి. ఇలా పది పండ్లు లేదా పలవరకు పేర్లు చెప్పమని వాట స్థిర వరసగా గుర్తు ఉంచుకోమనాలి, తిరిగి వాటిని చెప్పమనాలి.ఈ మెమొరీ చెయిన్ గేమ్‌లో నెగ్గినవారికి బహుమతి ఇవ్వాలి. **ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. కథలతో...** .ఒక కాగితంపై పిల్లలకు నచ్చిన నాలుగైదు బొమ్మలు గీయమనాలి. వాటిని కలిపి చిన్న కథ చెప్పడానికి ప్రయత్నించమని ప్రోత్సహించాలి. పిల్లలకు ఇది సరదాగానూ ఉంటుంది. చదువు మధ్యలో విరామంటానూ పనిచేస్తుంది. ఈ గేమ్‌లో సృజనాత్మకత పెరుగుతుంది. దీనితోపాటు ఉదయం నిద్ర లేచిన వెంటనే పది నిమిషాల పాటు ధ్యానం చేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. □

# సౌందర్య పరిరక్షణలో వెదురు !

**సాధారణంగా వెదురును నిర్మాణ వస్తువుగా పరిగణిస్తాం.. అయితే ఇది చక్కటి సౌందర్య సాధనంగానూ పనిచేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.** ఇందులో ఉండే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు వివిధ రకాల సౌందర్య సమస్యలను దూరం చేయడంలో పని చేస్తాయి. వెదురుతో ఇన్ని ప్రయోజనాలు న్నాయి కాబట్టే కొరియన్లు తమ సౌందర్య పరిరక్షణలో " భాగంగా దీన్ని ఎక్కువగా వాడుతుంటార! మరి, అందాన్ని ద్విగుణీ కృతం చేయడంలో వెదురు ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాంరండి..



●.అందానికి.. జుట్టు ఆరోగ్యానికి..! వెదురులో సిలికా, యాంటీ ఆక్సిడెంట్ల స్థాయులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి తేమనందించి మృదువుగా మార్చుతాయట.

● మొటిమల కారణంగా చర్మం బయటి పొర దెబ్బతింటుంది. వాతావరణంలోని వాతావరణం, ఇతర కాలుష్య కారకాలు చర్మంపై దాడి చేస్తాయి. ఈ వెదురు ఎక్స్‌ట్రా ట్రాక్ట్ తయారు చేసిన సౌందర్య సాధనాలను ఉపయోగించడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ●డీటాక్సి ఫయింగ్ ఏజెంట్‌గా వెదురుకు పేరుంది. కాబట్టి దీనితో తయారు చేసిన సౌందర్య ఉత్పత్తులు/ సాధనాల్ని తరచుగా ఉపయోగించడం వల్ల చర్మవంతంగా మారుతుందట. ● ఫ్రీరాడికల్స్ చర్మాన్ని దెబ్బ తీస్తాయి. ఫలితంగా ముఖంపై ముడతలు, గీతలు.. స్థిర ఏర్పడే ప్రమాద ముంది. అదే వెదురుతో తయారుచేసిన ఉత్పత్తిని తరచుగా వాడితే ఫలితం ఉంటుంది. వీటి వల్ల చర్మం తేమగా, మృదువు గా మారు తుందంటు న్నారు నిపుణులు. ఫలిత వెదురు ఎక్స్‌టెట్రాక్ట్ యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలుం టాయి. ఇవి అలర్జీలు, రాషెస్ వంటి చర్మ సమస్యలను దూరం చేయడంలో సహకరి స్తాయట. అందుకే వెదురు ట్రాక్ట్ తయారు చేసిన క్లెన్సర్లు, బాడీవాష్లను చర్మానికి ఉపయో గించడం ఎక్స్ మేలంటున్నారు. నిపుణులు. ● వెదురులోని సిలికా చర్మ సౌందర్యానికే కాదు.. జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తుం దట.

**ఎలా వాడాలి?** చర్మ సంరక్షణ, కేశ సౌంద ర్యం, గోళ్ల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే వెదురు ప్రస్తుతం మార్కెట్లో.. సీరమ్, షీట్ మాస్కులు, ఫేస్ మిస్ట్, మాయిశ్చ రైజర్లు, క్లెన్సర్ల రూపంలో అందుబాటులో ఉన్నాయి. అలాగే వెదురు ఎక్స్‌ట్రా ట్రాక్ట్ తయారుచేసిన షాంపూలు, కండిష నర్లు సైతం అందుబాటు లో ఉన్నాయి. అయితే వీటిని ఎంచుకునే ముందు నిపుణుల సలహా తీసుకోవడం, ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మాత్రం మర్చిపోవద్దు. □

**చెలి చిట్కా**

పిల్లల ఆహారపు అలవాట్లను క్రమక్రమముగా పెంపొందించాలి.
2. టేబుల్ మానర్స్ నేర్పాలి. పాలుతాగుటప్పుడు ఆహారం తినేటప్పుడు నివారించకూడదు.
3. స్వీట్, ఐస్‌క్రీమ్‌లు తక్కువగా ఇవ్వాలి. ఆకుకూరలు ఎక్కువ తినేటట్లు ఆసక్తి కల్పించాలి. □



సాంకేతిక రంగంలో మహిళల సంఖ్య పెరగడమే కాదు... ఉన్నత స్థానాల్లో నిలబడి తను సత్తా చాటుతోంది. తాజాగా గేమింగ్ రంగాన్నే శాసించే మైక్రోసాఫ్ట్ గేమింగ్ (ఎక్స్ బాక్స్) కొత్త సీఈఓగా భారత సంతతి మహిళ ఆశా శర్మ నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాల పాటు మైక్రోసాఫ్ట్ సేవలందించి రిటైర్ అవుతున్న దిగ్గజ నేత ఫిలిప్ స్పెన్సర్ స్థానంలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టడం.. ఇప్పుడు ఓ సంచలనం.

# దిగ్గజ సంస్థల్లో తనదైన ముద్ర..

భారతీయ కుటుంబంలో, విలువలతో కూడిన వాతావరణంలో పెరిగారు ఆశ చిన్నప్పటి నుంచీ. చురుకైన అమ్మాయి. కష్టపడటం ఒక్కటే సరిపోదు. ఆ కష్టానికి స్పష్టమైన లక్ష్యమూ ఉండాలి అని తల్లిదండ్రులు చెప్పిన మాట మంత్రంగా ఆమె తన భవిష్యత్తును నిర్మించుకోవడం ఆరంభించారు. ఆశ బిజినెస్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. 17 ఏళ్ల వయసులోనే ఎస్ సీ జాన్సన్ అండ్ సన్లో మార్కెటింగ్ నిర్వహించడం ఆరంభించారు. ఈ అనుభవం ఆమె కెరియర్‌కు బలమైనప్రునాదివేసింది. ముఖ్యంగా కార్గిల్, డెలాయిట్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం తెచ్చి పెట్టింది. చదువయ్యాక ఆశ ఒక ఎన్జీవోను స్థాపించారు. మిలియన్ డాలర్ల కంటే ఎక్కువగానే నిధులను సేవాకార్యక్రమాల కోసం సేకరించారట. 2011లో మైక్రోసాఫ్ట్‌లో చేరారామె. అయితే కొన్నాళ్లకే అంటే 2013లోనే ఆ సంస్థను వీడారు. ఆ తర్వాత పలు అంతర్జాతీయ టెక్ కంపెనీలలో పనిచేశారు. రెండేళ్ల క్రితం తిరిగి మైక్రోసాఫ్ట్‌లోని కోర్ ఏఐ సీనియర్ అధికారి హోదాలో చేరారు. ప్లాట్‌ఫామ్‌లో నిర్మాణం, పార్ట్‌నర్‌షిప్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్స్‌లో ఆమెకు ఉన్న అపారమైన అనుభవం ఇప్పుడు ఆమెను గేమింగ్ నాయకత్వం వహించేలా చేసింది. ఆశాశర్మ పేరు టెక్ లోకంలో మారుమోగడానికి కారణం ఆమె ఫేస్‌బుక్ మెటా, ఇన్‌స్టకార్ట్ వంటి సంస్థల్లో కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా ఫేస్ బుక్ మెసెంజర్ వైస్ ప్రెసిడెంట్గా ఆమె... కోట్లాది మంది ప్రజలకు చేరువయ్యారు. ఇన్‌స్టాకార్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా క్లిష్ట సమయాల్లో కంపెనీని లాభాల బాట పట్టించడంలో ఆమె చేసిన వ్యూహాలు అద్భుతంగా పనిచేశాయి.

**సవాళ్లున్నాయి...** గత రెండు సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్ పనిచేస్తూ సంస్థ అంతర్గత వ్యవస్థలు, గేమింగ్ నిర్మాణం, స్టూడియోల సృజనాత్మక శక్తి... వంటి విషయాలన్నీ లోతుగా అర్థం చేసుకున్నాయి. అయితే, మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికతతో కూడిన తీవ్రమైన పోటీని ఇవ్వడం ఆమె ముందున్న సవాళ్లు ఏఐఐత కంటే మనుషుల సృజనాత్మకతతో కూడిన ఆటలకే తన ప్రాధాన్యత అంటారామె. 'వ్యక్తిగత జీవితం కుటుంబం ' ఆశ తన వ్యక్తిగత జీవితాన్ని చాలా గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతారు. వందల కోట్ల సామ్రాజ్యాన్ని శాసిస్తున్నా ఆమె కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తారు. □

లౌకిక అలౌకిక కార్యాచరణా వ్యవహారములేదైనా సరే 'సంకల్పం' చేసి ప్రయత్నించేటప్పుడు.. అందులో ధర్మబద్ధమైన 'సత్ సంకల్పమున్నప్పుడు.. అంటే? ఆ సంకల్పసిద్ధికి ప్రతిఫల మాశించని సంకల్ప శుద్ధి తోడైనప్పుడు మాత్రమే మనం చేసేయత్నానికి ప్రయత్నాననికి పరిపూర్ణమైన ప్రతిఫలం లభిస్తుందని అంటారు. ఆత్మజ్ఞానులు, తత్వవేత్తలు 'ప్రతిచర్యకు దానికి వ్యతిరేక దిశలో సమానమైన ప్రతిచర్య ఉంటుంది. అనే న్యూటన్ మహాశయుని, న్యూటన్ మూడవ గమన సూత్రం ఆత్మ శక్తికి కూడా అన్వర్థిస్తుంది కదా! సృష్టి స్థితిలయ కారకుడు జగమంతా అణువణువు నా ఆక్రమించి తేజోవంతమై! విశ్వతోముఖంగా,

# మానవ సేవే మాధవ సేవ

అనంతరంగా విస్తరించి వున్న విశ్వాత్మ సర్వ వ్యాపకుడు పరమాత్ముడు నీరు పల్లమెరిగినట్లు తనకు కూడా తనకు శరణాగతుడైన భక్తునికి సేవకుడై దాసాను దాసుడైన భగవానుడు, సంసార ఘోరసాగరమున మునిగి, అడగడుగనా ఆపదల కొట్టుమిట్టాడుతునాననడని ఆ భక్తుణ్ణి అన్ని విధాల ఆదుకొనడానికి, తమ పరమ భక్తుని హృదయాంతరాళంలోనికి అవలీలగా ప్రవేశించి, రక్షించి, ఆతని నిలువెల్ల కళ్లు చేసుకొని క్షణక్షణం, అనుక్షణం, పతీక్షణమూ ఎదురు చూస్తుంటాడు మరి 'గజేంద్ర మోక్షాణినికి కారుకుడైన గగేంద్ర వాహనుడు! విద్యుత్ వాహకములో విద్యున్నిరోధక పదార్థములు అడ్డుపడితే, ఆ విద్యుద్వాహకము ద్వారా విద్యుచ్ఛక్తిని ఏ మాత్రం ప్రవహింప జేయ జాలము కదా! అలాగే విశ్వ విరాట్ స్వరూపుడై సకల లోకాలతో నిండివున్న సర్వేశ్వరునిపై ఆ భక్తునికి వున్న మెండైన ప్రాగాఢ శ్రద్ధాభక్తి విశ్వాసములే గాక, పరిపూర్ణమైన వినయ గుణశీల సంపదలతో తన హృదయ సింహద్వారములను తాను తెరచి వుంచడమే తరువాయి, ఆ భక్తునికి, భక్త జనసులభుడైన ఆ భగవంతుడ, లక్ష్మీనారాయణుడు, శరణాగతవత్సలుడు, ఆ సర్వేశ్వరుడు. అకింఠిత దీక్షాపరుడైన ఆ భక్తుని హృదయ కుహరంలోనే ఉద్భవించి ఆ పరమభక్తుని హృదయ సంహాసనాన్ని అదిష్ఠించి, ఆతని జన్మకు సార్థకతను చేకూర్చగలడు. ! విశ్లేశ్వరుని విశ్వచైతన్యశక్తి స్వరూపభక్తుని హృదయగర్భాలయంలోనికి ఒక్కసారి ప్రవేశిస్తే చాలు.

- గండికోట యతిరాజులు

# ఏ పాత్ర ఎన్నాళ్లు !



వంట గదిలో గిన్నెలు.. మనకో ఎమోషన్! ఇది మా పుట్టింటి వారు సారెలో ఇచ్చిన ప్యాన్.... అది పక్కింటి పిన్నిగారి గృహప్రవేశం గిఫ్. అంటూ ఏళ్లకేళ్లు వాడేస్తాం. కానీ తెలుసా.. వంటింటి గిన్నెలకు కూడా ఎగ్సైరీ డేట్ ఉందా? కొన్నాళ్లు వాడాక పక్కన పెట్టేయాలని? లేదంటే వ్యాధులకు కారణం కాగలవని?.. అందుకే ఇది చదవండి. ఏ పాత్రలు అయినా సరే మొదటి సంవత్సరం మాత్రమే పూర్తి స్థాయిలో వాడాలి. సంవత్సరం గడిచాక వాడకం తగ్గించాలి. ✦ నాన్‌స్టిక్ వాటిల్లో అడుగు అంటకుండా వంట అయిపోతుందని ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. కానీ వీటిని మరీ ఎక్కువగా వాడటం అంత మంచిది కాదు. ముఖ్యంగా గీతలుపడ్డ గిన్నెలను ఉపయోగిస్తే పీఎస్‌ఓఏ, ఇతర హానికారక రసాయనాలు విడుదల చేయబడ్డాయి. దీని ద్వారా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉంటుంది. ✦ అల్యూమినియం పాత్రలు వాడేకొద్దీ బరువు తగ్గుతాయి. కొన్నాళ్లకు పక్కన పెట్టేయాలి. ముఖ్యంగా టమాట, చింతపండు, నిమ్మకాయ వంటి ఆమ్లాలు వండినప్పుడు కరిగి ఆహారం శరీరంలో చేరుతుంది. ఇలా ఎక్కువకాలం జరిగితే నాడీ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. ఇప్పటికే థైరాయిడ్ లక్షణాలు ఉన్న వారికి అస్సలు మంచిది కాదు. ✦సిరామిక్ పూతతో కూడిన ప్యాన్ల కింద అల్యూమినియం బేస్ ఉంటుంది. ఇవి వాడేకొద్దీ పొర అరిగిపోవచ్చు. ఇది అల్యూమినియం లీచింగ్‌కి ఉంది. అందుకే కొన్నాళ్లకు మార్చేయాలి. ✦ తక్కువ నాణ్యత గల స్టెయిన్లెస్ స్టీల్ నికెల్ లోహం ఉంటుంది. ఇది మన ఆహారంలో కలిస్తే అలెర్జీ సమస్యలు వచ్చే ప్రమాదముంది. కొనేటప్పుడే నాణ్యమైనవి తీసుకుంటే కన్నాళ్లపాటు వాడుకోవచ్చు. □

# వాపుల్ని తగ్గించే చామంతి తేనీరు!

చామంతి పూలను తల్లో పెట్టుకోవడం, అలంకరణకు ఉపయోగించడం, పూజకు వాడటం వంటివన్నీ తెలుసు... కానీ, దీనితో టీని కూడా తీసుకోవచ్చు. తయారు చేసుకో తెలుసా? లేదంటే తాగి చూడండి. ఎన్నెన్ని ప్రయోజనాలున్నాయో మీకే అర్థమవుతుంది. చామంతుల్లో ఎన్నో రకాలున్నాయి. కానీ, క్రిసాంతిమమ్ మోరిఫోలియం, సి. ఇంటికమ్... పువ్వుల నుంచి తయారైన, కెఫీన్ లేని కషాయమే ఇది. ఈ పూలను ప్రత్యేక శిక్షణలో డ్రై చేసి అమ్ముతారు. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో ఇది చాలా పాపులర్. సాధారణంగా దీన్ని వేడి తగ్గించడానికీ, రోగ తీవ్రతను పెంచడానికీ వాడతారు. ఓ గ్లాసు బాగా మరిగిన నీళ్లల్లో నాలుగైదు పువ్వులను వేసి 34 నిమిషాలు ఉంచితే సరి. కాస్త ముడి చక్కెర లేదా తేనె కలుపుకొని తాగితే చాలు. విటమిన్ ఇ, సి, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలన్నీ లభిస్తాయి.



ఇందులో అధికంగా ఉండే ఫ్లేవనాయిడ్లు... ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపుల్ని తగ్గిస్తాయి. అంతేకాదు, ఈ టీ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. జుట్టునీ నిగనిగ లాడేలా చేయగలదట. అయితే, గర్భిణులు, పాలిచ్చే తల్లులు వైద్యుల సలహా లేనిదే తీసుకోకూడదనే విషయం మగిలిపోవద్దు. □

## తెర

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లిచట్టంబి' ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ

# 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10విడుదల



సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. 'పళ్లిచట్టంబి' సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటు న్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఏప్రిల్ 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు 'పళ్లిచట్టంబి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే ప్రఖ్యాతిగాంచిన ఒక పురాతన చర్చి నేపథ్యంగా ఆసక్తికరంగా ఈ టీజర్ ప్రారంభ మవుతుంది. ఆ భగవంతుడి ఆలయం మీద కొందరు దెయ్యా ల్లాంటి మనషుల కన్నుపడుతుంది. ఆ రాక్షసులు అమాయకు లైన ప్రజల్ని హింసించడం టీజర్‌లో చూపించారు. 'మనుషులు సైతాను ఎదురెదురుగా ఉండే ప్రదేశంలో దేవుడితో పనేంటి.. అనే డైలాగ్ ఈ మూవీ నేపథ్యం, కథలోని కాన్ ఫ్లిక్ట్ ఎలా ఉండబోతోంది అనే అంశాలపై క్యూరియా సిటీ క్రియేట్ చేస్తోంది. ఈ ఆల యాన్ని, అమా యక ప్రజల్ని కాపా డేందుకు కథా నాయకుడు ఎలాంటి పోరాటం చేశాడు అనేది టీజర్ కు హైలైట్ గా నిలుస్తోంది. 50, 60 దశకాల నేప థ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ సరికొత్తగా కని పించి ఆకట్టు కుంటున్నారు. లిరిసిస్ట్ కృష్ణకాంత్ నాకు మంచి మిత్రుడు. కృష్ణకాంత్, ప్రశాంత్ వర్మ, నేను కలుస్తుండేవాళ్లం. ప్రశాంత్ నేను కలిసి డైలాగ్ ఇన్ ది డార్క్ అనే ఇండియా ఫస్ట్ వర్చువల్ ఆడియో షార్ట్ ఫిలిం చేశాం.

# 'గాయపడ్డ సింహం' వరల్డ్ వైడ్ రిలీజ్




అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి గాయపడ్డ సింహంతో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. మే 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.ఈ ప్రాజెక్ట్‌కు మరింత బలాన్ని చేకూరుస్తూ, దిల్ రాజు థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేసి, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి, విష్ణు ఓయ్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో నటించారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. దిల్ రాజు గారు ఈ సినిమాని రిలీజ్ చేయడానికి తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఎందుకంటే ఆయన టచ్ చేసిన ఏ సినిమా అయినా అద్భుతంగా ఆడుతుంది. పవన్ సాదినేని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. దిల్ రాజు గారికి స్పెషల్ థాంక్యూ. ఆయనకి టీజర్ కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమా రిలీజ్ చేస్తున్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా రిలీజ్ చేస్తున్న దిల్ రాజు గారికి ధన్యవాదాలు.

చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్ రెడ్డి, యూవీ క్రియేషన్స్ 'బైకర్' హైవోల్టేజ్ రైడ్ ట్రైలర్ లాంచ్ చార్మింగ్ స్టార్ శర్వా, భిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హై



# 'బైకర్' ట్రైలర్ లాంచ్

ఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరిండానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. డాల్బీ సినిమా, EPIQ, 4Dశ్రీ, PCశ్రీ వంటి ప్రీమియం ఫార్మాట్లలోఈ చిత్రాన్ని ఘనంగా విడుదల కానుంది. దీంతో ఈ యాక్షన్‌ప్యాక్డ్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఇండియన్ రేసర్లు ప్రపంచ స్థాయి ప్రతిభావంతు లతో సమానంగా నిలబడగలరా అని ఒక ఫారిన్ స్పోర్ట్స్ యాంకర్ ప్రశ్నించడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. శర్వ ఈ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. రేసర్ గా ఆయన ప్రజెన్స్ అదిరిపోయింది. ఈ పాత్ర కోసం ఆయన ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ మెస్మరైజ్ చేస్తోంది. రాజశేఖర్ రాజీపడని తండ్రి గురువుగా పాత్రకు బలాన్ని చేకూర్చారు. ఆయన రీఎంట్రీలో ఇంతటి ఇంటెన్స్ పాత్రలో అతన్ని చూడటం కొత్తగా వుంది. అలజడితో కూడిన విక్కీ ప్రపంచంలో మాళవిక నాయర్ ప్రశాంతతను అందిస్తుంది. విజువల్ గా ట్రైలర్ అబ్బురపరిచింది. జె యువరాజ్ కెమెరా వర్క్ మోటోక్రాస్‌లోని ప్రమాదం, వేగాన్ని అత్యంత అద్భుతంగా చిత్రీకరించగా, గిబ్రాన్ అందించినఉత్కంఠభరితమైన సంగీతం ప్రతి రేసును ఒళ్లు గగుర్పొడిచే అనుభవంగా మారుస్తుంది. 'బైకర్' ట్రైలర్ రెగ్యులర్ స్పోర్ట్స్ డ్రామాలకు భిన్నంగా ఒక హైవోల్టేజ్ రైడ్‌ను అందిస్తుందని ప్రామిస్ చేస్తోంది.ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్ళింది.

# SYG (సంబరాల ఏటిగట్టు) నుంచి బ్రిటిషుగా శ్రీకాంత్ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్



మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్ ఇండియా స్పెక్టికల్ SYG (సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవు తున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో సీనియర్ హీరో శ్రీకాంత్ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఈ రోజు శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన్ని బ్రిటిషుగా పాత్రలో ప్రజెంట్ చేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ రిలీజ్ చేశారు. ప్రతి గాయాన్ని ఒక పతకంలా ధరించే సైనికుడుగా ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది.సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయకృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతున్న సంబరాల ఏటిగట్టు" ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌గా నిలుస్తోంది.

# 'తెరచాప' చిత్ర ట్రైలర్ లాంచ్..

తెరచాప ట్రైలర్ చూస్తుంటే ఆహ్లాదకరమైన బ్యాగ్రౌండ్



నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో నవీన్ రాజ్ శంకరప్పు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్య పాత్రలో నటించగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, ఫిష్ వెంకట్, జబర్దస్త్ అశోక్, నాగి, అప్పారావు, రైసింగ్ రాజు, రాజేష్ భూపతి, నాగ వంశీ, శ్రీనివాస్ నేస, చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషించారు. అజీమ్, వెంకట్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేసిన ఈ చిత్రానికి ప్రజల్ క్రిష్, ఎం.ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. రాజు బొడసింగి ఎడిటింగ్ చేయగా జీవన్ జార్జ్ కోరియోగ్రఫీ చేశారు. విడుదల తేది దగ్గరవుతున్న సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేయడం జరిగింది. మ్యూజిక్ తో మొదలై సముద్ర తీరంలో ఉండే ఒక ఊరి కథలా అనిపిస్తుంది. ఊరంటే మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలుతో పాటు రాజకీయాలు, భేద భావాలు ఉండడం కూడా సహజమే. అటువంటి పరిస్థితుల మధ్య ఒక యువకుడు తన ఊరిలో ఉన్న పరిస్థితుల పట్ల పోరాడుతున్నట్లు అర్థమవుతుంది. డైలాగ్స్ ఇంకా టేకింగ్ చాలా బాగున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక బెంచ్ మార్క్ సృష్టించే విలేజ్ పొలిటికల్ డ్రామాలా అనిపిస్తుంది.

# చిరంజీవికి సంగీతం అందించాలనేది నా డ్రీమ్ :

కె రాబిన్



కొందరు తమ గోరంత ప్రతిభను కొండంతలుగా చెప్పుకుంటారు. మరికొందరు ఎంత ప్రతి భావంతులైనా ప్రచారాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతుంటారు. ఈ రెండో కేటగిరీకి చెందిన యంగ్ టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె రాబిన్. తన 8 ఏళ్ల సంగీత ప్రస్థానంలో 20 కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించారు మార్క్ కె రాబిన్. వాటిలో నాగార్జున నటించిన ది ఘోస్ట్, ప్రియదర్శి మల్లేశం, తేజ సజ్జ జాంబీరెడ్డి, తాప్సీ మిషన్ ఇంపాజిబుల్, నవీన్ పోలిశెట్టి నటించిన ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ వంటి విజయవంతమైన చిత్రాలున్నాయి. తాజాగా దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డ్ ను సొంతం చేసుకున్నారు మార్క్ కె రాబిన్. ఈ సందర్భంగా సంగీత దర్శకుడిగా తన ప్రస్థానాన్ని, తన ప్రయాణంలోని విశేషాలను వెల్లడించారు. దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా గద్దర్ అవార్డ్ దక్కడం సంతోషంగా ఉంది. ప్రేక్షకులకు మరింత మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు ఒక స్ఫూర్తిగా ఈ అవార్డ్ నిలుస్తుందని నమ్ముతున్నాను. గద్దర్ అవార్డ్‌తో సంగీత దర్శకుడిగా నాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను. గద్దర్ అవార్డ్ ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గార్లకు కృతజ్ఞతలు నాకు బాల్యం నుంచే సంగీతం మీద ఇష్టం ఉండేది. నేను టీచర్‌గా వర్క్ చేశాను.

# మ్యాచ్ ఫినిషర్లతో బౌలర్లకు చుక్కలే

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ ఇపుడు పూర్తిగా బ్యాట్స్‌మన్ గేమ్‌గా మారింది. వారి ధనాధన్ బ్యాటింగ్ స్టేడియంలోని ప్రేక్షకులకు, టీవీ తెరలపై మ్యాచ్ చూస్తున్న వీక్షకులకు వినోదం ఇస్తున్నా, బౌలర్లకు మాత్రం చుక్కలు చూపిస్తోంది. భారీ స్కోర్లు, 150 ప్లస్ స్ట్రయిక్ రేట్లు, వరుస సిక్సర్లు... ఇవి అన్నీ కలిసి బౌలర్లకు కష్టకాలం తెచ్చిపెట్టాయి. ఈ ట్రెండ్ 2026 ఐపీఎల్‌లో ఇంకా పెరిగే అవకాశం ఉంది.

గత కొన్ని సీజన్లలో ఐపీఎల్‌లో స్కోర్లు భారీగా పెరిగాయి.ఒకప్పుడు 180నుంచి 200 స్కోరు సేఫ్‌గా భావించేవారు. కానీ ఇప్పుడు 250ప్లస్ పరుగులు సాధారమయ్యాయి. పవర్ ప్లే నుంచి బౌలర్లపై బ్యాట్స్‌మన్ దాడి ప్రారంభమవుతోంది. బౌలర్ ఎవరన్నది కాదు బంతి స్టాండ్‌లోకి పంపామా అన్నదే ముఖ్యమైపోయింది.అలాగే ఎంతసేపు క్రీజ్‌లో ఉన్నారన్నది కాదు ఎంత వేగంగా బాదారా అన్నదే ఫ్యాన్స్ చూస్తున్నారు. దీంతో 250 ప్లస్ స్కోరు చేసినా ఖచ్చితంగా గెలుస్తామన్న నమ్మకం జట్లకు లేకుండా పోతోంది.

ఒకప్పుడు జట్టు కాంబినేషన్ బ్యాటింగ్, బౌలింగ్ సమన్వయంగా ఉందా అని చూసేవారు. ఇపుడు బౌలింగ్ వీక్ అయినా ధనాధన్ బ్యాటింగ్‌తో కవర్ చేయాలని ప్రయత్నిస్తోంది. బ్యాటింగ్ జట్టు తరపున ఇన్నింగ్స్ ప్రారంభించే వ్యక్తిని ఓపెనర్ అని, మ్యాచ్‌ను ముగించే వ్యక్తిని ఫినిషర్ అని అంటారు. ఐపీఎల్‌లోని ఏ జట్టులో మ్యాచ్ ఫినిషర్లు ఉంటే ఆ జట్టునే హాట్ ఫేవరెట్‌గా భావిస్తున్నారు. దీంతో మ్యాచ్ ఫినిషర్లు ముగ్గురుకి తగ్గకుండా ప్రతి జట్టు చూసుకుంటోంది. ప్రస్తుత ఐపీఎల్‌లో పది జట్టు ఉంటే మ్యాచ్ ఫినిషర్లు 30కు పైగా ఉన్నారు.




**ఇండియన్ కాసుల క్రికెట్.. ఐపీఎల్ థీమ్ పూర్తిగా మారిపోయింది. ఐపీఎల్ అంటే ఎంటైర్‌టైన్‌మెంట్ లీగ్‌గా మారిందన్న విమర్శలూ ఉన్నాయి. గ్రౌండ్‌లో ఉన్న మూడు గంటల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించడమే పనిగా పెట్టుకుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ పిచ్‌లు, ఇంపాక్ట్ ప్లేయర్లు, పవర్ ప్లేలు, డేత్ ఓవర్లు... ఇలా బ్యాట్స్‌మెన్ డామినేటింగ్ గేమ్‌గా మార్చేశాయి. బంతి పడ్డది పడ్డట్లు స్టాండ్స్‌లోకి తరలించే హార్డ్‌హిట్టర్లకు గిరాకీ పెరిగింది. క్షణాల్లో మ్యాచ్‌ను మార్చేసే గేమ్ ఫినిషర్లూ పెరిగాయి. హార్డ్‌హిట్టర్లు బాదే సిక్స్‌లు, బౌండరీల వర్షంలో క్రికెట్ ఫ్యాన్స్ తడిసిముద్దయితే.. వారిని మరింత ఎంటర్‌టైన్ చేసేందుకు చీర్ లీడర్స్ స్టెప్పులు అదనపు హంగులుగా మారాయి.**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టు అయిన ముంబై ఇండియన్స్‌లో హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్, విల్ జాక్స్ రూపంలో ముగ్గురు గేమ్ ఫినిషర్లు ఉన్నారు. ఇక ముంబై ఇండియన్స్ లాగానే చాలా విజయవంతమైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌లో కూడా ఎంఎస్ ధోని, శివమ్ దూబే, కార్తిక్ శర్మ, డెవాల్డ్ బ్రెవిస్ రూపంలో నలుగురు బలమైన ఫినిషర్లు ఉన్నారు. ఐపీఎల్ డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీ జట్టులో కూడా ప్రమాదకరమైన గేమ్ ఫినిషర్లు ఉన్నారు. గత సీజన్‌లో ఆర్‌సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో వారు కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా, ఈ సీజన్‌లో కూడా ఆర్‌సీబీ జట్టులో టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్ రూపంలో ముగ్గురు గేమ్ ఫినిషర్లు ఉన్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో డేవిడ్ మిల్లర్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ వంటి మ్యాచ్‌లను ముగించగల ముగ్గురు అద్భుతమైన ఫినిషర్లు ఉన్నారు. 2026 ఐపీఎల్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్... జట్టులోకి లియామ్ లివింగ్ స్టోన్ అనే కొత్త ఫినిషర్‌ను చేర్చుకుంది. ఆ జట్టులో ఇప్పటికే హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ అనే ఇద్దరు మ్యాచ్ ఫినిషర్లు ఉన్నారు. గుజరాత్ టైటాన్స్‌లో జాసన్ హోల్డర్, రాహుల్ తెవాటియా, గ్లెన్ ఫిలిప్స్‌తో సహా ముగ్గురు బలమైన ఫినిషర్లు ఉన్నారు.

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్‌జెయింట్స్ తరపున మ్యాచ్‌లను ముగించే బాధ్యతను నికోలస్ పూరన్, ఆయుష్ బదోని, అబ్దుల్ సమద్ వహించనున్నారు.రాజస్థాన్ రాయల్స్ జట్టులో కూడా మ్యాచ్ ఫినిషర్లకు కొదువ లేదు. జట్టులో వైభవ్ సూర్యవంశీ వంటి విధ్వంసకర ఓపెనర్ ఉండగా, షిమ్రాన్ హెట్మైర్,శుభమ్ దూబే, డోనోవన్ ఫెరీరా వంటి ఫినిషర్లు ఉన్నారు.

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మ్యాచ్ ఫినిషర్ ఆండ్రీ రస్సెల్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. అయితే, ఆ జట్టులో ఇప్పటికీ రింకు సింగ్, రమన్‌దీప్ సింగ్, పావెల్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. పంజాబ్ కింగ్స్ జట్టులో శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్‌లతో సహా ముగ్గురు అద్భుతమైన ఫినిషర్లు ఉన్నారు.

మ్యాచ్ ఫినిషర్లతో పాటు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రోహిత్ శర్మ, సూర్యవంశీ, విరాట్‌కోహ్లి వంటి హార్డ్ హిట్టింగ్ ఓపెనర్లు, పవర్ హిట్టర్లు ఎలాగూ ఉండనే ఉన్నారు. ఇక బౌలర్లకు చుక్కలు ఖాయం.

## భారత్ టూర్‌కు ఆసీస్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించనుంది. ఇందుకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా అంతర్జాతీయ క్యాలెండర్‌ను ప్రకటించింది. ఇక వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు రానున్న ఆస్ట్రేలియా జట్టు.. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు ఆడనుంది. ఈ నేపథ్యంలో.. భారత్‌లో ఒక్కసారి కూడా టెస్టు సిరీస్ గెలవని కమిన్స్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియోన్ వంటి ఆటగాళ్లకు ఇదే ఆఖరి సిరీస్ కావొచ్చని సీఏ పేర్కొంది. ఒకవేళ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్-2027 ఫైనల్‌కు అర్హత సాధిస్తే జూన్‌లో ఇంగ్లండ్ వేదికగా ఆసీస్ ప్రత్యర్థితో తలపడుతుంది.

## ఖాళీ స్టేడియాల్లో పాక్ లీగ్

**లాహోర్:** అంతర్జాతీయ ఆటగాళ్లంతా ఐపీఎల్ వైపు మొగ్గు చూపుతుండగా.. పాకిస్థాన్ సూపర్ లీగ్ వెలవెలబోతోంది. విదేశీ ఆటగాళ్లకు ఉగ్ర సంస్థల నుంచిబెదిరింపులు వస్తుండడంతో ఒక్కొక్కరుగా ఇంటిదారి వైదొలుగుతున్నారు. దీంతో పాక్ లీగ్‌లో కీలక మార్పులు చేశారు. ఈనెల 26 నుంచి జరిగే లీగ్ ఆరంభ మ్యాచ్‌లను ప్రేక్షకులు లేకుండానే నిర్వహించనున్నారు. అలాగే మ్యాచ్‌లన్నింటినీ కరాచీ, లాహోర్‌లో మాత్రమే ఆడించనున్నారు. గతంలో ఈ రెండింటితో పాటు ముల్తాన్, పెషావర్, ఫైసలాబాద్, రావల్పిండిలో మ్యాచ్‌లు జరిగేవి. కాగా ప్రారంభ వేడుకలను సైతం రద్దు చేశారు.పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా, ఆర్థిక పొదుపు చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీ తెలిపారు.పరిస్థితులు చక్కబడితే ప్రేక్షకుల్ని అనుమతించే అంశాన్ని పరిశీలిస్తారు.

## అల్కరాజ్‌కు అన్‌సీడెడ్ కోర్డా షాక్



**మియామి:** మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సంచలనం నమోదయ్యింది. పురుషుల ప్రపంచ నంబర్ వన్ కార్లోస్ అల్కరాజ్‌కు అన్ సీడెడ్ సెబాస్టియన్ కోర్డా షాకిచ్చాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో అల్కరాజ్ 3-6, 7-5, 4-6తో సెబాస్టియన్ చేతిలో ఓటమి పొంది టోర్నీ నుంచి నిష్క్రమించాడు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ మ్యాచ్‌లో కోర్డా తొలి సెట్ నుంచే టాప్ సీడ్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. తొలి సెట్‌ను 6-3తో సునాయాసంగా నెగ్గిన కోర్డా.. రెండో సెట్‌ను అల్కరాజ్‌కు కోల్పోయాడు. అయితే నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకున్న సెబాస్టియన్ కోర్డా పదునైన సర్వీస్‌లతో అల్కరాజ్‌ను మట్టికరిపించి తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 2022లో మియామి ఓపెన్ నెగ్గిన అల్కరాజ్ మరోసారి టైటిల్ నెగ్గాలని ఆశించినప్పటికీ మూడో రౌండ్‌కే పరిమితమయ్యాడు.కాగా మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సెబలెంకా ప్రత్యర్థిపై ఈజీ విక్టరీతో ముందంజ వేసింది.



### ఫిడే క్యాండిడేట్స్ టోర్నీకి
## హాంపి దూరం

**హైదరాబాద్:** భారత ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కఠినమైన నిర్ణయం తీసుకుంది. ప్రతిష్ఠాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలిగింది. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నందున భద్రతపై ఆందోళనగా ఉందని చెప్పిన ఆమె.. బాంబుల మోతల మధ్య చెస్‌పై శ్రద్ధ పెట్టడం సాధ్యమవ్వదని వాపోయింది. ఈ విషయాన్ని సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది.

మధ్యఆసియాలోని సిప్రస్‌లో ఈనెల28 నుంచి మొదలయ్యే ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆడడం లేదని హంపి పేర్కొంది. నిర్వాహకులు భరోసా కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో సురక్షితంగా ఉంటా నని నాకు అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధ తో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకో వాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టు బడి ఉన్నానని హంపి వెల్లడించింది.

### 10 వేల యూరోల జరిమానా

కోనేరు హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపిపై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్‌కాట్ చేసినందుకు ఆమె 10 వేల యూరోల ఫైన్ చెల్లించనుంది. ప్రపంచ ఛాంపియన్ కావాలంటే ఈ టోర్నీలో పాల్గొంటేనే సాధ్యమవుతుంది. కోనేరు హంపి వైదొలగడంతో ఈ టోర్నీకి ఎంపికైన భారత యువకెరటాలు దివ్య దేశ్‌ముఖ్, వైశాలి

## నిజామాబాద్‌లో ఫ్యాన్ పార్క్




**ముంబై:** స్టేడియానికి వెళ్లక్కర్లేదు.. టికెట్ అక్కర్లేదు.. ఐపీఎల్ 2026 ఫ్యాన్ పార్కులతో హాయిగా మ్యాచ్‌లు వీక్షించే అవకాశాన్ని బీసీసీఐ తీసుకువచ్చింది. నిజామాబాద్‌తో సహా 15 నగరాల్లో స్టేడియం వంటి అనుభూతిని ఉచితంగా పొందవచ్చు. ఈ ఏడాది ఫ్యాన్ పార్కులను వశని, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 11 రాష్ట్రాల్లోని 15 నగరాలను ఇందు కోసం బీసీసీఐ సెలక్ట్ చేసింది.

మార్చి 28, 29 తేదీల్లో హర్యానా లోని రోహ్‌తక్‌తో పాటు భోపాల్, నాగ్‌పూర్, కర్ణాటకలోకి తుమకూరు, పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ఫ్యాన్‌పార్క్‌లు ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ 4, 5 తేదీల్లో నిజామాబాద్‌తో పాటు మధుర, జోధ్‌పూర్, మైసూర్, భువనేశ్వర్... ఏప్రిల్ 11, 12 తేదీల్లో మీరట్, నడియాడ్, రత్నగిరి, కోయంబత్తూరు, రూర్కెలాలో నిర్వహిస్తారు. ఫ్యాన్ పార్క్‌లు మినీ కార్నివాల్‌లా ఉంటుంది. ఇక్కడ లైవ్ స్క్రీనింగ్‌తో పాటు అదిరిపోయే సంగీతం, వినోద కార్యక్రమాలు, ఫుడ్ కోర్టులు ఉంటాయి. రాజధానులకు దూరంగా ఉండే నగరాల్లోనూ ఐపీఎల్ క్రేజ్ పెంచేందుకు ఫ్యాన్ పార్కులను బీసీసీఐ ప్రతి ఏటా ఏర్పాటు చేస్తోంది.

## ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి

ముంబై: భారత రూపాయి.. యుఎస్ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో బలహీనపడింది. సోమవారం ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి 93.94 వద్ద రికార్డు తక్కువ స్థాయికి చేరుకుంది.ఇది మునుపటి క్లోజ్‌తో పోలిస్తే 41 పైసలు పడిపోయింది. ఆఫ్‌షోర్ ట్రేడ్‌లో కూడా రూపాయి 94ను దాటింది. పశ్చిమాసియాలో (వెస్ట్ ఆసియా) కొనసాగుతున్న యుద్ధం కారణంగా గ్లోబల్ క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 112 పైగా ట్రేడ్ అయి ట్రంప్ యుద్ధం తాత్కాలిక బ్రేక్‌ప్రకటన వెలువడగానే 100 డాలర్ల దిగువకు చేరింది.

రూపాయి క్షీణత భారతదేశం వంటి చమురు దిగుమతి దేశానికి భారంగా మారింది. భారత్ ప్రతి బ్యారెల్‌కు గతం కంటే 50 అదనంగా చెల్లిస్తోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో యుఎస్ డాలర్ బలంగా ఉండటం, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిరంతర నిధుల వెలువడటం (ఫారిన్ అవుట్‌ఫ్లోస్) కూడా రూపాయి



పతనానికి కారణమవుతున్నాయి.

ఇది సేఫ్‌హేవెన్ డిమాండ్‌ను పెంచి డాలర్‌ను మరింత బలోపేతం చేస్తోంది. కాగా మధ్యాహ్నం ట్రేడ్‌ముగిసేనాటికి డాలరుతోరూపాయి మారకం విలువలు 94.12కి చేరాయి. మొత్తం 48 పైసలు క్షీణించింది. ట్రేడింగ్ తొలినాళ్లలోనే 33 పైసలు క్షీణించింది. వారం ప్రారంభంలోనే ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకోవడంతో భారత్ విదేశీ కరెన్సీ ఖజానాపై భారం పడుతోంది.

### భారీ నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
## రూ.15 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి



**ముంబయి, మార్చి 23:** పశ్చిమాసియా యుద్ధం దేశీయ స్టాక్ మార్కెట్లను వణికిస్తోంది. యుద్ధం ప్రారంభం అయినప్పటినుంచి మార్కెట్ ఘోరంగా దెబ్బతింటోంది. ఇప్పటికే భారీ నష్టాలను చవిచూసింది. ప్రస్తుతం యుద్ధం ముగిసే పరిస్థితులు కనిపించడం లేదు. రోజురోజుకు హెచ్చరికలు బెదిరింపులతో మధ్యప్రాచ్యం తీవ్రత మరింత ముదురుతోంది.దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇక సోమవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు చివరి దాకా అదే ఒరవడి కొనసాగించాయి. అన్ని రంగాలు సూచీలు ఘోరంగా దెబ్బతిన్నాయి. దీంతో పెట్టుబడిదారుల లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. దాదాపు రూ.15 లక్షల కోట్లకు పైగా ఇన్వెస్టర్లు నష్టపోయారు.

బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 429 లక్షల కోట్లకుపైగా ఉండగా ఇప్పుడు అది రూ. 414లక్షల కోట్లుగా ఉంది. ఈ క్రమంలో ఇవాళ్టి సెషన్‌లో రూ. 15 లక్షల కోట్లకుపైగా నష్టపోయినట్లు నిర్ధారణ అయింది. సెషన్ ఆరంభంలోనే దాదాపు ఈ స్థాయి నష్టాలతో సూచీలు ప్రారంభం కాగా నిమిషాల్లో లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. సెన్సెక్స్ 1,836 పాయింట్లు నష్టపోయి 72, 696 దగ్గర ముగియగా నిఫ్టీ 601 పాయింట్లు నష్టపోయి 22, 512 దగ్గర ముగిసింది. ఇక రూపాయి విలువ ఘోరంగా దెబ్బతింది. సోమవారం రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.97 దగ్గర సరికొత్త రికార్డు కనిష్ట స్థాయి దగ్గర ముగిసింది.

ఇక నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జియో ఫైనాన్షియల్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్ కార్ప్, టీసీఎస్ లాభపడ్డాయి. రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, పీఎస్‌యు బ్యాంక్ రంగాల సూచీలు ఒక్కొక్కటి 4 శాతం కంటే ఎక్కువగా పడిపోవడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 3.81శాతం క్షీణిస్తే బిఎస్ఇ 250 స్మాల్ క్యాప్ సూచీ 3.86శాతం నష్టపోయింది. మార్కెట్ల పరంగా ఎన్ఎస్ఇలో 331 షేర్లుపెరిగితే 3007 షేర్లు పతనం చెందాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 94.12వద్ద ట్రేడ్ అయింది ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లుకూడా 6.74శాతం దిగజారి రూ.1,34,751కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 1.31 డాలర్లుపెరిగి 113.50 డాలర్లవద్దట్రేడ్ అయింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 4.70శాతం దిగజారింది. ఎయిర్‌ఫ్లోవా రైల్ టెక్నాలజీ కూడా 4.62శాతం క్షీణించింది. వారీ ఎనర్జీస్ 3.19 శాతం, అశోక్‌లేల్యాండ్ 4.11శాతం, మోనార్క్ సర్వేయర్స్ 2.67 శాతం, పిరమల్ ఫైనాన్స్ 3.19శాతం దిగజారాయి.సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్‌సంస్థ ఐపిఒలో ఇష్యూ బిడ్లు ప్రారంభమయ్యాయి.తొలిరోజే 0.25 రెట్లు ట్రేడ్ అయ్యాయి.24వతేదీ ముగుస్తుంది. ఇష్యూధరను రూ.163నుంచి రూ.172గా నిర్ణయించారు.

## ఆన్‌లైన్ పేమెంట్లకు కొత్తరూల్స్



**ముంబయి, మార్చి 23:** ఆన్‌లైన్ పేమెంట్లను మరింత సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బిఐ కొత్త నిబంధనలను తీసుకొస్తోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ రూల్స్ అమలుకానున్నాయి. సైబర్ నేరాలు, అనధికారిక లావాదేవీలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను తీసుకొస్తోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని డిజిటల్ లావాదేవీలకు కనీసం రెండు రకాల భద్రతా ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఒక పాస్‌వర్డ్ లేదా ఒక ఓటీపీ మాత్రమే కాకుండా అదనపు సెక్యూరిటీ లేయర్‌ను రిజర్వ్ బ్యాంక్ తప్పనిసరి చేసింది. టూఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. పాస్‌వర్డ్స్, పిన్ నంబర్స్, ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీలు లేదా సాఫ్ట్‌వేర్ ఆధారిత అథెంటికేషన్ వంటివి అదనంగా ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రతి ట్రాన్సాక్షన్‌కు ఒక ఫ్యాక్టర్ అథెంటికేషన్ అనేది ప్రత్యేకంగా జనరేట్ చేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. బ్యాంకులు హైరిస్క్ ట్రాన్సాక్షన్ల విషయంలో అదనపు తనిఖీలు చేయాలి. ఒక భద్రతా కోడ్‌ను తస్కరించినా రెండో లేయర్ భద్రత వల్ల ట్రాన్సాక్షన్ పూర్తి చేయడం వారికి కష్టమవుతుంది. ప్రతి లావాదేవీ జరిగిన వెంటనే వినియోగదారులకు ఎస్ఎంఎస్, ఇమెయిల్ లేదా ఇన్‌యాప్ నోటిఫికేషన్ల ద్వారా తక్షణ సమాచారం అందేలా బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు చర్యలు తీసుకోవాలి. ఆన్‌లైన్ వెబ్‌సైట్లు లేదా యాప్స్‌లలో కార్డు వివరాలను సేవ్ చేసేటప్పుడు టోకనైజేషన్ ప్రక్రియను మరింత పటిష్టం చేయనున్నారు. దీంతో మీ అసలు కార్డు వివరాలు వ్యాపారులకు తెలియకుండా గోప్యంగా ఉంటాయి. ఆటో డెబిట్ లేదా సబ్‌స్క్రిప్షన్ల విషయంలో వినియోగదారుడి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అదనపు ఛార్జీలను వసూలు చేయకూడదు. ప్రతి పేమెంట్‌కు ముందు రిమైండర్ పంపాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకువస్తున్న ఈ కొత్త మార్పులు ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను మరింత పటిష్ఠం చేస్తుంది. దీర్ఘకాలంలో వినియోగదారుల ఆర్థిక భద్రతకు ఎంతో మేలు చేస్తుంది. ఏప్రిల్ 1 నుంచి బ్యాంకింగ్ యాప్స్ లేదా పేమెంట్ వాలెట్లలో ఈ కొత్త భద్రతా ఫీచర్లను బ్యాంకులు తీసుకువస్తున్నాయి.

### ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది
## పన్నురిటర్నులు పూర్తిచేయండి

**ముంబయి, మార్చి 23:** ఆర్థిక సంవత్సరం 202526 ముగింపు దశకు వచ్చేసింది. మార్చి 31, 2026 నాటికి పన్ను చెల్లింపుదారులు, సామాన్య ఇన్వెస్టర్లు పూర్తి చేయాల్సిన పలు కీలకమైన ఆర్థిక అంశాలు పూర్తిచేయాల్సి ఉంది. కేవలం ఆదాయపు పన్ను రిటర్నులే కాకుండా పాన్ కార్డు, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పెట్టుబడులు ఇతర ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఈ పనులు మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయకపోతే భారీగా పెనాల్టీలు చెల్లించడమే కాకుండా కొన్ని ఆర్థిక సేవలు నిలిచిపోయే ప్రమాదమూ ఉంది. ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించి ఏదైనా ఆదాయాన్ని వెల్లడించకపోయినా లేదా తమ ఐటీ రిటర్నుల్లో తప్పులున్నా వాటిని సరిదిద్దుకుని అప్‌డేటెడ్ రిటర్నులు దాఖలు చేసేందుకు మార్చి 31 చివరి అవకాశం. పాత పన్ను విధానం ఎంచుకున్న వారు సెక్షన్ 80సి కింద రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఎల్ఐసీ, పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్ వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టడానికి ఇదే ఆఖరి తేదీ. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ లేదా సుకన్య సమృద్ధి యోజన వంటి ఖాతాలు కలిగి ఉన్నవారు ఆ ఖాతాలు యాక్టివ్‌గా ఉండాలంటే కనీస వార్షిక మొత్తాన్ని మార్చి 31 లోపు జమ చేయాలి. మీరు ఇంకా పాన్ కార్డు కావాలన్నా,మార్పులు చేయాలనుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు డేట్ ఆఫ్ బర్త్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. కొన్ని ముఖ్యమైన లావాదేవీల వివరాలు కచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది.




పన్ను చెల్లింపుదారులు తమ వార్షిక పన్ను అంచనాలో చివరి విడత చెల్లింపులను మార్చి నెలలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ గడువు మార్చి 15తో ముగిసినా మార్చి 31 వరకు చెల్లించవచ్చు.గడువు దాటితే డబుల్ వడ్డీ చెల్లించాల్సి రావచ్చు. బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ పాలసీలకు సంబంధించి కేవైసీ వివరాలు ఈనెల 31 లోపు పూర్తి చేయాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి టీడీఎస్ మినహాయింపు పొందాలనుకునే సీనియర్ సిటిజన్లు, ఇతరులు ఈఫారాలను సకాలంలో బ్యాంకులకు సమర్పించాలి. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఎల్టీసీజీ కింద రూ. 1.25 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రయోజనం పొందడానికి అవసరమైన లావాదేవీలను పూర్తి చేయాలి.

డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ ఫోలియోలలో నామినీలను చేర్చడం లేదా అప్‌డేట్ చేయడం పూర్తిచేయాలి. సెక్షన్ 80ఎ కింద అదనపు పన్ను మినహాయింపు పొందాలనుకునే వారు తమ ఆరోగ్య బీమా ప్రీమియంలను మార్చి 31 లోపు చెల్లించి ఆ రసీదులను భద్రపరుచుకోవాలి. మార్చి 31దాటితే పన్ను మినహాయింపులు కోల్పోవడమే కాకుండా, పెనాల్టీల భారం పడే అవకాశం ఉంది. కొన్ని ఖాతాలు ఇనాక్టివ్ గా మారిపోతాయి.

## దిగివస్తున్న వెండి,పసిడి ధరలు

ముంబయి, మార్చి 23: మద్యప్రాచ్యం యుద్ధంతో బంగారం రేట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్న సంగతి తెలిసిందే. అయితే సోమవారం ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.5521 తగ్గి రూ.1,38,971కి చేరాయి. అంతకుముందు రోజు సెషన్‌లో రూ.1,44,492కి చేరింది. అఖిలభారత సరాఫా అసోసియేషన్‌ప్రకారం ఢిల్లీలో పసిడి 10 గ్రాములకు రూ.1,52,650వద్దట్రేడ్ అయింది. ఇక స్పాట్ మార్కెట్లలో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాములు రూ.5950 తగ్గి రూ. 1,40,020గా ఉంది.ఆభరణాల బంగారం కూడా 5450 తగ్గి రూ.128,350గా కొనసాగింది. 18 కేరట్ల బంగారం కూడా గ్రాముకు రూ.446 తగ్గి రూ.10,502 వద్ద స్థిరపడింది. గ్లోబల్, దేశీయ మార్కెట్లలో గడచిన 43 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా పసిడిధరలు నలిచాయి. 1983 తర్వాత ఒకేవారంలో పసిడిధరలు ఈ భారీస్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి.గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 10శాతం క్షీణించి 4352 డాలర్లకు పడిపోయింది. ఇదే తీరుకొనసాగి 4100 డాలర్ల వరకూ వెళ్లే అవకాశం ఉంది. భారత్ ఎంసిఎక్స్‌లో 10 గ్రాముల బంగారానికి రూ.1.36లక్షలమవద్ద మద్దతుకనిపించింది. అలాగే వెండిధరలు కూడా రూ.2.30 లక్షలుగా కొనసాగింది. ఒకేరోజు రూ.20వేలు క్షీణించింది.

## వాడుకలో లేని ఖతాలకు ఇపిఎఫ్ఒ సెటిల్‌మెంట్




**న్యూఢిల్లీ, మార్చి23:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఖాతాదారుల కోసం కీలక నిర్ణయం తీసుకుంటోంది. చాలా కాలంగా వాడుకలో లేని పీఎఫ్ ఖాతాల్లోని క్లెయిమ్ చేయని నిధులను ఆటోమెటిక్‌గా సెటిల్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. దీని కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ సెటిల్‌మెంట్ వ్యవస్థను తీసుకురానుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఖాతాదారులు ఎలాంటి క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండానే వారి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతాయి. నివేదికల ప్రకారం, తొలి దశలో భాగంగా ఆధార్ వెరిఫై అయిన సుమారు 8లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలను ప్రాసెస్ చేయనున్నారు. ఈ ఖాతాల్లో దాదాపు రూ. 5,200 కోట్ల నిధులు ఉన్నట్లు అంచనా. వీటిలో 14,000 ఖాతాల్లో రూ.5లక్షలకు పైగా, 38,000 ఖాతాల్లో రూ. లక్ష నుంచి 5లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ. 10,181 కోట్ల డిపాజిట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నట్లు ఈపీఎఫ్ఓ గుర్తించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.